ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 27.02.2025 | సంపుటి : 11 సంచిక : 227 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## దోషులుగా తేలిన నేతలపై జీవితకాల నిషేధం

సుప్రీంలో పిటీషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన కేంద్రం

అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, కేవలం ఆరేళ్ల నిషేధం సరిపోతుందని నివేదిక

న్యూఢిల్లీ(జనంసాక్షి):వివిధ కేసుల్లో దోషులుగా తేలిన నేతలపై జీవిత కాల నిషేధాన్ని విధించాలన్న అభ్యర్థను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కేసులో సదరు వ్యక్తిపై ఆరేళ్ల పాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తెలిపింది. ఓ వ్యక్తిపై జీవిత కాల నిషేధం అనేది కఠినతరమని పేర్కొంది. అయితే రాజకీయ నేతలపై జీవిత కాల నిషేధం ఎన్నేళ్లు అనే దానిపై నిర్ణయాధికారం పార్లమెంట్‌దేనని ఈ సందర్భంగా కేంద్ర

మిగతా 2లో..

## ఏపీ అధికారులు కావాలనే గైర్హాజరయ్యారు

ఉద్దేశపూర్వకంగానే కేఆర్‌ఎంబీ సమావేశానికి రాలేదు

తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా అసంతృప్తి

హైదరాబాద్(జనంసాక్షి): కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో హైదరాబాద్‌లోని జలసౌధలో కేఆర్‌ఎంబీ సమావేశం జరిగింది. భేటీలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ పాల్గొన్నారు. ఇవాళ కూడా ఏపీ అధికారులు హాజరుకాకపోవడంతో గురువారం మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. ఏపీ అధికారులు హాజరుకాకపోవడంపై రాహుల్

మిగతా 2లో..

## ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు

మొత్తం 18,180 మందికి రూ. 6వేల చొప్పున జమ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఉపాధి కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేసింది ప్రభుత్వం. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నిధులు జమ అయ్యాయి. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో

మిగతా 2లో..



## మెట్రో ఫేజ్-2 కు అనుమతివ్వండి

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి • మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్‌కు నిధులివ్వండి

- పెరుగుతున్న అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయండి
- సెమీకండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలి
- రీజినల్ రింగ్‌రైల్, డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి
- ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ(జనంసాక్షి): హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్-2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతించాలని అభ్యర్థించారు. ప్రధాని మోదీతో ఆయన అధికారిక నివాసంలో

మిగతా 2లో..



## ఆ ఐదు ప్రాజెక్టులకు అనుమతులు తీసుకొస్తే కిషన్‌రెడ్డిని గండపెండేరంతో సత్కరిస్తా

మెట్రో విస్తరణకు ఆయన మోకాలడ్డుతున్నాడు

తనకు పేరొస్తుందనే అడ్డుపుల్లలు వేస్తున్నారు

కాళేశ్వరంతో లింక్ ఉన్న ముగ్గురూ అనుమానాస్పద మృతిచెందారు

కేటీఆర్ వీటిపై ఎందుకు స్పందించడం లేదు?

ఢిల్లీలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి):హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు ఆరోపించారు. బుధవారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ అంశాలపై స్పందించారు. ప్రధానితో భేటీ సందర్భంగా 5 ప్రధాన అంశాలపై

మిగతా 2లో..



## మరో రెండురోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తాం

స్పష్టం చేసిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ఐదు రోజూ టన్నెల్‌లో ముమ్మరంగా కొనసాగుతున్న సహాయకచర్యలు

చిక్కుకున్న వారిని కాపాడేందుకు తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్న 11 సంస్థలు

మహబూబ్‌నగర్(జనంసాక్షి):ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సొరంగమార్గంలో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు .. రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రమాద స్థలికి చేరుకునేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు వివరించారు. దేశ సరిహద్దుల్లో టన్నెల్స్ నిర్మించే నిపుణులు, ఎక్కడ టన్నెల్ ప్రమాదం జరిగినా సహాయక చర్యల్లో పాల్గొన్న ఎక్స్‌పర్ట్స్‌ను తీసుకొచ్చి వారి సాయం తీసుకుంటున్నామని తెలిపారు. 'సహాయక చర్యలు మరింత వేగవంతం చేస్తున్నాం. గ్యాస్ కట్టర్‌తో కట్

మిగతా 2లో..

## స్పందన అద్భుతం

బయో ఏషియా సదస్సు విజయవంతంపై మంత్రి శ్రీధర్‌బాబు హర్షం

పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ




హైదరాబాద్(జనంసాక్షి):బయో ఏషియా-2025 సదస్సుకు తాము ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చిందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బయో ఏషియా సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. "బయో ఏషియా చరిత్రలో ఈ ఏడాది సదస్సు ఒక మైలు రాయిగా నిలస్తుంది. దేశ, విదేశాల నుంచి 4వేల మంది ఫార్మా, హెల్త్ కేర్ ఇండస్ట్రీ లీడర్స్, పాలసీ మేకర్స్, ఆవిష్కర్తలు హాజరయ్యారు. హెల్త్, ఫార్మా రంగాలకు చెందిన 100 మంది నిపుణులు ఆయా రంగాల్లో నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో 200కు పైగా బీ టూ బీ (బిజినెస్ టూ బిజినెస్) మీటింగ్స్ జరిగాయి. గతేడాది కంటే ఈసారి ఎక్కువ పెట్టుబడులు వచ్చాయి. అమెరికాకు చెందిన బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ 'ఆమ్జెన్' మన దగ్గర భారీగా పెట్టుబడి పెట్టింది. ఈ సంస్థ వల్ల సుమారు మూడు వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ఏడాది సదస్సుకు దేశ భవిష్యత్తును మార్చే సత్తా ఉన్న ప్రతిభ గల యువ ఆవిష్కర్తలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. వారి ఆలోచనల్లో నుంచి పుట్టుకొచ్చిన ఈ ఆవిష్కరణలు ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తాయి. మొత్తం 84 స్టార్టప్స్ సదస్సు లో పాల్గొన్నాయి. ఆవిష్కరణలకు అండగా ఉండేందు కు, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు, పరిశ్రమలతో కలిసి పని చేసేందుకు

మిగతా 2లో..

## ఫార్మసీరంగంలో అంతర్జాతీయ స్థాయికి హైదరాబాద్

లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో ముందంజ

డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో భారత్

బయో ఏషియా సదస్సు ముగింపు కార్యక్రమంలో కిషన్ రెడ్డి

వార్త 2లో

## పనితీరు,ఆర్థికసహకారం ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టండి



కేంద్రానికి కేటీఆర్ డిమాండ్

స్టాలిన్‌కు తన మద్దతు ఉంటుందని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే.. ఆయా రాష్ట్రాలు అందిస్తున్న ఆర్థిక భాగస్వామ్యానికి అనుగుణంగా చేపట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దన్న తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యాఖ్యలకు ఆయన మద్దతు తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.దేశ అవసరాలకు తగినట్లు కుటుంబ నియంత్రణను బాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం తగదని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల పనితీరును పరిగణనలోకి

మిగతా 2లో..

## కేంద్రం తీసుకునే ఏ నిర్ణయంలోనైనా దక్షిణాదికి అన్యాయం జరగదు



2026 ఎన్నికల్లో డీఎంకే ఓటమి పాలవుతుంది: అమిత్‌షా భరోసా

కోయంబత్తూర్(జనంసాక్షి): కేంద్రం తీసుకునే ఏ నిర్ణయంలోనైనా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్రమంత్రి అమిత్ షా భరోసా ఇచ్చారు జాతీయ విద్యావిధానంలో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతి ప్రాచీన భాష తమిళం అని పేర్కొన్నారు. అటువంటి గొప్ప భాషలో మాట్లాడలేక పోతున్నందుకు తనను క్షమించాలని ఆయన అక్కడి ప్రజలను కోరారు.అధికార డీఎంకే ప్రభుత్వంపై

మిగతా 2లో..

## నివాసాల మధ్య కూలిన సైనిక విమానం

సాధారణ పౌరులతోసహా 46 మంది మృతి

పదిమందికి తీవ్రగాయాలు.. సూడాన్‌లో ఘోర దుర్ఘటన

టేకాఫ్ అయిన కాసేపటికే చోటుచేసుకున్న ప్రమాదం

వాడి సయిద్నా(జనంసాక్షి):సూడాన్‌లో మంగళవారం ఘోర విమాన ప్రమాదం చోటుచేకుంది. వాడి సయిద్నా వైమానిక స్థావరం నుంచి ఓ సైనిక విమానం టేకాఫ్ అయిన కాసేపటికే నివాసాల మధ్య కుప్పకూలిందిఈ ఘటనలో 46మంది సైనిక సిబ్బందితో పాటు పలువురు పౌరులు సైతం ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పది మందికి పైగా గాయపడినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదని.. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఘటనా స్థలంలో ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.సూడాన్‌పై పట్టు కోసం సైన్యం పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ మధ్య కొనసాగుతున్న అంతర్యుద్ధం ఇటీవల తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో న్యాలా ప్రాంతంలో ఇటీవల ఓ సైనిక విమానాన్ని కూల్చివేసినట్లు దార్ఫర్ పశ్చిమ ప్రాంతాన్ని నియంత్రిస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ ప్రకటించింది. ప్రమాదానికి ఈ ఘర్షణలకు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.



## పోలీస్‌స్టేషన్ సమీపంలో మహారాష్ట్ర ఆర్టీసీ బస్సులో మహిళపై అత్యాచారం

పుణెలో సంచలనం

పుణె(జనంసాక్షి): ఆర్టీసీ బస్సులో ఓ మహిళపై అత్యాచారం జరగడం మహారాష్ట్రలో సంచలనంగా మారింది. పుణెలోని ఓ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో పార్కు చేసిన బస్సులో ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. నిత్యం రద్దీగా ఉండే స్వర్‌గేట్ బస్టాండ్‌లో జరిగిన ఈ ఘటనపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు

మిగతా 2లో..



## ముదురుతున్న వివాదం

ఫైవ్‌ఐస్ నుంచి కెనడాను సాగనంపేందుకు అమెరికా సన్నాహాలు



న్యూయార్క్(జనంసాక్షి):కెనడాతో విభేదాలు మరింత పెంచేందుకు అమెరికా యత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా దాని ప్రధాన మిత్ర దేశాలతో కలిసి ఏర్పాటుచేసిన ఇంటెలిజెన్స్ కూటమి 'ఫైవ్‌ఐస్' నుంచి కెనడాను బయటకు పంపనున్నట్లు తెలుస్తోంది.ట్రంప్‌నకు అత్యంత సన్నిహిత సలహాదారుల్లో ఒకరైన పీటర్ నవర్రో ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధంచేయగా.. దీనిపై చర్చలు జరుగుతున్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక బాంబు పేల్చింది. ఒట్టావోపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం.ఈ ప్రతిపాదనకు ట్రంప్ మద్దతు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి పీటర్ ఈ ప్రతిపాదన తీసుకొచ్చిన వేళ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బ్రిటన్‌ను కూడా తప్పుపట్టారు. అక్కడ పెరిగిపోతున్న వలస ముస్లింల జనాభానుద్దేశించి.. అణ్వాయుధాలు ఉన్న అసలైన దేశంగా బ్రిటన్ మారుతోందన్నారు. ట్రంప్ ప్రధాన అజెండా అయినా మేక్ అమెరికా గ్రేట్ అగైన్‌ను పూర్తిచేయాలంటే ఇంగ్లిష్ మాట్లాడే మిత్ర దేశాలను అమెరికా దూరం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఫైనాన్షియల్ టైమ్స్ రిపోర్టును పీటర్ మాత్రం నాన్సెన్స్ అంటూ కొట్టిపారేశారు.మరోవైపు ట్రంప్ అధికారం చేపట్టిన నాటినుంచి కెనడాను 51వ రాష్ట్రంగా అభివర్ణిస్తూ దానిని విలీనం చేసుకోవాలనే కోర్కెను బయటపెట్టారు. అంతేకాదు.. ఆ దేశ ప్రధాని ట్రూడోను గవర్నర్‌గా సంబోధించారు. తాజాగా ఆ దేశంపై ఒత్తిడి తెచ్చేందుకు 25శాతం సుంకాలను సిద్ధం చేశారు. మార్చి నుంచి ఇవి అమల్లోకి రానున్నారు. రెండో ప్రపంచయుద్ధం విజయంలో ఇంటెలిజెన్స్ సహకారం కీలకపాత్ర పోషించిందని గుర్తించిన అమెరికా, యూకే.. 1946లో విశ్వసనీయ సమాచార మార్పిడి కోసం ఐఐజూం ఒప్పందం చేసుకున్నాయి.

మిగతా 2లో..

## కుంభమేళాకు రాని నేతలను బహిష్కరించాలట!

కేంద్రమంత్రి రాందాస్ ఆఠవలే వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేలపై కేంద్రమంత్రి రాందాస్ ఆఠవలే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, ఉద్ధవ్ ఠాక్రే మహాకుంభమేళాను సందర్శించకుండా హిందూ సమాజాన్ని అవమానపరిచారన్నారు. అందుకుగాను హిందూ ఓటర్లు

మిగతా 2లో..



## కుదిరిన సయోధ్య

ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య మరో కీలక ఒప్పందం

ఇజ్రాయెల్ దేశీయుల మృతదేహాలను అప్పగించేందుకు అంగీకరించిన హమాస్

ప్రతిగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు అంగీకరించిన టెల్‌అవీవ్



గాజాస్ట్రిప్(జనంసాక్షి):ఇజ్రాయెల్-హమాస్ ల మధ్య మరో కీలక ఒప్పందం కుదిరింది. తమ చెరలోని ఇజ్రాయెల్ దేశీయుల మృతదేహాలను అప్పగించేందుకు హమాస్.. వందల మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు టెల్‌అవీవ్‌లు అంగీకరించాయని ఇరువర్గాల అధికారులు తెలిపారు. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం మరికొన్ని రోజులు చెక్కుచెదరకుండా ఉందని వెల్లడించారు.తమ బందీలను విడుదల చేసేటప్పుడు హమాస్ వారితో క్రూరంగా ప్రవర్తించిందని ఇజ్రాయెల్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ప్రతిగా విడుదల చేయాల్సిన 600 మందికి పైగా పాలస్తీనా ఖైదీల విడుదలను నిరవధికంగా ఆలస్యం చేస్తున్నట్లు ప్రకటించింది. దీన్ని హమాస్ కొట్టిపడేసింది. అంతేకాక.. రెండోదశ కాల్పుల విరమణ చర్చలపై మిలిటెంట్ సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో కాల్పుల విరమణను గాడిలో పెట్టేందుకు మధ్యవర్తులు (ఈజిప్టు, ఖతార్ దేశాలు) ప్రయత్నించారు. అందులోభాగంగా ప్రతినిధుల బృందంలోని అధికారులు మంగళవారం ఈజిప్టులో చర్చలు జరిపారు.

మిగతా 2లో..

## పండగపూట విషాదాలు

గోదావరిలో స్నానానికి వెళ్లి ఐదుగురు యువకులు గల్లంతు

తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలో దుర్ఘటన

శ్రీశైలంలో క్షేత్రంలోని లింగాలగట్టు వద్ద స్నానాలాచరిస్తూ ముగ్గురుభక్తుల మృతి

తాళ్లపూడి(జనంసాక్షి): తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడిలో విషాదం చోటుచేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందారు. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు.నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపోవడంతో

మిగతా 2లో..

## పనితీరు,ఆర్థికసహకారం ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టండి

తీసుకోకుండా పునర్విభజన చేయడం ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దేశ నిర్మాణంలో తెలంగాణ, దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న కృషిని ఎవరూ విస్మరించలేరని పేర్కొన్నారు. దేశ జనాభాలో తెలంగాణ కేవలం 2.8 శాతం మాత్రమే ఉండగా.. జీడీపీకి 5.2 శాతం భాగస్వామ్యం అందిస్తోందని కేటీఆర్ వివరించారు.

**స్టాలిన్‌కు కేటీఆర్ మద్దతు**

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారత దేశానికి అన్యాయం జరుగుతుందన్న వ్యాఖ్యలకు మద్దతిచ్చారు. దేశానికి అత్యవసరమైనప్పుడు కుటుంబ్ర నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం తగదని అన్నారు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్రను పరిగణనలోకి తీసుకోకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయడం ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిజంగానే నియోజకవర్గాల పునర్విభన చేయాలని భావిస్తే.. అది దేశానికి అందించే ఆర్థిక సహకారం వాటా ఆధారంగా ఉండాలని ప్రతిపాదించారు. దేశ నిర్మాణానికి తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న కృషిని ఎవరూ విస్మరించలేరని అన్నారు. దేశ జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.8 శాతం మాత్రమే ఉందని.. కానీ దేశ జీడీపీలో మాత్రం 5.2 శాతం కంటే ఎక్కువ వాటా అందిస్తోందని పేర్కొన్నారు.

## దక్షిణాదికి అన్యాయం జరగదు

ఈ సందర్భంగా విరుచుకుపడ్డారు. 2026 ఎన్నికల్లో దేశ వ్యతిరేక పార్టీ అయిన డీఎంకే ఓటమి పాలవుతుందని.. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2024 భాజపాకు చారిత్రాత్మక ఏడాదిగా నిలిచిందని షా అన్నారు. అదే ఏడాది నరేంద్ర మోదీ మూడో సారి ప్రధానిగా ఎన్నికయ్యారని.. చాలా ఏళ్ల తర్వాత అంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మహారాష్ట్ర, హరియాణా, దిల్లీ ప్రజలు భాజపాపై విశ్వాసంతో తమకు అధికారం కట్టబెట్టారని అన్నారు. కుటుంబ రాజకీయాలను, అవినీతిని అంతం చేస్తూ.. 2026లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్వి భాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఇదే విషయంపై తమిళనాడు సీఎం స్టాలిన్ స్పందిస్తూ...'తమిళ భాషకు, ప్రజలకు, రాష్ట్రానికి నష్టం కలిగించే చర్యలను అనుమతించేది లేదు' అని స్పష్టం చేశారు. దీనిపై తమిళనాడు నేతలకు, కేంద్రానికి మధ్య వాగ్యుద్ధం కొనసాగుతోన్న వేళ తమిళ భాషను కీర్తిస్తూ అమిత్ షా ప్రసంగించడం గమనార్హం.

## పోలీస్‌స్టేషన్ సమీపంలో మహారాష్ట్ర ఆర్టీసీ బస్సులో మహిళపై అత్యాచారం

క్షీణించాయంటూ మండిపడుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. సతారా జిల్లాలోని ఫల్తానాకు చెందిన ఓ మహిళ ఇళ్లలో పని చేస్తుంటుంది. మంగళవారం తెల్లవారుజామున ఆమె పోలీస్‌స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉన్న బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తోంది. ఈ క్రమంలోనే ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చి మాటలు కలిపాడు. ఆమె ఎక్కాల్సిన బస్సు ఇక్కడ లేదని ఓ పక్కన పార్క్ చేశారంటూ నమ్మబలికి తన వెంట తీసుకెళ్లాడు. అక్కడ చీకటిగా ఉండటంతో ఆమె వెనకడుగు వేసినా.. బస్సులో ప్రయాణికులు నిద్రపోతున్నారని, అందుకే లైట్లు ఆర్పేశారంటూ నమ్మించాడు. దీంతో ఆమె బస్సు ఎక్కగా.. వెంటనే లోపలికి వెళ్లి తలుపు వేసి.. అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఉదయం మరో బస్సు ఎక్కిన మహిళ.. తనకు జరిగిన ఈ దారుణం గురించి స్నేహితురాలికి చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు నిందితుడిని దత్తాత్రేయ రాందాస్(36)గా గుర్తించారు. అతడికి గతంలో నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకొనేందుకు ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. "మన ఆడబిడ్డకు ఇలా జరగడం దరదృష్టకరం. ఈ ఘటన బాధాకరం. నేరస్థుడికి ఉరి శిక్ష పడడమే సరైంది. ఈ విషయాన్ని స్వయంగా పరిశీలించి దర్యాప్తు చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని పుణె పోలీస్ కమిషనర్‌ను స్వయంగా ఆదేశించాను. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా ఈ నేరాన్ని తీవ్రంగా పరిగణించి పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే అతడిని పట్టుకుంటాం" అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ అత్యాచార ఘటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పుణెలో శాంతి భద్రతలు క్షీణించాయని.. నేరాలు పెరిగిపోయాయని మండిపడ్డాయి. ప్రజలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందంటూ ఆరోపించాయి. శివసేన (యూబీటీ) నేతలు బస్టాప్ వద్ద నిరసనలు వ్యక్తం చేశారు. "పోలీసులు గస్తీ కాసే ప్రాంతంలోనే ఈ ఘటన జరిగింది. చట్టం పట్ల ఇలాంటి కొందరికి భయం లేకుండా పోయింది. మహిళకు అన్యాయం జరుగుతుంటే పట్టించుకోలేదు. పుణెలో నేరాలను అరికట్టడంలో హోంశాఖ విఫలమైంది" అని ఎన్సీపీ (ఎస్పీ) ఆరోపించింది.

## నేడు తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో 27న జరుగనున్న గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఈ ఎన్నికలు జరుగతనున్నాయి. 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం. ఈ క్రమంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఇలా త్రిపాఠి. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పాత 3 జిల్లాలు, కొత్తగా ఏర్పడ్డ 12 జిల్లాల అధికారుల కోఆర్డినేషన్ బాగుందని.. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామని అన్నారు. సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని అన్నారు త్రిపాఠి.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశామని అన్నారు.విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు త్రిపాఠి. ఇలా త్రిపాఠితో పాటు పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడూతూ.. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుందని అన్నారు.వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారని.. బయటి జిల్లాల నుంచి బ్యాలెట్ పేపర్లను తరలించేటప్పుడు జిపిఎస్ సిస్టం పరిశీలిస్తూ సెక్యూరిటీ ద్వారా తీసుకొస్తామని తెలిపారు. పోలింగ్ అనంతరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అన్ని బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తామని.. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన స్టాం÷-రగ్ రూమ్‌ల్లో పొలిటికల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో భద్రపరుస్తామని అన్నారు. రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని అన్నారు ఎస్పీ శరత్ చంద్ర పవార్.

# మెట్రో ఫేజ్ 2 కు అనుమతివ్వండి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత (కనెక్టవిటీ) సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును అనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని... రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

## ఐదు ప్రాజెక్టులకు అనుమతులు తీసుకొస్తే కిషన్‌రెడ్డిని గండపెండేరంతో సత్కరిస్తా

విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్ కమ్ రైలు ప్రాజెక్టు, డ్రైపోర్టు, రక్షణరంగ ప్రాజెక్టులకు సహకరించాలని కోరినట్టు తెలిపారు.'కాళేశ్వరంపై పిటిషన్ వేసిన రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. కేసు వాదించిన సంజీవరెడ్డి అనుమానాస్పదంగా మృతి చెందారు. కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ దుబాయ్‌లో అనుమానాస్పదంగా చనిపోయారు. ర్యాడిసన్ బ్లూ డ్రగ్స్ కేసులో కేదార్ కీలక నిందితుడు. ఈ అనుమానాస్పద మరణాలపై కేటీఆర్ ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. జ్యుడిషియల్ విచారణ ఎందుకు కోరట్లేదు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల అక్రమాలపై సాంకేతిక నివేదికలు రాకుండా ప్రస్తుతం ఏమీ మాట్లాడను. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల్లో ఉన్న వారిని తీసురావాల్సిన బాధ్యత ఎవరిది? త్వరలో డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోంది. రాష్ట్ర విజ్ఞప్తులు ఐదింటికి కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం. కేబినెట్ ఆమోదం తేవాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే. మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. కేంద్రానికి విజ్ఞప్తి చేసిన ఐదు ప్రాజెక్టులు సాధిస్తే కిషన్‌రెడ్డికి గండపెండేరం తొడుగుతానని అన్నారు. పదేళ్లుగా ఎస్ఎల్‌బీసీ పనులు జరగలేదు. కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ పనులు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పనులు మళ్లీ మొదలయ్యాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు యత్నిస్తున్నాం. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ వద్ద 11 సంస్థలు పనిచేస్తున్నాయి. సొరంగం వద్ద జరిగింది ప్రమాదం. కాళేశ్వరంలో జరిగింది డిజైన్, నిర్మాణ లోపంతో జరిగిన దుర్ఘటన. హైదరాబాద్‌కు మెట్రో రావడానికి ప్రధాన కారకుడు జైపాల్‌రెడ్డి. కేసీఆర్ వచ్చాక మెట్రో కోసం చేసిందేమీ లేదు. మెట్రో విస్తరణపై కేసీఆర్ పదేళ్లు తాత్సారం చేశారని మండిపడ్డారు. ప్రతి నెలా ఒకటో తేదీకి రూ.22,500 కోట్లు అవసరం. ప్రస్తుతం ఆదాయం రూ.18,500 కోట్లు మాత్రమే ఉంది. జీతాలకు రూ.6,500 కోట్లు, వడ్డీలకు రూ.6,800 కోట్లు చెల్లిస్తున్నాం. ఆదాయం రూ.22వేల కోట్లకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం వివరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ సెలగంశెట్టి మృతిపై అనుమానాలున్నాయని, దుబాయ్ లో ఉన్న ఆ మాజీ ఎమ్మెల్యే ఎవరో తేలాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మృతిపై కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేదార్ మరణంతో లింకు ఉన్న డ్రగ్స్ కేసును బయటికి తీసి విచారణ చేస్తామని సీఎం చెప్పారు. త్వరలోనే కేదార్ మృతదేహం ఇండియాకు రానుందని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల మూడు అనుమానస్పద మరణాలు సంభవించాయని చెప్పారు. డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్న కేదార్, కాళేశ్వరం కేసులు వాదిస్తున్న అడ్వొకేట్ సంజీవ రెడ్డి, కేసు వేసిన రాజలింగమూర్తి మృతి చెందారని, వాటిపై కేటీఆర్ న్యాయవిచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ బీజేపీ గెలుపుకోసం పనిచేస్తోందని అన్నారు. సిబీఐ కేసులు అడ్డం పెట్టుకొని బీఅరెస్ ను విలీనం చేసుకోవాలని ఆలోచనలో బీజేపీ ఉందని సీఎం చెప్పారు. ఫార్ములా ఈ, గొర్రెల పంపిణీ కేసులో కేసులో ఈడీ ఇన్వాల్వ్ అయిందని, ఎందుకు చర్యలు తీసుకోలేదని సీఎం ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు మానిటరింగ్ చేస్తోందని, విదేశాల్లో ఉన్న వారిని తీసుకు రావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీఎం అన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న వారు కూడా అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా.? అని అన్నారు.ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎస్ఎల్బీసీని 100శాతం పూర్తిచేసి తీరుతామని చెప్పారు. పెరిగిన అంచనాలతో కలిపి 5000 కోట్ల లోపే ఎస్ఎల్బీసీ పూర్తవుతుందని, దీని ద్వారా మూడున్నర లక్షల ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. తాను ప్రధాన మంత్రికి ఐదు విజ్ఞప్తులు చేసి, వినతిపత్రాలు అందించానని, వాటికి నిధులు తీసుకొస్తే బహిరంగ సభ ఏర్పాటు చేసి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కి సన్మానం చేస్తానని సీఎం చెప్పారు. ఆ క్రెడిట్ కూడా వాళ్లే తీసుకోవచ్చిన చెప్పారు.

## ఏపీ అధికారులు కావాలనే గైర్హాజరయ్యారు

బొజ్జా అసంతృప్తి వ్యక్తం చేశారు. బోర్డు సమావేశం ఏర్పాట్లు చేస్తే.. ఉద్దేశపూర్వకంగానే ఏపీ అధికారులు రాలేదని పేర్కొన్నారు. తన వాదనలు రికార్డు చేసి కేంద్రానికి పంపాలని కోరారు. శ్రీశైలం, సాగర్ నుంచి మే వరకు తమకు 55 టీఎంసీల నీరు కావాలని ఇప్పటికే ఏపీ సర్కారు ప్రతిపాదించింది. శ్రీశైలం, సాగర్ నుంచి మే వరకు తమకు 63 టీఎంసీల నీరు కావాలని తెలంగాణ కోరింది.

## దోషులుగా తేలిన నేతలపై జీవితకాల నిషేధం

ప్రభుత్వం ఖరాకండిగా తేల్చి చెప్పింది. దోషులుగా రుజువు అయితే జీవితకాల నిషేధాన్ని విధించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం తన అభిప్రాయాన్ని వివరిస్తూ.. సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది.దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలంటూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఆ క్రమంలో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తాజాగా తన అభిప్రాయాన్ని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది.

## ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు

ప్రభుత్వం నిధులను జమ చేసింది. మొత్తం 18,180 మందికి 6 వేల చొప్పున జమ అయ్యాయి. అయితే ఆ తర్వాత మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇంది రమ్మ ఆత్మీయ భరోసా నిలిచిపోయింది. కానీ.. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. మంత్రి వినతిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ రెండు జిల్లాల్లో 66,240 మంది ఉపాధి కూలీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించింది సర్కార్. 66,640 మంది కూలీల ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ అయ్యాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు రూ.50.65 కోట్లను తెలంగాణ ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల కోడ్ ముగియగానే లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించనుంది సర్కార్. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఉపాధి కూలీలకు పెద్దదిక్కుగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఉపాధి కూలీలకు ఆర్థిక చేయుత కల్పిస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

## స్పందన అద్భుతం

రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. తెలంగాణను నాణ్యమైన మానవ వనరులకు హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్‌పై దృష్టి సారించాం. సంబంధిత రంగంలో అనుభవమున్న 4 పరిశ్రమల సహకారంతో 'సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ' పేరిట ప్రత్యేక కోర్సును ప్రారంభించాం. మొదటి బ్యాచ్‌లో 140 మంది విద్యార్థులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో 82 మంది అమ్మాయిలే ఉండటం విశేషం. 60 శాతం మంది అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే. పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. మీతో పాటు కలిసి నడుస్తాం. ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటాం. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని బయో ఏషియా-2025 వేదికగా పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేస్తున్నా" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## ఫార్మసీరంగంలో అంతర్జాతీయ స్థాయికి హైదరాబాద్

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ ముత్యాల నగరంగానే కాకుండా, ప్రపంచ ఫార్మసీగా, అంతర్జాతీయ స్థాయి ఆస్పత్రులు హబ్‌గా ఖ్యాతికెక్కిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.22వ ఎడిషన్ బయో ఆసియా-2025 లాంటి గ్లోబల్ ఈవెంట్స్ నగర వేదికగా జరగడం, హెల్త్‌కేర్ రంగంలోని సాంకేతికత, సుస్థిరమైన పద్ధతుల గురించి చర్చించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బుధవారం బయో ఏషియా-2025 సదస్సు ముగింపు కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో వినూత్నమైన ఆవిష్కర్తలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో భారతదేశం విశేషమైన పురోగతి సాధిస్తోందని చెప్పారు. డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు మందులు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ప్రపంచ అవసరాల్లో 60 శాతానికి పైగా వ్యాక్సిన్లు, 20 శాతం జెనరిక్ మందులను భారత్ నుంచే సరఫరా చేస్తున్నామని చెప్పారు. పదేళ్లలో భారత ఫార్మా ఉత్పత్తుల ఎగుమతుల విలువ దాదాపు రెట్టింపు అయిందన్నారు. 2014లో 15 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కాగా, 2024లో ఇది 27.85 బిలియన్ డాలర్లకు పెరిగిందని అన్నారు. భారత్‌లో ఫార్మా ఉత్పత్తులతోపాటు వివిధ రంగాల్లోనూ ఎగుమతులు పెరిగాయని చెప్పారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంపై కేంద్ర ప్రభుత్వం పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతున్న కారణంగానే.. ఈ మార్పులు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలో వస్తున్న ఆర్థిక సంస్కరణల కారణంగా.. భారతదేశం ఇటీవలే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. సమీప భవిష్యత్తులోనే మూడో స్థానానికి ఎగబాకుందనే విశ్వాసం తమకుందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి ఫలితంగా.. రక్షణ రంగంలో దిగుమతులు చేసుకునే పరిస్థితి నుంచి టాప్-25 ఎగుమతుల దేశాల జాబితాలో చేరాం. 2014లో ఒక్క మొబైల్‌ఫోన్ కూడా ఎగుమతి చేయలేని పరిస్థితి నుంచి.. రూ.1.28 లక్షల కోట్ల విలువైన మొబైల్‌ఫోన్లను ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామన్నారు

# రెండురోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తాం

చేసి దెబ్బతిన్న టీబీఎంను వేరు చేస్తాం. ఎస్ఎల్‌బీసీ పూడికలోకి వెళ్లాలని నిర్ణయించాం. మట్టి, నీరుతో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని నిర్ణయించాం. ప్రకృతి విపత్తును రాజకీయం చేసి లబ్ధిపొందాలనుకునే వారి గురించి నేను మాట్లాడదల్చుకోలేదు. దేశ.. విదేశాల్లో ఉన్న టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ సూచనలతో ముందుకెళ్తున్నాం. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని కాపాడటమే మా లక్ష్యం అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

టన్నెల్‌లో చిక్కుకున్న 8మందిని కాపాడేందుకు ఎన్నో ప్రయత్నాలు సాగుతున్నాయి. షిఫ్టుకి వందమందికి పైగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులుగా నిరంతరాయంగా పనులు కొనసాగుతున్నాయి. అందర్నీ సజీవంగా తీసుకొచ్చేందుకు 11 సంస్థలు శ్రమిస్తున్నాయి. గంటలు గడుస్తున్న కొద్దీ టెన్షన్ పెరిగిపోతున్న నేపథ్యంలో.. వీలైనంత త్వరగా లోపలికి చేరుకునేందుకు యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా రెస్క్యూ సిబ్బందికి టీబీఎం చాలెంజింగ్‌గా మారింది. ప్రమాదం జరిగిన దగ్గర టీబీఎం ముక్కలై దాని విడిభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో అక్కడ రెస్క్యూ చేయాలంటే చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఓవైపు బురద, ఇంకోవైపు సీపేజ్ వాటర్, మరోవైపు టీబీఎం ముక్కలతో అత్యంత ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్యాస్ కట్టర్లను ఉపయోగించి తీసేసే ప్రక్రియను జరపాలన్నా.. ఉబికి వస్తున్న నీరు ప్రతిబంధకంగా మారింది. ఇక రెస్క్యూ ఆపరేషన్లో ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ పాలుపంచుకుంటున్నాయి. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ర్యాట్ హోల్ మైనర్స్, సింగరేణి, హైడ్రా టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ మరికొన్ని కంపెనీలు తమ సేవలను అందిస్తున్నాయి. మొత్తం 11 ఏజెన్సీలు నిరంతరం కోఆర్డినేషన్ చేసుకుంటూ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతోన్న సహాయక చర్యలుశ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ)లో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తూ..సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. సొరంగంలో సుమారు 7 నుంచి 9 మీటర్ల ఎత్తున మట్టి పేరుకుపోయింది. ప్రధాన అడ్డంకిగా ఉన్న చివరి 40 మీటర్లలో నీరు ప్రవహిస్తోంది. పూడుకున్న మట్టి తీస్తే తప్ప టీబీఎం ముందు భాగానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు బుధవారం ఆపరేషన్ మార్కోస్ చేపట్టనున్నారు. ఇందుకోసం నేల, నీరు, ఆకాశం... ఎక్కడైనా, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా సహాయక చర్యలకు దిగే సత్తా ఉన్న ఇండియన్ మెరైన్ కమాండో ఫోర్స్ రంగంలోకి దిగనుంది. దీని సభ్యులనే మార్కోస్‌గా పిలుస్తారు. మార్కోస్‌తో బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్(బీఆర్‌వో) భాగస్వామ్యం పంచుకోనుంది.

## కుదిరిన సయోధ్య

ఈ చర్చల్లో మరో నలుగురు బందీల మృతదేహాల అప్పగింతకు సంస్థ అంగీకరించింది. పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు టెల్‌అవీవ్ సైతం ఒప్పుకున్నట్లు హమాస్ ఓ ప్రకటనలో పేర్కొంది.ఇటీవల ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా తమ చెరలో ఉన్న 94 మందిలో 33 మంది బందీలకు హమాస్ స్వేచ్ఛ కల్పించాలి. ప్రతిగా దాదాపు 1700 మందికి పైగా పాలస్తీనీయులకు తమ జైళ్ల నుంచి ఇజ్రాయెల్ విముక్తి కల్పించాలి. ఈ తొలి దశ ఒప్పందానికి ఇంకొక్కవిడత బందీల మార్పిడి మాత్రమే మిగిలిఉండగా.. కాల్పుల విరమణలో కొంత నీలినీడలు అలుముకున్నాయి. తాజా చర్చల్లో అవి తొలగిపోయి.. మరోవిడత బందీల విడుదలకు ఒప్పందం కుదిరింది.



## పండగపూట విషాదాలు

వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు. ఈ క్రమంలో ఒకరినొకరు రక్షించుకునే ప్రయత్నంలో ఆ ఐదుగురూ గల్లంతై ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతులు టి.పవన్ (17), పి. దుర్గాప్రసాద్ (19), పి.సాయి కృష్ణ (19), ఎ. పవన్ (19), జి.ఆకాశ్ (19)గా గుర్తించారు. వీరంతా కొవ్వూరు, తాళ్లపూడి, రాజమహేంద్రవరంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు. యువకులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో విషాదఛాయలు అలముకున్నాయి. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

శ్రీశైలంలో శివరాత్రి వేడుకుల్లో విషాదం

శ్రీశైలంలో తీవ్ర విషాదం నెలకొంది. దర్శనానికి వెళ్లిన ముగ్గురు భక్తులు ప్రమాదానికి గురయ్యారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వేకువజాము నుంచే భక్తులు పెద్దఎత్తున పోటెత్తుతున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ముగ్గురు స్నేహితులు దర్మనానికి వెళ్లారు. అనంతరం లింగాలగట్టు వద్ద స్నానాలు చేసేందుకు నీటిలోకి దిగారు. అయితే స్నానం చేస్తూ కొంచెం లోపలికి వెళ్లడంతో ఈత రాక ఒకరు మునిగిపోయారు. స్నేహితుడిని కాపాడేందుకు వెళ్లిన మిగతా ఇద్దరూ గల్లంతయ్యారు. ప్రమాదాన్ని గమనించిన తోటి భక్తులు సమాచారాన్ని వెంటనే స్థానిక అధికారులు అందించారు.

## ముదురుతున్న వివాదం

ఆతర్వాత ఈ కూటమిని రెండుసార్లు విస్తరించారు. అలా 1956 నాటికి కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు కూడా ఇందులో చేరాయి. దీంతో అది 'ఫైవ్ ఐస్ ఇంటెలిజెన్స్ అలయన్స్'గా రూపాంతరం చెందింది.ఈ కూటమిలోని సభ్యదేశాలకు చెందిన నిఘా ఏజెన్సీలు.. అధికారిక, అనధికారిక ఒప్పందాల ప్రకారం పనిచేస్తాయి. ఈ దేశాలు పరస్పరం సమాచార సేకరణలో సహకరించుకోవడం, కీలక విషయాలు పంచుకోవడం వంటివి దీని విధి. మానవ మేధ, భద్రతాపరమైన విశ్వసనీయ సమాచారం, సిగ్నల్ ఇంటెలిజెన్స్, భౌగోళిక-అంతరిక్ష నిఘా సమాచారం, రక్షణరంగానికి చెందిన నిఘా సమాచారాన్ని పరస్పరం పంచుకుంటాయి. సిగ్నల్ ఇంటెలిజెన్స్ అంటే.. మొబైల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్, రాడార్, ఆయుధ వ్యవస్థల కమ్యూనికేషన్ సిస్టమ్స్ నుంచి వెలువడే ఎలక్ట్రానిక్స్ సిగ్నళ్లను సేకరిస్తాయి. ఇక ఉపగ్రహ చిత్రాల ద్వారా అందిన డేటాను కూడా ఇవి షేర్ చేసుకుంటాయి. దీంతోపాటు ఈ ఐదు దేశాల మధ్య పలు ఒప్పందాలు కూడా ఉంటాయి. ఈ ఐదు ఆంగ్లభాషను ప్రధానంగా మాట్లాడే దేశాలే కావడం విశేషం. భారత్‌తో ఖలిస్థానీ వివాదం వేళ.. కెనడా ఈ కూటమిని అడ్డంపెట్టుకొని మీడియాకు అవాస్తవ లీకులను ఇచ్చిన విషయం తెలిసిందే.

## కుంభమేళాకు రాని నేతలను బహిష్కరించాలట!

వారిని బహిష్కరించాలని.. ఎన్నికల్లో వారి పార్టీలకు ఓట్లు వేయొద్దని అన్నారు. తరచూ సమావేశాల్లో హిందుత్వం గురించి మాట్లాడే ఠాక్రే ఈ విధంగా ప్రవర్తించడం సరైన చర్య కాదని మండిపడ్డారు.ఈ విషయంలో వారు కనీసం ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సిందని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో హిందూ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి, ఉద్ధవ్ ఠాక్రే తగిన గుణపాఠం చెప్పినా వారి తీరులో ఎటువంటి మార్పు లేదని దుయ్యబట్టారు. ఉద్ధవ్ ఠాక్రే తగిన గుణపాఠం చెప్పినా వారి తీరులో ఎటువంటి మార్పు లేదని దుయ్యబట్టారు.జనవరి 13న ప్రయాగ్‌రాజ్‌లో మొదలైన మహా కుంభమేళా నేటితో ముగియనుంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో కోట్లాదిమంది భక్తులతో పాటు పలువురు రాజకీయ నేతలు, వ్యాపార, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని పుణ్య స్నానాలు ఆచరించారు.

# కోరిన కోర్కెలు తీర్చు రాజన్న.. కోడె మొక్కులు చెల్లిస్తాం రాజన్న..


ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

- బోలా శంకరుడి వద్ద బోలెడు భక్తులు...
- శివ నామ స్మరణతో మారుమోగిన రాజన్న ఆలయం..
- స్వామివారి దర్శనానికి 6 గంటల సమయం..
- సామాన్య భక్తుడికి తప్పని తిప్పలు...
- ప్రధాన గేట్ మూయడంలో పోలీసుల అత్యూత్సాహం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** కోరిన కోర్కెలు తీర్చు రాజన్న...కోడె మొక్కులు చెల్లిస్తాం రాజన్న... అంటూ ధర్మగుండంలో స్నానాలు చేసి తడి బట్టలతో స్వామి వారిని దర్శించుకున్నారు.బోలా శంకరడు, పేదల దేవుడు కోరిన కోర్కెలు తీర్చే ఏములాడా రాజన్నను దర్శించుకునేందుకు మహా శివరాత్రి సందర్భంగా బోలెడు భక్తులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చారు.ఆలయ ప్రధాన గేటును పోలీసులు మూసి వేయడంతో భక్తులు దర్శనానికి ఎటు వెళ్ళాలో ఇబ్బంది పడ్డారు.మెట్ల వద్ద కొబ్బరికాయలు కొట్టి స్వామివారి దర్శించుకోకుండానే భక్తులు వెనుతిరిగారు. ఆలయ ప్రధాన గేటు మూసివేయడంతో భక్తులు స్వామివారి దర్శనానికి ఎటు వెళ్ళాలో తెలియక పలు ఇబ్బందులు పడ్డారు.జాతర ఉత్సవ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆలయ ఈఓ స్పందించి ప్రధాన గేటును తెరిచినట్లే తెరిచి మళ్లీ బారికేడ్లను అడ్డం పెట్టడంతో భక్తులు ప్రధాన గేటు రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అతి పెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం మహా శివరాత్రి జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలలో హర హర మహాదేవ శంభోశంకర, ఓం నమశ్శివాయ అనే శివ నామస్మరణతో మార్మోగిపోయింది. భక్తులు సర్వదర్శనం,శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో గంటల తరబడి బారులు తీరారు.కోడెమొక్కు చెల్లించుకునే క్యూలైన్లలో భక్తుల రద్దీ నెలకొంది. సామాన్య భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారు 6 గంటలకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రజా ప్రతినిధులకు జర్నలిస్టులకు అధికారులకు బుధవారం వేకువజామున ఒకటిన్నర నుండి రెండున్నర వరకు ప్రత్యేక దర్శన సౌకర్యం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపినప్పటికీ ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజాప్రతినిదులు,జర్నలిస్టుల కుటుంబాలు,అధికారులు స్వామివారి దర్శనానికి పలు ఇబ్బందులు పడ్డరు. సాయంత్రము మహా మండపంలో స్వామివారికి ఆలయ అర్చకులు లింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.


భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో ప్రధాన గేటు మూసివేసిన పోలీసులు


ఆకట్టుకున్న శివోహం కార్యక్రమం

### వీఐపీల తాకిడితో సామాన్యుల భక్తులకు ఇబ్బందులు..

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. వీఐపీల కోసం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి రూ 300 టికెట్ కేటాయించడంతో ఆ క్యూ లైన్లో భక్తులు రద్దీ లేదు. వివిఐపిల కోసం ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసిన దానిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్న పోలీసులు తమకు అనుకూలంగా ఉన్న వారిని క్యూలైన్ ద్వారా పంపడంతో భక్తులకు యిబ్బందులు తలెత్తాయి.పోలీసులకు సంబంధించిన వారితో పాటు అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులు ప్రతి ఒక్కరు అట్టి క్యూలైన్ ద్వారా లోపలికి వెళ్తుండగా సామాన్య భక్తులు గంటల తరబడి క్యులైనలో ఉన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆలయ ఆవరణలో పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా జడ్జిలు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి రోజున కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి,దర్శనం చేసుకున్నారు. మండల కాలం శివ దీక్ష తీసుకున్న స్వాములు మహాశివరాత్రి రోజున స్వామివారిని దర్శించుకునేందుకు వారికి సమయం కేటాయించారు. ఆ సమయంలో సామాన్య భక్తులను కూడా దర్శనానికి అనుమతించడంతో శివదీక్షాపరులు ఇబ్బందులు పడ్డారు. గతం కంటే అరగంట సమయం పొడిగించినప్పటికీ శివ స్వాములకు ఇబ్బందులు తప్పలేదు..

మహాశివరాత్రి జాతర వచ్చిందంటే భక్తులు శివరాత్రి పర్వదినం రోజు జాగరణ చేయడం ఆనవాయితీ. వారు ఉంటున్న ప్రదేశాన్ని శుభ్రం చేసి మట్టి ప్రమిదలలో దీపాలను వెలిగించి నైవేద్యంగా బెల్లము, శనిగలు, కందగడ్డ, వివిధ రకాల పండ్లతో స్వామివారికి నైవేద్యం పెడతారు. జాగరణ ఉన్న భక్తులు ఎలాంటి ఆహారం తీసుకోకుండా రాత్రివేళ నిద్ర పోకుండా జాగరణ చేస్తారు.

### లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి 11.30 నుండి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము నిర్వహించారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారిని దర్శించుకునేందుకు బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు.

### ఆకట్టుకున్న శివోహం కార్యక్రమాలు..

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివోహం శివార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ అంతర్జాతీయ కళాకారులతో కళా ప్రదర్శనలు పలువురిని మంత్రముగ్ధుల్ని చేశాయి. మహా శివరాత్రి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఆలయ ఈవో ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

# సొంతింటికే కన్నం

- భార్యతో కలిసి తల్లిదండ్రుల బంగారాన్ని కొట్టేసిన కొడుకు
- పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు

**కరీంనగర్, ఫిబ్రవరి26 (జనంసాక్షి) :** అమ్మా నాన్నల వద్ద ఉన్న నగదు, బంగారంపై కన్నేశాడు. మరికొంత మందితో దొంగతనానికి ప్లాన్ చేశాడు. అడ్డు వచ్చిన పేరెంట్స్‌పై దాడికి తెగబడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. చివరికి కొడుకు, కోడలే ఈ దొంగతనంలో సూత్రధారులని తేలడంతో అంతా షాక్ అయ్యారు. అప్పుల పాలు కావడంతో వాటిని తీర్చే అవకాశం లేక పోవడంతో ఏకంగా తల్లిదండ్రుల ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. 24 గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో ప్రతాప రాఘవరెడ్డి, వినోద ఇంట్లో జరిగిన దొంగతనం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో కొడుకు కోడలు సూత్రధారులుగా పోలీసులు తేల్చారు. దీంతో కొడుకు నాగరాజు, కోడలు షాలిని తోపాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టిస్తోంది. నాగరాజు రూ. ఒక కోటి 80 లక్షల మేర అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే దారి లేక తన తల్లిదండ్రులను అడిగాడు. అందుకు వారు నిరాకరించడంతో.. ఎలాగైనా వారి నుంచి నగదు, బంగారం లాక్కోవాలనుకున్నాడు. ఈ క్రమంలోనే ఇంట్లో దొంగతనానికి నాగరాజు హెూటల్‌లో పనిచేసే అమీర్, కృష్ణ లతో ప్లాన్ చేశాడు. గతంలో 3 సార్లు ప్లాన్ చేయగా అవి బెడిసి కొట్టాయి. అమీర్ అనే వ్యక్తి సమీర్, మున్నా, కృష్ణలతో కలిసి పక్కాగా ప్లాన్ చేశారు. దొంగతనం జరిగిన రోజు నాగరాజు ఇంట్లోనే నిందితులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం.. నాగరాజు బోర్ వేసి వాటర్ ట్యాంక్ ఓవర్ ఫ్లో చేయడంతో తల్లి వినోద బయటకు వచ్చింది. దీంతో ఆమెపై నిందితులు దాడి చేసి ఇంట్లోకి తీసుకెళ్లారు. ఆపై రాఘవరెడ్డి పై కత్తులతో దాడి చేసి సుమారు 70 తులాల బంగారం నగలు, రూ. 5 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. కాగా తెల్లవారుజామున నాగరాజు, షాలిని ఏమి తెలియదన్నట్లుగా సానుభూతి వ్యక్తం చేశారు. ఎక్కడ అనుమానం రాకుండా ఈ ఇద్దరు నటించారు. ఇరుపొరుగు వారిని దొంగతనం జరిగినట్లు నమ్మించారు. కానీ. పోలీసులకు వీరి వ్యవహారంపై అనుమానం వచ్చింది. దీంతో అన్ని కోణాల్లో విచారణ చేయగా.. తామే దొంగతనం చేసినట్లు కొడుకు, కోడలు ఒప్పుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 70 తులాల బంగారం నగలు, రూ. లక్ష యాభై వేలు నగదు, 5 మొబైల్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.


# బంగారం కోసం వృద్ధురాలు హత్య

- ఇంట్లోని బావిలోనే శవం పడవేసిన దుర్మార్గులు




**వికారాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** డబ్బు, బంగారం కోసం దుండగులు ఎంతటి దానికైనా తెగిస్తున్నారు. వృద్ధులు, పెద్దలు, చిన్న పిల్లలు అని తేడా లేకుండా చంపేస్తున్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. తాజాగా.. బంగారం కోసం ఓ వృద్ధురాలిని హత్య చేసిన ఘటన వికారాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వికారాబాద్ జిల్లా కోట్పల్లి మండలం కోట్ మర్పల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం ఓ వృద్ధురాలిని అదే గ్రామానికి చెందిన కొందరు దుండగులు హత మార్చారు. అర్ధరాత్రి సమయంలో వినోద అనే వృద్ధురాలిని చంపేసి.. ఆమె ఇంట్లోనే ఉన్న బావిలో పడేశారు. అదే గ్రామానికి చెందిన రాజు, నర్సింలు, షఫీయుద్దీన్ ఈ ముగ్గురు కలిసి అర్ధరాత్రి ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న బంగారం.. 21,000 నగదు ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో వృద్ధురాలు నిద్రలో నుంచి లేచి ఆ ముగ్గురిని చూసి అరిచింది. తాము చోరీ చేసిన విషయాలు బయటకు చెప్తుందని భావించి ముగ్గురు కలిసి వృద్ధురాలిని చంపేసి ఇంట్లోనే ఉన్న బావిలో గుర్తు పట్టకుండా పడేశారు. అంతేకాకుండా.. వారి ఆనవాళ్లు తెలియకూడదని ఇంట్లో ఉన్న బీరువాను తగలబెట్టేశారు. అదే గ్రామానికి చెందిన స్థానికులు.. ఈ ముగ్గురు వినోద ఇంటి చుట్టూ అర్ధరాత్రి తిరగడం చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో.. పోలీసులు చాలా చకచక్యంగా ముగ్గురును అరెస్ట్ చేసి విచారించగా వృద్ధురాలి వినోదను తామే డబ్బు, బంగారం కోసం హత్య చేసినట్టు ఒప్పుకున్నారు. మృతురాలి కుమార్తె విమలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి ఈరోజు మీడియా ముందు ప్రవేశపెట్టారు. వారి వద్ద నుంచి పోలీసులు బంగారం లాకెట్, రూ.21,000 స్వాధీనం చేసుకున్నారు.

# పది రోజుల్లో పెళ్లి అనగా.. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



**భువనగిరి, ఫిబ్రవరి26 (జనంసాక్షి) :** పెళ్లి బాజాలు మోగాల్సిన ఆ ఇంట.. చావు మేళం మోగింది. బిడ్డ పెళ్లిని.. వైభవంగా చేసి.. ఆనందంగా ఆమెను అత్తారింటి పంపాలని కలలు గన్న తల్లింద్రులు ఇప్పుడు కన్నీళ్లలో స్మశానానికి సాగనంపాల్సి వచ్చింది. 10 రోజుల్లో పెళ్లి ఉందనగా.. లేడీ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన యాదాద్రి భువనగిరిలో చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లాకు చెందిన అనూష యాదాద్రి భువనగిరి పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఇటీవలే అనూషకు పెళ్లి కుదిరింది. మార్చి 6న పెళ్లి నిశ్చయించారు పెద్దలు. వివాహం అంగరంగవైభవంగా చేసేందుకు ఏర్పాట్లు కూడా చకచకా జరుగుతున్నాయి. కానీ ఏమైందో ఏమో.. అనూష ఈనెల 25న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మరికొద్ది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కుతుంది అనుకున్న కూతురు ఉరి తాడుకు వేలాడటం చూసి తల్లిదండ్రులు విలవిల్లాడిపోయారు. గుండెలవిసేలా రోదించారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఇంటికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి.. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# మద్యం ప్రియులకు జడ్జి సరికొత్త శిక్ష

**నంద్యాల, ఫిబ్రవరి26 (జనంసాక్షి) :** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పోలీసులకు పట్టుబడిన వారికి నంద్యాల జిల్లా బనగానపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సరికొత్త శిక్ష విధించింది. మద్యం అనర్థాలు, రహదారి నిబంధనలపై ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో నిల్చోవాలని తీర్పునిచ్చింది. పలు గ్రామాలకు చెందిన 47 మంది మద్యంప్రియులను గుర్తించి న్యాయస్థానం ఎదుట పోలీసులు హాజరుపరిచారు. వారిలో పరివర్తన కోసం న్యాయమూర్తి షేక్ అబ్దుల్ రెహ్మాన్ ఈ ఉత్తర్వులిచ్చారు.

# కుంభమేళాలో చల్లా దంపతులు



**పరకాల, ఫిబ్రవరి 26 (జనం సాక్షి):** మహా కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ రాజ్ లోని గంగా, యమున,సరస్వతి నదుల త్రివేణి సంగమంలో పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి దంపతులు పుణ్యస్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతూ, భగవంతుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు.

# ఓటర్లకు డబ్బులు పంపిణీ



**మంచిర్యాల, ఫి బ్రవరి 26 (జనంసాక్షి) :** పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి అనుచరులు ఓట ర్లకు విచ్చల విడిగా డబ్బు లు పంపిణీ చేశారు. మంచిర్యాల - నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేట్ పాఠశాల లో గ్రాడ్యుయేట్ ఓటర్లైనా ప్రైవేట్ స్కూల్ టీచర్లకు ప్రైవేటు పాఠశాల సిబ్బంది డబ్బులు పంపిణీ చేశారు. ఒక్క ఓటుకు వెయ్యి రూపాయల చొప్పున ఓటర్లకు పంచుతుండగా మీడియాను చూసి అక్కడి నుంచి పరారయ్యారు.

# పొట్లపల్లి శివాలయంలో మంత్రి పొన్నం పూజలు

- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పణ



**హుస్నాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మహాశివరాత్రి సందర్భంగా జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీ స్వయంభూ రాజేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు ప్రజలు అందరూ క్షేమంగా ఉండాలని శివపార్వతులను కోరుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరత్వరగా క్యూ లైన్‌లలో దర్శనానికి పంపించాలని అధికారులకు సూచించారు. మంత్రి పొన్నం ఆలయంలోని భక్తులతో ముచ్చటించి.. అక్కడే ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌లో హెల్త్ చెకప్ చెపించుకున్నారు.దర్శనం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'పొట్లపల్లి స్వయం భూ రాజరాజేశ్వర స్వామి వారిని హుస్నాబాద్ ప్రాంతం వారే కాదు.. ఇతర జిల్లాల వారు కూడా పెద్ద ఎత్తున దర్శించుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా అధికారులు ముందే సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసుకొని అన్ని ఏర్పాట్లు చేశారు. భవిష్యత్తులో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. 20 సంవత్సరాలుగా పొట్లపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రతి శివరాత్రికి దర్శించుకుంటు న్నానని అన్నారు. ఈసారి ఆరెపల్లి నుండి పందిల్ల వరకు వయా పొట్లపల్లి మీదుగా డబుల్ రోడ్డు వేయించాం. భక్తులకు శాశ్వత డ్రింకింగ్ వాటర్ అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంతం అంతా ప్రాజెక్టులు పూర్తయి.. మంచి పంటలతో సుభిక్షంగా ఉంచాలని స్వామి వారిని వేడుకున్నానని తెలిపారు.

# రామప్పలో ఉచిత మినరల్ వాటర్ పంపిణీ

- లయన్స్ క్లబ్ సేవలు



**ములుగు/వెంకటాపూర్,ఫిబ్రవరి26(జనం సాక్షి):** పది సంవత్సరాల నుండి మహాశివరాత్రి సందర్భంగా రామప్ప దేవాలయానికి వచ్చే భక్తులకు గంగిశెట్టి శ్రీనివాస్ వారి తల్లి సరస్వతి జ్ఞాపకార్థం గంగిశెట్టి సత్యనారాయణ ఐరన్ మర్చంట్ సహకారంతో ములుగు లయన్స్ క్లబ్ ఆఫ్ ములుగు ఆధ్వర్యంలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రామప్ప దేవాలయం లో మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నది.ఉచిత మినరల్ వాటర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా వెంకటాపురం మండల ఎంపీడీవో మూడ్ రాజు,రామప్ప దేవాలయం ఈవో బిల్లా శ్రీనివాస్ ములుగు లయన్స్ క్లబ్ సభ్యులచే ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించబడినది.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా రామప్ప దేవాలయానికి వచ్చే భక్తులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ములుగు ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం చాలా మంచి కార్యక్రమామని అభినందించారు.ఈ సందర్భంగా ములుగు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మెరుగు రమేష్ మాట్లాడుతూ భక్తులకు ఇలాంటి సేవ చేయడం మా యొక్క అదృష్టమని అన్నారు ఈ కార్యక్రమంలో ములుగు లయన్స్ క్లబ్ సెక్రటరీ చుంచు రమేష్,కోశాధికారి సానికొమ్మ రవీందర్ రెడ్డి లయన్,కొండి సాంబశివ లయన్,ముక్కు సుబ్బారెడ్డి లయన్,ఆడెపు రాజు,రాజు యాదవ్ ములుగు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీకి బీసీల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది?


- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ఇస్లాంమతం స్వీకరించిన బీసీలకు రిజర్వేషన్లు వర్తింపజేయడానికి వీలులేదని బీజేపీ నాయకులు బండి సంజరు వ్యాఖ్యానించడాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఖండించారు. దూదేకుల, పాకీపని చేసేవారు, రాళ్ళుగొట్టి బతికేవారు, అత్తర్‌సాహెబ్‌లు, ఇతర అనేక రకాలైన వృత్తులు చేస్తూ, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా తీవ్ర అణచివేతకు గువుతున్నారని పేర్కొన్నారు. ఈ తరగతులు సామాజిక న్యాయం కావాలని రిజర్వేషన్లు కోరుతుంటే, ఇస్లాం మతం స్వీకరించినంత మాత్రాన రిజర్వేషన్లను అమలు చేయడానికి వీలులేదనడం, ప్రతి అంశాన్ని మతంతో జోడించడం సరైందికాదని తెలిపారు. ఒకవైపు తాము కులగణనకు వ్యతిరేకం కాదని బండి సంజరు చెబుతున్నారని, మరోవైపు పార్లమెంట్‌లో మాత్రం కులగణనను బీజేపీ వ్యతిరేకిస్తున్నదని, కుల గణనను వ్యతిరేకించడం వల్ల బీసీలకు సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం అమలు జరగదని, బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం గా పోరాడిన బీజేపీ, బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు. దేశ వ్యాపితంగా బీసీల హక్కులను కాలరాయడంతో పాటు, ఇక్కడ కూడా బీసీల పేరుతో ముస్లిం, మైనారిటీల హక్కులను కాలరాసే వైఖరి అవలంభిస్తోందని, ప్రతి అంశాన్ని మతం ఆధారంగానే మాట్లాడుతూ, మతోన్మాదాన్ని, మత ఘర్షణలను సృష్టించడమనేది బీజేపీకి రాజకీయంగా వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. కులాల వృత్తులు దెబ్బతిన్నటువంటి నేపథ్యంలో రిజర్వేషన్లు కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్లు జనాభాకనుగుణంగా కావాలని అదనంగా అడగడంలో తప్పులేదు. కానీ ఇస్లాం మతం స్వీకరించారనే పేరుతో బీసీలో చేర్చకూడ దనడం సరైందికాదు. క్రిస్టియన్, హిందూ, ఇస్లాం, సిక్కు, జైన, బౌద్ధ మతాలు స్వీకరించినంత మాత్రాన వాళ్ళ సామాజిక, కుల హౌదాలు మారిపోవడం అనేది భారతదేశంలో జరగదరని, ఒకవేళ మతం ఆధారంగానే రిజర్వేషన్లు అయితే, ఆ మతాలు స్వీకరించిన ఎవరికీ కూడా ఈ రిజర్వేషన్లు అమలు జరిగేటటువంటి అవకాశం ఉండదని, ఇది రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని తీసుకు న్నా సరే, సామాజిక హౌదా, కులాల అణచివేత ఆధారంగా రిజర్వేషన్లు అనేటటువంటిది మనం కోరుకుం దామని, రాజ్యాంగ స్ఫూర్తి కూడా అదే చెబుతోంది. సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను సామా జిక న్యాయం కోరుకునే శక్తులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

# రాజకీయరంగు నీడలో..ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక!

తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరుగుతున్న ఉపాధ్యాయ ఎన్నికల బరిలో నిలిచిన వారందరూ రాజకీయరంగు నీడలోనే ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే ఏదైనా ఒక కండువా కప్పుకొని ముందుకు వస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో 40 సీట్లు కలిగిన శాసనమండలిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు మూడింటిలో ప్రస్తుతము వరంగల్ ఖమ్మం నల్లగొండ, నిజామాబాద్ కరీంనగర్ మెదక్ ఆదిలాబాద్ స్థానాలకు సంబంధించి రెండు చోట్ల ఎన్నికలు 27 ఫిబ్రవరి 2025 రోజున జరగనున్నాయి .ముఖ్యంగా ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నిక, అభ్యర్థుల ఎంపిక, ప్రచారము అన్నీ కూడా రాజకీయాలకు అతీతంగా స్వతంత్రంగా వ్యక్తి సామాజిక నేపథ్యం ఉద్యమ నాయకత్వం ఆధారంగా జరగవలసిన అవసరం చాలా ఉన్నది. కానీ వ్యక్తులు ఎవరో తెలియకుండా అధినేతలను పెట్టుబడిదారీ వ్యక్తులను రాజకీయ నాయకులను కూడా చివరికి ఎన్నికలలో దించే ప్రయత్నాలు ఆయా రాజకీయ పార్టీలు చేస్తున్నాయి. అంటే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల నుండి కూడా రాజకీయ లబ్ధి పొందాలనే దురాలోచన తప్ప మరేదీ కాదు. వాస్తవంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించడం వెనుక రాజ్యాంగ నేపథ్యముతో పాటు శాసనసభలో చర్చించిన తర్వాత కూడా అవసరమైనటువంటి సందర్భంలో మరింత లోతుగా చర్చించడానికి పెద్దల సభగా పిలువబడే శాసనమండలిలో ఎమ్మెల్యేల ద్వారా ఎన్నికయ్యే వాళ్ళు, స్థానిక సంస్థల ద్వారా ఎన్నికయ్యే వాళ్ళు, గవర్నర్ నామినేట్ చేసే వాళ్ళతో పాటుగా పట్టబద్రు లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించడం అనేది ఒక ఉత్కృష్టమైన లక్ష్యంతో కూడుకున్నది. ముఖ్యంగా నిరుద్యోగ సమస్య, ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు, సమస్యలు, విద్యారంగ పరిస్థితులు, ప్రైవేట్ రంగంలో విద్యను నివారించడంతోపాటు ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం,కొటారి సూచించినటువంటి కామన్ స్కూల్ విధానాన్ని కొనసాగించడానికి ప్రభుత్వానికి సూచన చేయడం అవసరమైతే ఒత్తిడి తీసుకురావడం వంటి లక్ష్యాలతో ముఖ్యంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. లక్ష్యానికి అనుగుణంగా పనిచేయగల సమర్థవైన నాయకత్వం లేకుంటే ఎన్నుకోబడినా కూడా ఆయా వర్గాల కోసం ఏమాత్రం కృషి చేయరు అనేది నగ్న సత్యం. గతంలో ఉన్న కొద్ది మందిని పరిశీలించినప్పుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా ఎన్నికైన వ్యక్తి ఉపాధ్యాయుల పక్షాన పని చేస్తానని రాజకీయాలకతీతంగా అధికార పార్టీకి ఏ రకంగానూ లొంగిపోనని చెప్పి ఆ వెంటనే ముఖ్యమంత్రి కాళ్లు పట్టుకున్న సందర్భాలను గమనిస్తే శాసనమండల్ లోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కూడా రాజకీయ ప్రయోజనాన్ని ఆశిస్తున్నట్లు మనకు తెలుస్తున్నది. కానీ దానికి భిన్నంగా ఉన్న వాళ్ళని ఎన్నుకోవడానికి ప్రత్యేకమైన చొరవ చూపాల్సిన అవసరం ఉంది. అంతేకాదు ఇటీవలి కాలంలో ప్రధానంగా ఆధిపత్య కులాలకు చెందిన వాళ్లే చట్టసభల్లో ఎన్నికవుతూ నాయకత్వం వహిస్తూ డామినేట్ చేస్తున్న సందర్భంలో బహుజన దృక్పథం బలంగా వస్తున్న నేపథ్యంలో కూడా ఆ వర్గాలకు ప్రాతినిధ్యాన్ని ఇవ్వడానికి కృషి చేయవలసిన అవసరం కూడా ఉన్నది. ఉపాధ్యాయులుగా సుదీర్ఘమైన సర్వీస్ చేయడంతో పాటు ఉద్యమ నేపథ్యంతో సహా ఆయా సామాజిక వర్గాలకు కూడా అవకాశం ఉంటే అలాంటి చోట్ల ప్రాతినిధ్యం కల్పించడం ద్వారాఉపాధ్యాయ ఓటర్లు తమ యొక్క సమయ స్ఫూర్తిని చాటుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉన్నది .




ప్రశ్నించగల సమర్థులు కావాలి – మోకరిల్లే వాళ్ళు కాదు :ఏ సంస్కృతి, వ్యవస్థ నుండి వచ్చిన వాళ్లు ఆ సంస్కృతి లేదా ఆ వర్గ ప్రయోజనం కోసమే పాకులాడుతారనేది నగ్న సత్యం. అందుకే రాజకీయాలలో ముఖ్యంగా చట్టసభల్లోకి సుదీర్ఘమైన అనుభవము, ఉద్యమ నేపథ్యము, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వము, సామాజిక చింతన, ప్రశ్నించే తత్వంతో పాటు ఆ వర్గాల యొక్క ప్రయోజనం బాగా తెలిసి ఉండాలి. అంటే ఉపాధ్యాయునిగా పనిచేసిన వాళ్లయితేనే మరింత ఎక్కువగా న్యాయం చేయగలుగుతారు. ప్రధానంగా కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ స్థానానికి జరుగుతున్న పోటీలో వై అశోక్ కుమార్ గారు సుదీర్ఘమైన ఉపాధ్యాయ అనుభవం కలిగి ఇటీవలే ఉద్యోగ విరమణ చేసి ఉద్యమ నేపథ్యంలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించి ఉపాధ్యాయ హక్కులు సమస్యలు సాధనలో బాధ్యతాయుతంగా వ్యవహరించిన వేళ వారి యొక్క అభ్యర్థిత్వాన్ని మొదటి స్థానానికి ఎంపిక చేసుకోవడం ద్వారా ఉపాధ్యాయ ఓటర్లు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది . స్వతంత్ర వ్యక్తిత్వంతో, స్వతంత్ర అభ్యర్థిగా, ఉపాధ్యాయ నిరుద్యోగ పట్టభద్రుల తదితర సమస్యల పరిష్కారంలో గలంవిప్పి ప్రభుత్వాన్ని ప్రశ్నించి ఒత్తిడి చేయడానికి తన శక్తి యుక్తులను ధారపోయడానికి సిద్ధంగా ఉన్నటువంటి అశోక్ కుమార్ గారు ఒక మామూలు కుటుంబం నుండి వచ్చి ధన రాజకీయాలకు అతీతంగా ఉద్యమ నేపథ్యంతో మాత్రమే ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయాన్ని అందరూ గమనించాలి. ప్రస్తుతం ప్రతి ఎన్నిక కూడా లక్షలు కోట్లతో కూడుకున్న కారణంగా పేదవాళ్లు సమర్థులు చాలా చోట్ల బహుజనులకు అవకాశం లేకుండా పోతున్నది .ఆధిపత్య వర్గాలు మాత్రమే అన్నిచోట్ల పోటీ చేయడానికి సిద్ధపడుతున్న నేపథ్యంలో వాటన్నింటికీ అతీతంగా ధన రాజకీయాలను తిప్పి కొట్టడం ద్వారా స్వతంత్రంగా వ్యవహరించి శాసనమండలిలో పోరాటానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని గెలిపించుకోవడం ద్వారా మన ప్రత్యేకతను చాటుకో వాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఉపాధ్యాయులు కాని వారు ఎవరైనా పోటీ చేయవ చ్చు అనే ప్రాతిపదిక చూడడానికి ఇబ్బంది గా, ఇబ్బేట్టుగా ఉంది. అంతేకాదు ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలతో సంబంధం లేకుండా ఉన్న వ్యక్తి గెలుపొందితే లేదా ఉపాధ్యాయ సంస్థల అధినేతలు పెట్టుబడిదారులు విద్యా వ్యాపారులను అభ్యర్థులుగా నిలబెట్టినప్పుడు వాళ్లు గెలిపించుకోవడానికి డబ్బును ఎరగా చూపే సందర్భంలో అలాంటి సభ్యులు గెలిస్తే ఏ రకమైనటువంటి చెడు పర్యవసానాలు ఉంటాయో ఒక్కసారి గమనించవచ్చు. ప్రైవేటు విద్యారంగానికి చెందినవాడు ప్రైవేటు విద్యాసంస్థలను ప్రోత్సహించడానికి ప్రైవేటు విద్యను చట్టబద్ధం చేయడానికి మాత్రమే పనిచేస్తాడు కానీ ప్రభుత్వ రంగంలో విద్య కావాలని పోరాడగలడా? విద్యా శాఖకు ఢిల్లీ కేరళ లాగా 25% బడ్జెట్లో నిధులు కేటాయించాలని ప్రశ్నించగలరా? కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా వివక్షత లేనటువంటి ఒకే రకమైన యాజమాన్యంలో ఉండగల విద్యా వ్యవస్థ కావాలని ఈ విద్యా వ్యాపారులు ప్రభుత్వాన్ని నిలదీయగలరా? ఒక్కసారి ఓటర్లు ఆలోచించుకోవాలి మరి అలాంటప్పుడు విద్యా వ్యాపారులను ఎంపిక చేయడమే నేరం అలాంటి వాళ్లను ఓట్లు వేసి గెలిపించడం అంటే అంతకుమించిన మూర్ఖత్వం మరొకటి ఉండదు. వై అశోక్ కుమార్ గారు ఇక్కడ బహుజన దృక్పథంతో పనిచేస్తున్నటువంటి ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందినటువంటి నాయకులు అంతేకాదు ఉపాధ్యాయ ఉద్యమంలో దశాబ్దాల అనుభవం ఉన్నవారు స్వతంత్ర వ్యక్తిత్వంతో ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నారు కాబట్టి ఎలాంటి వారు కావాలో తేల్చుకోవాల్సిన అవసరం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందే ఒక నిర్ణయం తీసుకోవడం ద్వారా విద్యారంగ పరిరక్షణకు సహకరించవలసిన అవసరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీని ఎన్నుకునే ఓటర్ల పైన ఉన్నది. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘాలు కూడా బీసీ అభ్యర్థులకు మద్దతు తెలిపిన సందర్భంగా . ఒక ప్రైవేటు విద్యాసంస్థల అధినేత బిసి వర్గానికి చెందినప్పటికీ కూడా అతడు పెట్టుబడుదారి వర్గానికి వంత పాడుతాడు కనుక అలాంటి వ్యక్తిని సమర్థించడం అనేది సబబు కాదని బీసీ సంక్షేమ సంఘానికి విజ్ఞప్తి చేయడం సముచితంగా ఉంటుంది. అంతిమంగా లక్ష్యాల సాధనలో ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి మాత్రమే ఇవాళ భారతదేశ వ్యాప్తంగా పోరాటం చేయవలసిన అవసరం ఉంది.అలాంటి పరిస్థితి లోపల ప్రైవేటు విద్యారంగంలో పని చేసేవాళ్లను పట్టభద్రులకు గాని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాని పోటీ చేయడం అంటేనే మౌలికంగా దోపిడీని ప్రోత్సహించడం అని అర్థం చేసుకోవాలి. ఇదే సందర్భంలో కొందరు వ్యక్తం చేస్తున్నటువంటి సందేహాలను గమనిస్తే ఎన్నికైన తర్వాత అధికార పార్టీలో చేరి పదవులను దర్జాగా అనుభవించడానికి అలవాటు పడి ఉపాధ్యాయులను విద్యారంగాన్ని తమ లక్ష్యాలను బాధ్యతలను మరిచిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్న వారికి తగిన సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా అభ్యర్థుల పైన ఉన్నది. అశోక్ కుమార్ గారు స్వతంత్రంగా వ్యవహరిస్తారని ప్రజా సమస్యలతో పాటు విద్యారంగా నిరుద్యోగ పట్టభద్రుల ఉపాధ్యాయ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కూడా పనిచేస్తారని ప్రభుత్వ రంగ విద్యను బలోపేతం చేయడానికి కూడా పోరాడుతారని ఈ సందర్భంగా మనం ఆశించడం అత్యాశ కాదు. ఆ వైపుగా వారు తమ లక్ష్యాన్ని ఏర్పరచుకుంటారని ఏర్పరచుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేద్దాం


ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు నిండు మనసుతో కరీంనగర్ నిజామాబాద్ మెదక్ ఆదిలాబాద్ స్థానానికి అన్ని అర్హతలు ఉన్నటువంటి అశోక్ కుమార్ గారు పోటీ చేస్తున్న సందర్భంగా వారికి మీ సంపూర్ణ మద్దతు ప్రకటించడం ఓటు వేసి గెలిపించడం ఒకవైపు జరగాలి.మరొకవైపు ఆయా సామాజిక వర్గాలు కూడా మీ సంపూర్ణ మద్దతును ప్రకటించడం ద్వారా నూతన శకానికి శ్రీకారం చుట్టాలని విజ్ఞప్తి చేద్దాం. అందుకు తగిన కృషి అడుగడుగునా జరగాలని ఓటర్లకు విజ్ఞప్తి చేద్దాం ప్రోత్సహిద్దాం. బీసీ సంక్షేమ సంఘం కూడా ఈ వాస్తవాన్ని గుర్తించి గతంలో చేసిన ప్రకటనను సవరించుకోవడం ద్వారా మొదటి ప్రాధాన్యత ఓటును అశోక్ కుమార్ గారికి వేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తే అర్థవంతంగా ఉంటుంది. బీసీ సంక్షేమ సంఘానికి గౌరవం కూడా దక్కుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం
సెల్ నెంబర్ : 9849577610

# అధికార పార్టీకి విజయం దూరమేనా!

ఈనెల 27న జరగ నున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి విజయం దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రాడ్యుయేట్ల నియోజకవర్గం అభ్యర్థి ఎంపికలో ఏమాత్రం పరిశీలన చేయకుండా అతి విశ్వాసం తో పొరపాటు జరిగింది.మరో కొద్ది గంటల్లో పోలింగ్ ప్రారంభం కానుంది .ఈ నేపథ్యంలో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొన్నది అధికార కాంగ్రెస్ పార్టీ పట్టబదురుల నియోజకవర్గం పైననే ఎక్కువ కేంద్రీకరించింది. అభ్యర్థిని సక్రమంగా ఎంపిక చేయలేదని ఆరోపణలతో ప్రచారం మొదలైంది. ఇప్పుడు కాంగ్రెస్ పెట్టిన అభ్యర్థి కాకుండా మరెవరినైనా అభ్యర్థిగా ప్రకటించి ఉంటే బాగుండేదని అభిప్రాయం సర్వత్రావ్యక్తమైంది. సీఎం రేవంత్ రెడ్డి పట్టభద్రుల నియోజకవర్గంలో మూడు సభలలో పాల్గొని పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతూనే అతని ఓటమి వల్ల మాకు వచ్చే నష్టమేమీ లేదని కూడా పేర్కొనడం జరిగింది, అంటే ఆ అభ్యర్థి కి సంబంధించి గ్రౌండ్ రియాలిటీ ని సీఎం తెలుసుకొనే ఆ విధంగా మాట్లాడారా అనిపించింది. ఏది ఏమైనా ఈ మధ్యకాలంలో బీసీ వాదనతో కూడిన ప్రచారం ఎక్కువగా ఉంది. బీసీల ఐక్యత ఎక్కువగా కనిపిస్తున్నది. పట్టభద్రుల నియోజకవర్గంలోనూ బీసీవాదమే వినిపిస్తుంది. కొంత కమిటెడ్ కాంగ్రెస్ కు చెందిన వారు తప్ప కాంగ్రెస్ అభ్యర్థికి ఇతరులు ఓటు వేసే పరిస్థితి లేదు. అభ్యర్థి పట్ల అతను కార్పొరేట్ విద్యాసంస్థల అధిపతి కాబట్టి తీవ్రమైన వ్యతిరేకత ప్రారంభం నుంచే ఉంటూ వస్తున్నది. మొత్తానికి బిఎస్పీ నుంచి రంగంలో దిగిన ప్రసన్న హరికృష్ణకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్టు పట్టబద్రులలో కనిపిస్తున్నది. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కూడా ప్రసన్నకు ఓపెన్ గా సపోర్ట్ చేశారు.నియోజక వర్గంలో అయన మద్దతు బండ మీద గీత లాంటిది.ఏది ఏమైనా మరో నలభై ఎనిమిది గంటలలో మొత్తంగా ఈ ఫలితం బయటపడునున్నది అయితే కాంగ్రెస్ పార్టీ గెలుపోవట ములను పెద్దగా సీరియస్గా తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి పోలింగ్ ఆరంభం కానుంది. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో 56 మంది పోటీలో ఉన్నారు. మొత్తం ఓటర్లు 3,41,313 మంది ఉండగా.. అందులో పురుషులు 2,18,060 మంది, మహిళలు 1,23, 250 మంది, ఇతరులు ముగ్గురు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.


మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం లో టీచర్ల స్థానంలో 15 మంది పోటీ ఉండగా.. మొత్తం ఓటర్లు 25,921 మంది ఉన్నారు. అందులో పురుషులు 16,364 మంది, మహిళలు 9,557 మంది ఉన్నారు.

వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 19 మంది పోటీలో ఉండగా.. మొత్తం ఓటర్లు 24,905 మంది ఉన్నారు. అందులో పురుషులు 14,940 మంది, మహిళలు 9,965 మంది ఉన్నారు. గతంలో ఎన్నడూ లేనివి ధంగా ఈసారి బహుముఖ పోటీ నెలకొనడంతో.. గెలుపు ఎవరిని వరిస్తుందో అని ఆసక్తికరంగా మారింది.

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,



# రేవంత్‌రెడ్డి మార్క్ పాలన కోసం..



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది దాటింది. ఏడాది లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన పట్ల ప్రజల్లో ఒక నమ్మకం కలిగే విధంగా ఆయన కృషి చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిపోయిన ఏడు లక్షల కోట్ల అప్పు గురించి చెబుతూనే, కొన్ని కాంగ్రెస్ పార్టీ హామీల అమలు ఆలస్యంకు గల కారణాలు, కష్టాలను గురించి సిఎం స్పష్టం చేస్తున్నారు. దాపరికం లేని పాలన కనిపిస్తున్నది. ఎప్పటి కప్పుడు సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఓపెన్‌గానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతి విషయంలోనూ విపక్ష పార్టీ అయినా బిఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఒక్క విషయంలోనూ ఎక్కడ కూడా ప్రభుత్వానికి కోపరేట్ చేసినట్లు నాయకుల మాటలు ఉండడం లేదు. ఏమైనా ప్రతి విషయంలోనూ నెగటివ్ మాటలే మాట్లాడుతున్నారు.

**బిజెపి అంతే!**

ఇక బిజెపి కూడా అదేలైన్‌లో ఉంది. బిజెపి తానే కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా భావిస్తున్నది. తదుపరి వచ్చేది తమ ప్రభుత్వమే అని ఒక వైపు బిజెపి మరోవైపు బిఆర్ఎస్ పార్టీలో పోటాపోటీగా జనంలో చెప్పుకుంటూ వస్తున్నాయి. మొహమాటం లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ విషయంలోనైనా కుండబద్దలు కొట్టినట్టే మాట్లాడడం బిఆర్ఎస్ సహా బిజెపిలకు కూడా ఒక్క అవకాశం కూడా వదలకుండా విమర్శించే అవకాశం వచ్చినప్పుడు విమర్శిస్తూనే ఉన్నారు. ఆయన కౌంటర్ ఇవ్వడంలో ఏమాత్రం వెనకాడడం లేదు. విపక్షాల విమర్శల మీద ఆయనే ఎక్కువగా సమాధానం ఇచ్చినట్లు కనిపిస్తున్నది. మంత్రివర్గ సభ్యులు స్పంది స్తున్నప్పటికీ వారి కంటే ముందే సీఎం స్పందిస్తున్నారు.

**ముక్కుసూటి సిఎం!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి శషబిషలు లేని ముక్కుసూటి మనిషిగా జనంలోకి చర్చ , ఒక ముద్రగా వెళ్ళిపోయింది. ఏది చెప్పినా స్టేట్ ఫార్వర్డ్ గా చెప్పేస్తారని, మాట్లాడతారని, అసలు లౌక్యమే లేదని, మిగతా వాళ్ళు ఆచితూచి లౌక్యంగా తమని తాము రక్షించుకునే విధంగా మాట్లాడుతూ ఉంటారు, అయితే అందుకు భిన్నంగా కుండబద్దలు కొట్టినట్టు రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. ఇప్పుడు నిజంగా జనంలో రేవంత్ రెడ్డి కుండ బద్దలు కొట్టినట్టు ఏమాత్రం మొహమాటం లేకుండా మాట్లాడుతున్నటువంటి మాటలు జనంలో ఒక పాజిటివ్ టాక్నే తీసుకొస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

**ఎన్నికల హామీ మీద కేంద్రీకరణ!**


ఎన్నికల్లో ఇచ్చిన హామీలల మీద సిఎం కేంద్రీకరిస్తున్నారు. ఇందు కు సంబంధించి రైతులకు అప్పుల మాఫీ విషయమైనా, రైతుబంధు విషయమైనా చాలా స్పష్టంగా లెక్కలు చేసి మరీ చెబుతున్నారు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిస్తున్నటువంటి సిఎంఆర్ ఎఫ్ కింద సహాయం కూడా ఏమాత్రం జాప్యం లేకుండా అందరికీ అందుతున్నది. ఎమ్మెల్యేలు దరఖాస్తులు పెట్టిన వెంటనే సంబంధిత అవసరం ఉన్న వారికి ఆ చెక్కులను అందజేయడం జరుగుతున్న ది. మహిళలకు ఫ్రీ బస్సు రవాణా కొనసాగుతూనే ఉన్నది. మహిళా దినోత్సవం అయినా మార్చి 8 నుంచి మహిళలకు వారి ఖాతాలో వేస్తామన్న రూపాయలు 2500 ప్రతినెల వేయడం ప్రారం భిస్తున్నట్లు కూడా ప్రకటన చేయడం జరిగింది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ కావచ్చు ,కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ కావచ్చు కుల గణనలను కూడా పూర్తి చేశారు. మరోవైపు ఎస్సీల వర్గీకరణ కూడా త్వరలో పూర్తి చేస్తామని ఆయన చెప్పుకుంటూ వస్తున్నారు.

**ఖాళీల భర్తీ మీద శ్రద్ధ!**

ఖాళీల భర్తీ మీద శ్రద్ధ వహిస్తున్నారు.ఇప్పటివరకు 56 వేల కొత్త రిక్రూట్మెంట్ ను రేవంత్ రెడ్డి హయాంలో చేయడం జరిగింది. మరో 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించే పని కూడా ప్రారంభించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇటు తెలంగాణకు గుండెకాయ లాంటి సింగరేణిలోనూ సంక్షేమ కార్యక్రమాల అమలు అద్భుతంగా జరుగుతున్నది. కార్మికులకు వైద్య సౌకర్యానికి సంబంధించి పదవి విరమణ కార్మికులతో సహా సిపిఆర్ఎంఎస్ కార్డుల ద్వారా ఏర్పాట్లు సింగరేణి యాజమాన్యం చేసింది. కొన్ని జబ్బులకు అన్లిమిటెడ్ ఖర్చు కూడా చేస్తున్నారు.ఖాళీలను కూడా భర్తి చేస్తూ వస్తున్నారు. సింగరేణిలో కోటి 25 లక్షల ఇన్సూరెన్స్ ను కార్మికులకు, 40 లక్షల ఇన్సూరెన్స్ ను కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం ప్రీమియం కట్టి మరి చెల్లించే ఏర్పాటు చేసింది. సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ స్కీం ను అమలు చేస్తున్నారు. అంతేకాకుండా కార్మికుల వద్దకు అధికారులు వెళ్లి సమస్యలను అడిగి మరీ పరిష్కరించే నూతనమైన పద్ధతిని ప్రస్తుత సింగరేణి సిఎండి ఎన్. బలరాం తీసుకొచ్చారు. దీనివల్ల కార్మిక వర్గం చాలా సంతోషంగా ఉంది. అయితే ప్రమోషన్ల పోస్టింగ్ల విషయంలోనూ మిగతా ప్రయోజనాలు కార్మికులకు కల్పించడంలో నూ ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకునే విధంగా ముందుకు వెళుతున్నారు సింగరేణి ఒడిస్సా లోని నైని బొగ్గు బ్లాక్ ను త్వరలో ప్రారంభించనుంది.డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క నేతృత్వంలో సింగరేణి సిఎండిఎన్ బలరాం ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. మొట్టమొదటిసారి ఇతర రాష్ట్రాలలోనూ సింగరేణి విస్తరించనున్నది .ఖనిజాలకు సంబం ధించి ఆస్ట్రేలియా తోను కొన్ని ఒప్పందాలు చేసుకునే పనిలో యాజమాన్యం ఉన్నది. అయితే రాష్ట్రంలో అన్ని రంగాల విషయం లోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్క్ కనిపిస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేశం ,పట్టుదల ,చిత్తశుద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడడానికి కారణం అయ్యింది, అన దంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఆ కృషిని, నిలబెట్టే విధంగా రేవంత్ రెడ్డి ఆయన మంత్రివర్గం సహచరులు కృషి చేస్తున్నారు. ఎవరికి వారే వారి శాఖకు సంబంధించి స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ విధంగా వారికి స్వేచ్ఛ కూడా ఇవ్వడం జరిగింది. సమిష్టి నిర్ణయం తోనే అటు కేంద్రంలో అధిష్టానం వర్గంలో ముఖ్యంగా రాహుల్ గాంధీతో ప్రతి విషయం లో చర్చలు జరిపి ఆయన ముందుకు వెళ్లడం జరుగుతున్నది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డి కొన్ని అనవసరమైన విషయాలను అప్పుడప్పుడు తెరమీదకి తీసుకొని వచ్చి మాట్లాడుతున్నారని కూడా కొంత రాజకీయ వర్గాలలో చర్చ ఉన్నది. లౌక్యం ముక్కుసూటి మనుషులకు కొంత తక్కువగానే ఉంటుంది. అయినా మనిషి నిజాయితీగా రాష్ట్రానికి సేవ చేయాలని నిర్ణయించుకున్నప్పుడు అతని పనిని ఎవరు ఆపలేరు! రాష్ట్రంలో అప్పుడప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి మార్క్ సంక్షేమ కార్యక్రమాల అడుగుజాడలు, అయన పట్టుదల ల లో రేవంత్ రెడ్డిలో కనిపిస్తున్నాయి. రాజశేఖర్ రెడ్డి కూడా ముక్కుసూటి మనిషిగా పేరున్న నాయకుడే కావడం విశేషం! ఏది ఏమైనా చిత్తశుద్ధి నిజాయితీగా రాష్ట్రానికి సేవ చేయడానికి నిర్ణయించుకున్నప్పుడు రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం ఎవరికీ అడ్డుకునే దమ్ము ధైర్యం ఉండదంటే అతిశయోక్తి కాదు! కాస్త లౌక్యం గా సిఎం ముందుకు పోతే మంచిది!

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,







రాసినప్పటికీ మన రాష్ట్రంలో మనకోసమే రాసిందా అన్నంత అద్భుతంగా ఈ పుస్తకం ఉంది. ఉద్యమకారుల, వామపక్ష పార్టీల తప్పులు ఏంటో అరటిపండు వలిచి నట్టు చెప్పింది. మనం ఏమి చేయాలో అత్యంత సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పింది. ఆమె ఆలోచన పుస్తకం పేరు చూస్తేనే తెలుస్తుంది. విశాల వేదికలు ఏర్పాటు చేయాలని వినూత్న ఉద్యమాలు చేయాలని. కేవలం 48 పేజీలు ఉంది 30 రూపాయలు మాత్రమే. దయచేసి అందరూ కొనండి. చదవండి. ఆలోచించండి ఆచరించండి జై భీమ్ లాల్ సలాంలతో

చీలి దేశస్తురాలు మార్త హర్నేకర్ రాసిన ఈ పుస్తకం ప్రతి వామపక్ష కార్యకర్త చదవాల్సిందే. బహుజన/శ్రామిక రాజ్యం కావాలి అనుకునే ప్రతి వ్యక్తి చదవాలి. ఇది ప్రపంచ వామపక్షాల కోసం

**బొజ్జ బిక్షమయ్య**

## ఓటుకు విలువివ్వాలి..!!




"పట్ట"భద్రులు
పట్టలేని పట్టువిడుపులలో..
"టీ"చర్లూ
చీటింగ్‌ల మీటింగ్‌లలో..
ఒట్టి వాగ్దానాల
మాయాజాలంలో
ఎరక్క ఇరుక్కొని
ఓటేసి తమకు తామే
పోటేసుకొని
నాలుక కర్చుకుంటే ఎలా?
ప్రసంగాలు వ్యాసంగాలు
నమ్మించే నవరసంగాల
నడిసంద్రంలో నడయాడి
తాకట్ల తక్కెట్లో తూకం వేసి
ఎంతో విలువైన ఓటును
తప్పుదారి మళ్ళించుకొని
మనసు కుళ్ళించుకుంటే ఎలా?
పల్లి పట్టీల మాటల ముట్టీలకు
సంధీలవ్వక సందివ్వక
అవకాశ వాదానికి చుట్టీ పెట్టేసి
ఉపకారానికి ఊతమిచ్చే
ఉత్తములకు ఓటెయ్యకుంటే
ఎలా?
రంగుల అద్దకాలకు రంజు పడి
మనసుకు
రంగంటించుకోకుండా
రంగులు మార్చే ఊసరవెల్లుల
ఆనవాళ్ళు అనవసరమనుకొని
ఓటుతో వాతలు పెట్టకుంటే
ఎలా?
పట్టభద్రులైనా టీచర్లైనా
కులం కాని కలంతో
మతం లేని మనసుతో
పైకం ఎరుగని చేతనంతో
విజ్ఞులై యోచించి ఓటివ్వాలి
యోగ్యునికి ఎమ్మెల్సీగా చోటివ్వాలి!!
మీరు వేసే ఓటుకి మీరే
విలువివ్వాలి!!!

- పాల్వంచ
హరికిషన్
9502451780



## కుల పిశాచులున్నాయి జాగ్రత్త..!

అయ్యో.. అయ్యో..
ఎక్కడ మోసపోయావమ్మా...
మా బంగారు తల్లి భార్గవి..?
నీ నమ్మకం
నీ విశ్వాసం
నీ అమాయకత్వం కన్న
నీ ప్రేమే మిన్న...
అది పునీతం... నవనీతం
కానీ ఆ కులపిశాచాలు
నీ ప్రేమకు సంకెళ్ళువేశాయి...
నీ పసినవ్వును మసిచేశాయి...
నీ పచ్చని కాపురంలో
ఆరని చిచ్చును రేపాయి...

అమృత ప్రణయ్‌ల
కన్నీటి గాథను మరిచావా...?
పరువు హత్య పేర
ప్రణయ్ ప్రాణం తీశారన్న వేదన
నీ గుండెల్లో మెరుపై మెరవలేదా..?
నీకా విషాదగీతం వినిపించలేదా..?



ఏ ప్రమాద ఘంటికలు మ్రోగలేదా..?

బంటిని ప్రేమించినదానికి శిక్షగా
కులరాక్షసులు కసితో కక్షతో
విసిరే విషపు వలలనెందుకు
పసిగట్టలేకపోయావమ్మా..? నీ
ఇంటిచుట్టూ తిరిగే ఆ నయవంచకులపై
నీమదిలో సందేహమెందుకు పుట్టలేదమ్మా

పరువు పేరిట ఈ బీభత్సం ఈ రక్తపాతం
నీ మనసును మాల బంటికిచ్చినందుకా..?
నీ ప్రియుడిపై వారు కత్తి దూసిన వేళ
నీ మనసు మౌనంగా రోదించిందా..?
కులంముందు నీ ప్రేమ చిన్నబోయిందా...?

బంటీ నీ గుండెలో మండే సూర్యుడే ..!
అసమానతలపై...అఘాయిత్యాలపై
ఈ కులరక్కసిపై నడుం కట్టి పోరాడు...
నీ ప్రేమే నీకు ధైర్యం
నీ న్యాయమే నీ ఆయుధం..!

నీ కంటిచూపుతో కులరక్కసిని కూల్చేయ్
రేపటి సమాజానికి నీవొక దిక్సూచికావాలి
నీ పోరాటం మరో అమృతను రక్షించాలి
నీ ఈ మానసిక క్షోభ మరెవరికి రారాదు..!

భార్గవీ ఇంకా భయమెందుకు ?
సాహసంతో సాగిపో ముందుకు...
మీ ఆత్మీయ బంధం సజీవమే...
నీ బంటి నీ గుండెల్లో ఆరని వెలుగే
నీ పోరాటంలో వజ్రాయుధమే...
నీ మోములో చెరగని చిరునవ్వే...!

ప్రేమకు కులమేంటి..?
నీది న్యాయపోరాటం..!
నీది ధైర్యపు జయగీతం..!
నీ హృదయమే దేవాలయం..!.
నీ బంటియే నీకు భగవంతుడు..!

పోలయ్య కూకట్లపల్లి
కవిరత్న, సహస్ర కవి భూషణ్
అత్తాపూర్ హైదరాబాద్

# ఎమ్మెల్సీ ఎన్నికలకు అంతా సిద్ధం...

- పోలింగ్ సామాగ్రి పంపిణీ
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సూర్యాపేట జిల్లా సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుజిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ బుధవారం సందర్శించారు. సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్ని హాజరయ్యారా లేదా అని ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని తెలిపారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఆర్టీసీ బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీఎస్‌లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. కాగా, జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాలలో 2664 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు. నేటి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలలో నేరుగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఉంటుందని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలతో పాటు అదనపు సిబ్బందిని నియమించామని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీఓ వేణుమాధవ్, పోలింగ్ సిబ్బంది, ఇతర అధికారులు ఉన్నారు.

## ఆ పరమశివుని అనుగ్రహంతో సకల జనులు సంతోషంగా ఉండాలి



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. మహా శివరాత్రి సందర్భగా నాగోల్ లోని ఉప్పల నివాసంలో శివునికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి రోజు తనను పూజిస్తే తన కుమారుడైన కుమారస్వామి కన్నా ఇష్టులవుతారని శివుడు చెప్పడాన్ని బట్టి ఈ విశిష్టత ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. త్రయోదశినాడు ఒంటిపొద్దు ఉండి చతుర్ధశినాడు ఉపవాసం ఉండాలన్నారు. అష్టమి సోమవారంతో కూడి వచ్చే కృష్ణ చతుర్ధశి నాటి మహాశివరాత్రి మరింత శ్రేష్టమైందంటారు. మహాశివరాత్రి వ్రతం రోజు ఉపవాసానికి చాలా ప్రాముఖ్యత నిచ్చారు. అలా అని 'తిథితత్వం'లో చెప్పబడిందన్నారు. 'మీరు స్నానం చేసినా, మంచి వస్త్రాలు ధరించినా, ధూపాలు వెలిగించినా, పూజ చేసినా పుష్పాలంకరణ చేసినా వీటన్నిటికంటే కూడా ఎవరైతే ఉపవాసం చేయగలరో వారంటేనే నాకిష్టం' అంటాడు శివుడు అని ఆయన అన్నారు.

## కుంభమేళాలో డాబర్ ఆమ్లా 'మజ్బూతీకి త్రివేణి' ప్రచారం

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** భారతీయ మహిళలకు పోషణతో కూడిన జుట్టుకు పర్యాయపదంగా చెప్పుకునే ప్రముఖ బ్రాండ్ డాబర్ ఆమ్లా కుంభమేళాలో 'మజ్బూతీకి త్రివేణి' ప్రచారం నిర్వ హించినట్లు డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ అంకుర్ కుమార్ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇది సంప్రదాయం, ఐక్యత, బలం మధ్య బంధాన్ని తెలుపుతుందని అన్నారు. రీడి ఫ్యూజన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ తరుణ్ చౌదరి మాట్లాడుతూ కుంభమేళా అనేది మిలియన్ల మంది ప్రజలను వారి విశ్వాసం, భాగస్వామ్య సంస్కృతి యొక్క బలంతో ఏకం చేసే ఒక సభ అన్నారు. కుంభమేళాలో డాబర్ ఆమ్లా ప్రచారం త్రివేణి బ్రేడ్ ద్వారా ఈ ఐక్యత, బలాన్ని జరుపుకోవడం హర్షణీయం అన్నారు.

## నకిలీ సర్టిఫికెట్ల సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- 70 వేల నుండి 1లక్ష పదివేల రూపాయలుకు విక్రయించినట్లు వెల్లడి



**గద్వాల్ రూరల్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్ నందు నఖిలీ సర్టిఫికెట్స్ సరఫరా చేస్తున్న మిర్యాలగూడకు చెందిన మాజీ ప్రిన్సిపల్ బాలకృష్ణ అనే వ్యక్తిని గద్వాల జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.గత మూడు రోజుల క్రితం అరెస్టు చేసిన నరేష్,నాగరాజు అనే వ్యక్తులకు కాకుండా ఇతర వ్యక్తులకు వ్యవసాయ శాఖలో ఉద్యోగం పొందెందుకు ఇతని క్రింద ఏజెంట్ల ద్వారా ఇప్పటివరకు 12 నకిలీ సర్టిఫికెట్స్ సరఫరా చేసినట్లు గుర్తించడం జరిగిందని గద్వాల డిఎస్పి వై. మొగిలయ్య తెలిపారు. మొత్తం 12 నకిలీ సర్టిఫికెట్లలో 6 గతంలోనే స్వాధీనం చేసుకోగా ఫిబ్రవరి 25 తేదీన సాయంత్రం మిర్యాలగూడలో బాలకృష్ణ నకిలీ సర్టిఫికెట్స్ వేరే వాళ్లకు సరఫరా చేయబోతుండగా నమ్మదగిన సమాచారం మేరకు గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ కు చెందిన పోలీసులు మిర్యాలగూడలో బాలకృష్ణను అదుపులోకి తీసుకొని అతని దగ్గర నుండి మూడు నకిలీ సర్టిఫికెట్స్, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ సర్టిఫికెట్లు వ్యవహారంలో బాలకృష్ణతో పాటు మరొక వ్యక్తి కూడా ఉన్నట్లు విచారణలో తెలిసిందన్నారు. త్వరలోనే సహకరించిన అతని ద్వారా సరఫరా చేసిన నఖిలీ సర్టిఫికెట్స్ రికవరీ చేసి వాళ్లను కూడా అరెస్టు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకోగా ఒక్కొక్క నఖిలీ సర్టిఫికెట్‌కు 70 వేల రూపాయల నుండి 1లక్ష పదివేల వరకు విక్రయించినట్లు తమ విచారణలో వెల్లడైనట్లు డి.ఎస్.పి వై. మొగులయ్య, సీఐ శ్రీను, ఎస్సై కళ్యాణ్ రావు మీడియా సమావేశంలో వెల్లడించారు.

## పేద విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



**చేవెళ్ల, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేవెళ్లలో ఆయన జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రత్నంతో పాటు నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జస్టిస్ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ తరపున ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో మెరుగైన ప్రతిభ చాటిన 60 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతిఏటా విద్యార్థులు చదువులకు తమ ట్రస్ట్ తరుపున సాయం అందిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్ రత్నం, చన్వల్లి ప్రభాకర్ రెడ్డి, డా. వైభవ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, జి వెంకట్ రెడ్డి, దేవుని శర్వలింగం, ఆంజనేయులు గౌడ్, అభిషేక్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కూతురి పెళ్లికి చేసిన అప్పులు తీర్చలేక తండ్రి ఆత్మహత్య



**నర్సాపూర్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** కూతురు పెళ్లి కి చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇది,పోలీసుల కథనం ప్రకారం నర్సాపూర్ మండలం తుజల్ పూర్ అర్జు తండాకు చెందిన హలవత్ గణేష్(42) తన కూతురు వివాహం గత రెండు సంవత్సరాల క్రితం చేశారు,పెళ్లికి చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై బాధపడేవాడని బుధవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి కొద్ది దూరంలో గల హలవత్ కోటి వ్యవసాయ పొలం వద్ద గల చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య హలావత్ సాలమ్మ పిర్యాదు చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

## ప్రయాగ్‌రాజ్ కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బారులు

- స్పైస్‌జెట్ విమానం సాంకేతిక లోపంతో మూడు గంటల ఆలస్యం
- అధికారులతో వాగ్వాదం, ఎయిర్‌పోర్టు ప్రయాణికులు ఆందోళన



**శంషాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** నేటితో కుంభమేళా ముగియనుండటంతో భక్తులు చివరి అమృత స్థానం కోసం ప్రయాగ్ రాజ్ వెళ్లడానికి శంషాబాద్ విమానాశ్రయంలో బారులు తీరారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి అమృత స్థానం చేయాలని సంకల్పంతో ప్రయాగ్ రాజ్ బయలుదేరడానికి విమాన టికెట్లు రెట్టింపైన ఆలోచించకుండా శంషాబాద్ ఎయిర్పోర్టులో బారులు తీరారు. ప్రయాగ్రాజ్ వెళ్లవలసిన స్పైస్ జెట్ విమానం సాంకేతిక లోపంతో ఆలస్యం కావడంతో ప్రయాగ్ రాజ్ వెళ్లవలసిన ప్రయాణికులు శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం ఆందోళన చేశారు. విమానాశ్రయం అధికారులతో పాటు స్పైస్ జెట్ విమాన సంస్థ నాయకులతో వాగ్వాదానికి దిగారు. మూడు గంటలు విమానం ఆలస్యం కావడంతో ఎయిర్పోర్టులో పడిగాపులు కాయాలాని ఆందోళనకు దిగారు. ఎయిర్ పోర్ట్ అధికారులు స్పందించకపోవడంతో ఆగ్రహానకి గురయ్యారు. స్పైస్ జెట్ విమాన సంస్థ సమయ పాలన పాలించకుండా ఎయిర్ లైన్స్ నడపడం ఏంటన్నారు. పిల్లలతో సహా ఎయిర్పోర్టులో పడిగాపులు కాస్తున్నాం. ఆహారానికి ఇబ్బంది పడుతున్నాం. ఏదైనా సాంకేతిక లోపం ఉంటే ప్రయాణికులకు ముందుగానే తెలియజేయాలని తెలియదా అంటూ ప్రయాణికులు స్పైస్జెట్ సంస్థ నాయకులను ప్రశ్నించారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం కాప్రా డివిజన్ పరిధిలోని శ్రీసాయి ఎంక్లివ్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న సమస్యల గురించి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే అధికారులతో మాట్లాడి వెంటనే కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం లక్ష్మీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్ఫర్‌ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, బద్రుద్దున్, మల్లారెడ్డి, గణేష్, కాశీనాథ్, కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కిరణ్, రమేశ్, సుధీర్, రవికాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో ఏడేళ్ల చిన్నారి మృతి



**చిట్యాల, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మండలంలోని గిద్దె ముత్తారంకు చెందిన ఏడేళ్ల చిన్నారి పాముకాటుతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పోలీసులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కిన్నెర శిరీష, రాజు దంపతులకు, ఒక కుమారుడు, కుమార్తె కిన్నెర కీర్తన(7) ఉన్నారు. కుటుంబ సమేతంగా భోజనం చేసి ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి నిద్రిస్తుండగా చిన్నారి కీర్తనకు అర్ధరాత్రి ఒక గంట ల సమయంలో తన కుడిచేతి చూపుడు వేలుకు ఏదో పుట్టిందని నొప్పిగా ఉందని తన తండ్రిని నిద్ర నుండి లేపింది. ఈ క్రమంలో తండ్రి ఇంట్లో వెతగాగా కట్లపాము కనిపించింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక వైద్యశాలకు తరలించి ,మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజిఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు తండ్రి కిన్నెర రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

## అంతర్ రాష్ట్ర గంజాయి గ్యాంగ్ అరెస్ట్



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** అంతర్ రాష్ట్ర గంజాయి గ్యాంగ్‌ను పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ జి శ్రీనివాస్ కథనం ప్రకారం ఒడిశా రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా గంజాయి సరఫరాపై పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం రాత్రి వెంగళరావునగర్ నలంద కళాశాల సమీపంలోని బహిరంగ ప్రదేశంలో గుట్టుగా గంజాయిని విక్రయిస్తుండగా హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన గంజాయి సరఫరాదారుడు, అంతర్ రాష్ట్ర నిందితుడు బాలా హంతల్(24), కూకట్‌పల్లికి చెందిన బుర్రా శ్రీనివాసులు అలియాస్ వాసు(24), కూకట్‌పల్లికి చెందిన పెడ్లర్ గోనుగుంట అభిషేక్ (21)లను అరెస్ట్ చేసి.. వారి నుంచి భారీగా 41 కిలోల గంజాయి, రూ.40 వేలు నగదు, ప్యాకింగ్ మెటీరియల్, డ్యూక్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ దందాలో ఇంకా మరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. చట్ట విరుద్ధంగా జరిగే అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి కఠినంగా వ్యవహరిస్తామని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది




**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** మెదక్, నిజామాబాద్, కరీంనగర్, అదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయులు శాసనమండలి ఎన్నికల నిమిత్తం ఎన్నికల విధులు నిర్వహించడానికి సిబ్బంది బయలుదేరి వెళ్లారు. బుధవారం నియోజకవర్గం పరిధిలో స్థానిక అంబేద్కర్ స్టేడియం లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం నుండి పోలింగ్ సామాగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది వెళ్లారు. మొత్తం 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 25652 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పూర్తి ఏర్పాటు చేశారు.

# శాసనమండలి ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** ఈనెల 27వ తేదీన జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ నిర్వహించే అధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నిర్వహణలో ఓటర్లు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటు హక్కు వినియోగానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక పీ.ఓ, ముగ్గురు ఓ.పీ.ఓల చొప్పున నలుగురు అధికారులతో కూడిన బృందం పోలింగ్ ప్రక్రియను జరిపిస్తుందనిఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ ముగిసిన మీదట బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు చేర్చడం జరుగుతుందన్నారు. పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తగు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు తూప్రాన్ జయచంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, డిఇఓ రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి సంబంధిత పోలింగ్ నిర్వహించే సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
27 ఫిబ్రవరి 2025

# బండి సంజయ్ కేంద్రమంత్రిగా కొనసాగడం దురదృష్టం

- ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్



**కరీంనగర్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంపై పట్టింపు లేకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఒక వర్గాన్ని సంతృప్తి పరచడం కోసం మరో వర్గాన్ని బాహాటంగా తన రాజకీయ ప్రయోజనం కోసం మరొక వర్గాన్ని విమర్శిస్తూ, ఎంపీగా గెలిచి ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలు పట్టించుకోకుండా గాలికి వదిలేసిన బండి సంజయ్ కేంద్రమంత్రిగా కొనసాగడం దురదృష్టకరమని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఒక ప్రకటనలో విమర్శించారు. బండి సంజయ్ అసలు ఈ దేశానికి మంత్రినా, లేక ఒక వర్గానికి పెబ్బనా అర్థం కాని దుస్థితి దాపరించిందన్నారు. 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ లోని 70 ముస్లిం ఉపకులాలను పస్మాంద ముసల్మాన్ అనే పేరుతో వెనుకబడిన ముస్లింల తెగలను ఓబీసీలో చేర్చామని దీనిని నేను ప్రచారం ఎక్కడ చేసుకోలేదని బాహటంగా జాతీయ న్యూస్ ఛానల్ అయినటువంటి ఏఎన్ఐ కి ఇంటర్వ్యూ ఇచ్చారని గుర్తు చేశారు. భారతదేశంలో అణగారిన వర్గాల కంటే అధ్వానమైన పరిస్థితుల్లో దారిద్ర రేఖకు దిగువన ముస్లింలు బ్రతుకు జీవనం వెల్లదీస్తున్నారని విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో ముస్లింలు తీవ్రంగా వెనుకబాటుతనానికి గురయ్యారని రాజేందర్ సచార్ కమిటీ నివేదిక స్పష్టం చేస్తుందన్నారు. బీసీలలో వెనుకబడిన ముస్లింలను కలపడం అంటే మత ప్రాతిపదికన కల్పించిన రిజర్వేషన్లు కావని అట్టడుగు వర్గాల వారి విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా కల్పించిన అటువంటి హక్కు అన్నారు. గత కొద్ది రోజులుగా బండి సంజయ్ బీసీలలో ముస్లింలను కలపద్దని ఒకే పల్లవి ఎత్తుకున్నారని దీంతో నీకు తిరిగి రాష్ట్ర అధ్యక్ష పదవి రాదని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన వ్యక్తి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైనటువంటి పదవిలో కొనసాగుతూ భిన్నత్వంలో ఏకత్వమైనటువంటి ఈ దేశంలో ఉన్నటువంటి ప్రతి పౌరుడు ప్రభుత్వంలో కొనసాగుతున్న మంత్రులకు ఒకే రకమైన ధోరణితో చూడాలి తప్ప ఒక వర్గాన్ని సంతృప్తి పరచడం కోసం తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో బిజెపిని అధికారంలోకి తీసుకురావడం కోసం కేవలం ముస్లింలను టార్గెట్ చేస్తే బండి సంజయ్ కళ నెరవేరదన్నారు సమాజంలోని ప్రతి అట్టడుగు వర్గం అభివృద్ధి చెందాలనే ప్రణాళికతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా తాము గెలిస్తే ఏం చేస్తామో చెప్పాలి కానీ పొద్దస్తమానం బండి సంజయ్ ముస్లింల మీద పడి అరవడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ఆమోదించిన తర్వాత పార్లమెంట్కు బీసీ రిజర్వేషన్ల బిల్లును పంపిస్తే ఆమోదించకుండా ఉండటానికి ముస్లింలను సాగుగా చూపెట్టే కుట్ర జరుగుతుందన్నారు దీంతో పూర్తిగా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు అన్యాయం చేయడానికి బిజెపి పూనుకుందని స్పష్టం అవుతుందన్నారు ఎన్ని రోజులు లేనటువంటి రాద్ధాంతం ఇప్పుడు ముస్లిం రిజర్వేషన్లపై అమాంతం ఆకాశముడి పడ్డట్లు బండి సంజయ్ కి కలలో ఏదో అద్భుతం జరిగినట్లు కనిపించడం దీనిని ప్రజలపై మత వైశమ్యాల పరంగా బలవంతంగా రుద్దడం ఇది యావత్తు బీసీ సమాజం గుర్తుతెరగాలన్నారు పార్లమెంట్లో బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదించకుంటే చాలామంది బీసీలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు బండి సంజయ్ అన్నట్లు ముస్లింల రిజర్వేషన్ శాతం ఎంత ఉంది మెజారిటీగా బీసీలకు వచ్చే రిజర్వేషన్ ఎంత ఉందో ఇందులో ఎవరు ఎవరికి నష్టం చేయబోతున్నారు యావత్తు బీసీ సమాజం ఆలోచన చేయాలని కోరారు. బిజెపి పార్టీకి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రభుత్వం ఆమోదించాక బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్లో ఆమోదించేట్లు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అన్ని కేంద్రాల్లో పటిష్ఠ భద్రత



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** వరంగల్, ఖమ్మం,నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. వరంగల్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను జిల్లా కలెక్టర్క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించడానికి పంపిణీ కేంద్రానికి వచ్చిన పిఓ, ఓపిఓ, మైక్రో అబ్జర్వర్లు, అధికారులు పోలింగ్ లో ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ప్రకారం ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. కాగా, జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందించామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలలో నేరుగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లాలోఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 2352 మంది ఉన్నారని వివరించారు. 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో పీ.ఓ, ఓపీఓలను నియమించామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్. సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, సంబంధిత అధికారులు, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో అపశ్రుతి

- పాతాళగంగలో స్నానానికి వచ్చి తండ్రి, కుమారుడు మృతి

**శ్రీశైలం, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకున్నది. పాతాళగంగ పుణ్యస్నానానికి వచ్చిన తండ్రి, కుమారుడు మృతిచెందారు. శివదీక్ష విరమణకు వచ్చిన ఓ కుటుంబం తెలంగాణ పరిధిలోని లింగాలగట్టు పాతాళగంగ వద్ద స్నానం చేయడానికి నదిలోకి వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు అందులో మునగడంతో తండ్రి, కుమారులు మరణించారు. దీంతో గమనించిన స్థానికులు మృతదేహాలను వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

## ఎమ్మెల్యేల కోటాలో ములుగుకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలి

- బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు రాజమల్ల సుకుమార్



**మంగపేట, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ఎమ్మెల్యేల కోటాలో బిఆర్ఎస్ పార్టీకి సభ్యుల సంఖ్య బలం ప్రకారం ఎమ్మెల్సీ పదవి ఒకటి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ ఎమ్మెల్సీ పదవిని ములుగు నియోజకవర్గానికి చెందిన నాయకులకు అవకాశం ఇవ్వాల్సిందిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను బిఆర్ఎస్ జిల్లా నాయకులు రాజమల్ల సుకుమార్ కోరారు. ములుగు నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పడిన నాటి నుండి దాదాపు 73 సంవత్సరాలు గడుస్తున్న ములుగు నియోజకవర్గానికి నేటి వరకు కూడా ఎమ్మెల్సీ పదవిని ఇచ్చిన దాఖలాలు లేవని ఈసారైనా ఎమ్మెల్యేల కోటాలో బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గానికి ఎమ్మెల్సీ పదవిని తప్పకుండా ములుగు జిల్లాకు ఇవ్వాలని సుకుమార్ కోరారు.

## అచల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన జాగరణ



**బచ్చన్నపేట, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** బచ్చన్నపేట మండల కేంద్రంలోని అచల యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జన జాగరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ గురుస్వామి శ్రీధర్ స్వామి మాట్లాడుతూ అచల యోగ సిద్ధాంతం ఏమనగా విశ్వ మానవ సౌభ్రతత్వము. అన్యోన్య సహకారము అన్నారు. మానవాళికి జనన మరణ కాలచక్రం ఉంటుందని జననంబట్టి కర్మ. కర్మను బట్టి జననం ఉంటుందని కాబట్టి మానవజన్మ ఎత్తినందుకు ఒకరినొకరు అర్థం చేసుకోవాలని కర్మ సిద్ధాంతం ఉన్నది నిజం కనుక జనన మరణాన్ని అర్థం చేసుకొని కుటుంబాన్ని అర్థం చేసుకొని జీవితంలో అనేక లక్ష్యాలను చేదించాల్సి ఉంటుందని అచల యోగ ఫౌండేషన్ తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## శివనామ స్మరణంతో మార్మోగిన కాళేశ్వరం



**మహదేవపూర్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయంలో శివనామస్మరణంతో మార్మోగింది. తెలంగాణలోని అనేక పట్టణాలకు చెందిన భక్తులే కాకుండా మహారాష్ట్ర ఛత్తీస్గడ్ ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా పెద్ద సంఖ్యలో హాజరైనారు. కాళేశ్వరం శ్రీశైల పుణ్యక్షేత్రాల మధ్య నున్న ప్రాంతాన్ని ఈ పేరుతో పిలిచేవారు. మరో ప్రత్యేకత ఏమిటంటే దక్షిణ కాశీగా పేరుఉంది.దక్షిణ భారతదేశంలో గోదావరి త్రివేణి సంగమ స్థానంలో నిలిచి ఉన్నందున స్వయంగా ముక్తేశ్వరుడై వెలసి మృత్యు దేవుడైన యమునికి తన పక్కన స్థానం ఇవ్వడమే స్థలపురాణం ప్రకారంగా యముడిని పూజించిన తరువాత కాళేశ్వరుడిని పూజిస్తే ముక్తి కలుగుతుంది. పితరులకు కూడాముక్తి కలుగునని అనేకమంది భక్తులు కాళేశ్వరాన్ని దర్శించుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరంలో పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుండి భక్తులు రావడంతో ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. ముందుగా భక్తులు కాళేశ్వరం చేరుకొని త్రివేణి సంఘములో పుణ్య స్నానాలుఆచరించి గోదావరి జలాలతో శివలింగాలను అభిషేకించారు. గోదావరి నుంచి దారిలొ ఉన్న గోదావరి మాత. సంగమేశ్వర ఆలయం. అష్టోత్తర శత లింగాలయం. రామాలయంతో పాటు ఆలయ కాంప్లెక్స్ లోని దుర్గామాత. చింతామణి. గణపతి భైరవుడు. మహాగణపతి. మత్స్యం.విష్ణుమూర్తి సుబ్రహ్మణ్యస్వామి ఆలయములో బాల రాజేశ్వరుడు. కాశీ విశ్వేశ్వర ఆలయం. నవగ్రహాలను. సూర్య చంద్రదేవాలయాలను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ప్రధానాలయంలో అభిషేకాలు అర్చనలు నిర్వహించడంతోపాటు సుభానాధ దేవాలయంలో కుంకుమార్చనలు పూజలు భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రధాన ఆలయం వెలుపల ఉన్న మహా సరస్వతి ఆలయంతో పాటు పురాణ ప్రసిద్ధిగాంచిన ఆది ముక్తేశ్వర స్వామి ఆలయం అనేకమంది ప్రత్యేకంగా దర్శించుకున్నారు.

## మంత్రాల నెపంతో వృద్ధురాలి హత్య

- ఆపై బంగారు, వెండి ఆభరణాలు దొంగిలింత



**చిట్యాల, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** మంత్రాల నెపంతో వృద్ధురాలిని హత్య చేసిన ఘటన టేకుమట్ల మండలంలోని గర్మిళ్ళపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. బుధవారం చిట్యాల సర్కిల్ కార్యాలయంలో సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి సంపత్ రావు మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. టేకుమట్ల మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన సొరపాక వీరమ్మ(70) ఈనెల 19న చింతపండు అమ్ముకుంటూ పక్క గ్రామమైన గర్మిళ్లపల్లికి వెళ్లి అదృశ్యమైంది. తెల్లవారి తన కుమారులు ఇట్టి విషయాన్ని గుర్తించి వారి బంధువుల ఇల్లు, చుట్టుపక్కల ప్రాంతాలను వెతకగా ఆమె ఆచూకీ లభ్యం కాలేదన్నారు. కాగా ఈనెల 23న బోయినపల్లి, గర్మిళ్లపల్లి మధ్యలో ఉన్న పసిక మనమ్మకు చెందిన వ్యవసాయ బావిలో నుండి వెలువడిన దుర్గంధ వాసనను గమనించిన బాటసారి బొయిని సంపత్ బావి దగ్గరకు వెళ్లి చూడగా ఒక గుర్తు తెలియని శవం నీటిపై తెలియాడుతూ కనబడినట్లు చెప్పారు. దీంతో తాను గ్రామస్తులకు సమాచారం అందించగా గ్రామస్తులు వచ్చి అట్టి శవాన్ని బయటకు తీసి పరిశీలించగా అట్టి శవం సొరపక వీరమ్మదిగా గుర్తించినట్లు చెప్పారు. అట్టి మహిళను గుర్తు తెలియని వ్యక్తులు చంపి చేతులు వెనుకకు తాడుతో కట్టి గోనె సంచిలో కుక్కి బావిలో వేసినట్లుగా కుటుంబ సభ్యులు టేకుమట్ల పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసుకొని పోలీసు దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా గర్మిళ్ళపల్లిలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, ఇతర టెక్నికల్ సాక్షాలు ద్వారా కొంతమంది అనుమానితుల్ని విచారణ చేస్తుండగా బోయినపల్లి గ్రామానికి చెందిన బోయిన మల్లయ్య ఏ-1గా, పుట్టకొక్కుల శ్రీనివాస్ ను ఏ-2 గా, గర్మిమిళ్ళపల్లికి చెందిన మద్దెల సిద్దును ఏ-3లుగా పోలీస్ స్టేషన్ నందు లొంగిపోయినట్లు వెల్లడించారు.

## భద్రాచలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. రాత్రి వేళలో చల్లటి గాలులు వీస్తున్నప్పటికీ.. ఉదయం 9 గంటల తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో గాలిలో తేమ తగ్గడంతో ఉక్కపోత వాతావరణం నెలకొంటుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 35 నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం భద్రాచలం జిల్లా భద్రాచలంలో అత్యధికంగా 38.3 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే విధంగా మంచిర్యాల జిల్లా ఖాసీపేటలో, ములుగు జిల్లా గోవిందరావుపేట, నిజామాబాద్ జిల్లా మంచిప్పలో 38.2 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో ఎలాంటి హీట్ వేవ్స్ వచ్చే అవకాశం లేదని, ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్లో 33 నుంచి 35 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర, తూర్పు జిల్లాల్లో 35 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటాయని, ఉదయం సమయంలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుందన్నారు. మార్చి 2 నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభమవుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలి

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**మొయినాబాద్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని, గెలుపే లక్ష్యంగా కలిసి పని చేయాలని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారిగా మండల నాయకులతో కలిసి బుధవారం నగరంలోని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అందజేశారు. అదే విధంగా మహాశివరాత్రి పండుగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టుదలతో పని చేసినప్పుడు అన్ని ఎన్నికల్లో మనదే గెలుపు ఉంటుందని సూచించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రజలు గెలుపు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అందరూ పట్టుదలతో కలిసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు ముదిగొండ శ్రీహరియాదవ్, ముదిగొండ రవియాదవ్, మక్తాల సురేందర్ గౌడ్, శ్రీరామ్ నగర్ కృష్ణారెడ్డి, పరమేష్, ప్రసాద్, జెల్లల మల్లేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేటీకే 8 ఇంక్లైన్, యూజీ 2 సిమ్ ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రమేష్
- అన్ని గనులు డిపార్ట్మెంట్లపై మెమోరండం



**భూపాలపల్లి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** కేటీకే 8 యూజీ సిమ్ 2 సిమ్ ప్రైవేటి కరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, సింగరేణి యాజమాన్యం విరమించుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం భూపాలపల్లి ఏరియా కేటీకే 8 యుజి గని 2 సిమ్ ప్రైవేట్ పరం చేయడానికి వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అన్ని డిపార్ట్మెంట్లు, గనులపై అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శిమదుగాని.విజేందర్ అధ్యక్షతన గేట్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల.రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గని ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రైవేటీకరణ చేయడం వల్ల డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ పోవడమే గాక సంస్థ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతుందని, కొత్తగనులు ఏర్పాటు కనుమరుగై భవిష్యత్తులో సింగరేణి సంస్థ మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొన్నారు. నైపుణ్యం ఉన్న కార్మికులు, టెక్నీషియన్స్, అధికారులు ఉన్నా బొగ్గు తీసే పనిలో 130 సం.రాల చరిత్ర ఉన్న సింగరేణి యాజమాన్యం,కార్మికులను కాదని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం సంస్థని ఉద్దేశ్యపూర్వకంగా నిర్వీర్యం చేసే ఆలోచనలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. దీన్ని ప్రతిఘటించకపోతే భవిష్యత్తులో సంస్థ,కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. సంస్థను రక్షించే ప్రయత్నంలో భాగంగా యూనియన్ కి మద్దతుగా కార్మిక వర్గం ఉండాలని భవిష్యత్తులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.27న జరిగే జిఎం కార్యాలయం ముందు ధర్నాను విజయవంతం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. కేటీకే 8 ఇంక్లైన్ గనిలోని 2వ సీమ్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్/ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని మేనేజర్ కు మెమొరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి కార్యదర్శి సుధాకర్,ఆర్గనైజింగ్ సెక్రటరీ జగత్ రావు,ఓసి-3 పిట్ సెక్రటరీ కృష్ణా రెడ్డి, పిట్ కమిటీ గౌరవ సలహాదారుఎస్.శ్రీనివాస్,వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ హరీష్,అసిస్టెంట్ పిట్ సెక్రటరీ శ్రీకాంత్,మైన్స్ కమిటీ,సేఫ్టీ కమిటీ,టెంపుల్ కమిటీ,క్యాంటీన్ కమిటీ సభ్యులు,షిఫ్ట్ ఇన్చార్జిలు, అసిస్టెంట్ షిఫ్ట్ ఇంచార్జీలు, కార్యకర్తలు, కార్మిక సోదరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే ఉద్యమ సాధకులుగా గుర్తించాలి



**సైదాపూర్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మండల కేంద్రంలో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించి పోస్ట్ ఆఫీస్ డబ్బాలో పోస్ట్ కార్డు లను వేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమ కారుల అధ్యక్షులు మాదాసు శ్రీనివాస్ సైదాపూర్ మండల అధ్యక్షులు వస్తాదుల సదానందం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పోస్ట్ కార్డులు వేస్తూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ 250 గజాల ఇంటి స్థలం తో పాటు నెలకి 25000 రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించి ఒక ఐడి కార్డ్ ఇచ్చి తెలంగాణ సాధకులుగా గుర్తించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యమ కారులు బైర శ్రీనివాస్, గడ్డం స్వామి,తూటీ శ్రీనివాస్,శీరంశెట్టి శ్రీనివాస్, గొడిశాల కిరణ్ పాల్గొన్నారు.

## బండి సంజయ్.. చిల్లర మాటలు బంద్ చెయ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** సంజయ్కి హితవు పలికారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 11 సంవత్సరాలుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కనీసం జిల్లాకు 200 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని అన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సీతక్క మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగులకు, యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆరోపించారు. చెప్పుకోవడానికి అభివృద్ధి లేదు, సబ్జెక్టు అంతకన్నా లేదని అన్నారు. అందుకే బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూస్తాన్, పాకిస్తాన్, హిందూ, ముస్లిం తప్ప మరో మాట లేదని అన్నారు. పట్టభద్రులకు మీరేం చేశారని సూటిగా బండి సంజయ్ని ప్రశ్నిస్తున్నానని చెబుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బిజెపికి లేదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మి, ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారని బిజెపిపై విమర్శలు గుప్పించారు.

# న్యాయం జరగకపోతే పాదయాత్ర చేస్తాం

**మొక్క జొన్న రైతుల ఆవేదన..**

**సిబిఐ విచారణ చేపట్టాలి : ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి**

**కంపెనీ ఆర్గనైజర్ల బ్యాంక్ ఖాతాలను సీజ్ చేయాలి..**

**నూగూర్ వెంకటాపురం ఫిబ్రవరి 26(జనం సాక్షి)**



బహుళ జాతి విదేశీ విత్తన ఉత్పత్తి కంపెనీలు ఒప్పంద వ్యవసాయం పేరుతో రైతులను దగా చేస్తున్నారని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి మండిపడ్డారు. వెంకటాపురం, వాజేడు మండలాల మొక్కజొన్న రైతులు వెంకటాపురం మండల కేంద్రంలో ని ప్రభుత్వ విశ్రాంతి భవనం లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సింజెంట, హైటెక్, సీపీ లాంటి విత్తన కంపెనీలను అడ్డు పెట్టుకొని తమని లక్షల రూపాయల మేరకు మోసం చేసినట్టు రైతులు పత్రికా ముఖంగా ఆవేదన వెళ్ళండించారు. తమ శ్రమను దోచు కుంటూ ఉన్నట్టు రైతులు తెలిపారు. రైతుల ఉసురు తగులుతుంది అని అన్నారు. బాండ్ వ్యవసాయం అని మోసం చేసి నట్టు తెలిపారు. కంపెనీల తో డీలర్లు ఒప్పందం చేసుకొని రైతులను కూలీలు మార్చినట్టు తెలిపారు. కంపెనీ నుండి వచ్చే ప్రయోజనాలను డీలర్లే హస్తంగతం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కంపెనీ అధిక ధర నిర్ణయిస్తే, డీలర్ దానిలో సగం కూడా ఇవ్వడం లేదన్నారు. ఆర్డిఓ విచారణ పూర్తిగా లోపభూయిష్టంగా ఉందన్నారు. రైతులను, కంపెనీ మేనేజర్లను, డీలర్లతో కలిపి విచారించక పోవడం లో ఏదో ఆంతర్యం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. డీలర్లు ఏజెన్సీ ప్రాంత రైతులకు వ్యవసాయం చేయడం రాదని అధికారులను తప్పుత్రోవ పట్టించడం పైన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చేనుకు చీడ పట్టినట్టు రైతుకు డీలర్ల రూపంలో చీడ పట్టిందని అన్నారు. మూడు ఏళ్లుగా ఈ దందా జరుగుతోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించక పోవడం పైన నర్సింహా మూర్తి మండిపడ్డారు. అధికార ప్రతి పక్ష పార్టీలను అడ్డుపెట్టుకొని డీలర్లు కోట్ల రూపాయలు సంపాదించి రాజకీయ నాయకుల అవతారం ఎత్తు తున్నారని అన్నారు. కోట్ల రూపాయల మొక్కజొన్న కుంభ కోణం పైన ప్రభుత్వం సిబి ఐ విచారణకు ఆదేశించాలని రైతులు డిమాండ్ చేశారు. వ్యవసాయ మంత్రిని అడ్డు పెట్టుకొని చేస్తున్న ఆగడాలను పార్టీల పెద్దలు అడ్డుకోవాలని కోరినారు. వాజేడు వెంకటాపురం గ్రామాలకు చెందిన మొక్కజొన్న రైతులు పాల్గొన్నారు..

# విమానాలు ఆలస్యం.. ప్రయాణికుల ఆగ్రహం

**హైదరాబాద్ (జనంసాక్షి)**




**స్పైస్ జెట్ విమాన ఆలస్యంపై హైడ్రామా**

**రన్వే పైకి వెళ్లి తిరిగి పార్కింగ్ బేలోకి వచ్చిన విమానం**

**విమానయాన సంస్థల నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం**

హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల విమానాల్లో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతుండటంతో ప్రయాణికుల కష్టాలు పెరిగిపోతున్నాయి. గమ్యస్థానాలకు సరిగ్గా చేరాల్సిన విమానాలు గంటల తరబడి ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. తాజాగా మరోసారి స్పైస్ జెట్ విమానం ఆలస్యం కావడం విమానాశ్రయంలో కలకలం రేపింది.

ప్రయాగ్రాజ్ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో మూడు గంటలుగా ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. ఎప్పుడెప్పుడు విమానం బయలుదేరుతుందా అని ఎదురుచూస్తూ అలసిపోయిన ప్రయాణికులు ఎయిర్పోర్టులో ఆందోళనకు దిగారు. విమాన సిబ్బంది కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడంతో ప్రయాగ్జ్ వెళ్లే ప్రయాణికులు మండిపడుతున్నారు.

ఇదే నెలలో ఇదే స్పైస్ జెట్ విమానం ఐదున్నర గంటల పాటు ఆలస్యమైన సంఘటన ఇంకా మరిచిపోక ముందే మరోసారి ఈ తరహా ఆలస్యాలు చోటుచేసుకోవడం విమానయాన సంస్థల నిర్లక్ష్యాన్ని అర్థమయ్యేలా చేస్తోంది. ఫిబ్రవరి 7న ప్రయాగ్రాజ్ వెళ్లాల్సిన విమానం పలు కారణాలతో ఐదున్నర గంటలు ఆలస్యం అవడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10:30 గంటలకు బయలుదేరాల్సిన విమానం సాయంత్రం అయ్యే సరికి గమ్యస్థానానికి చేరలేదు. దీనిపై నిరసన వ్యక్తం చేసిన ప్రయాణికుల్లో హీరో విజయ్ దేవరకొండతో పాటు పలువురు సినీ ప్రముఖులు, ఇద్దరు ఐఏఎస్లు, ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులు కూడా ఉన్నారు. "గంటల తరబడి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మా సమయాన్ని వృథా చేస్తున్నారు!" అంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇక అంతకు ముందు రోజు మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. గుహవాటి వెళ్లాల్సిన ఇండియన్ ఎయిర్లైన్స్ విమానం రన్ వేపైకి వెళ్లాక ఇంజిన్ మొరాయించింది! పైలెట్ అప్రమత్తమై వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఇంజనీరింగ్ నిపుణులు వెంటనే రంగంలోకి దిగారు. దాదాపు గంట పాటు లోపాన్ని సరిచేయడానికి ప్రయత్నించి ఎట్టకేలకు విమానాన్ని మళ్లీ అందుబాటులోకి తీసుకువచ్చారు. కానీ రన్వేపైకి వెళ్లిన విమానం తిరిగి పార్కింగ్ బే వైపు రావడంతో ప్రయాణికుల్లో గందరగోళం నెలకొంది. చివరకు గంటన్నర ఆలస్యంగా విమానం గమ్యస్థానానికి బయలుదేరింది.

తరచూ సాంకేతిక లోపాలు తలెత్తడం, ఆలస్యమైనా కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడం పై విమానయాన సంస్థలపై ప్రయాణికుల అసహనం పెరుగుతోంది. "ఎప్పుడెప్పుడు బయలుదేరుతుందో చెప్పకుండా గంటల తరబడి నిలిపేస్తే ప్రయాణికుల పరిస్థితి ఏమిటి?" అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండటంతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలనే డిమాండ్ మరింత బలపడుతోంది.

# కేసీఆర్ పాలనలో పదేళ్లు పచ్చగా తెలంగాణ

**కాంగ్రెస్ పాలనలో కరువుకు కేరాఫ్‌గా మారింది**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

**గోదావరిఖని, జనంసాక్షి:**



తెలంగాణ ఉద్యమ మహ నాయకులు సిఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ పదేళ్లు పచ్చగా కళకళలాడిందని,అసమర్థ కాంగ్రెస్ పాలనలో కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని,నాడు గోదావరినది నిండుకుండలా జలకల సంతరించుకుంటే, నేడు కాంగ్రెస్ పాలనలో గోదావరినదిలో నీళ్లు లేక వెలవెలబోతుందని రామగుండం మాజీ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు .బుధవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గోదావరినదిని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ ఎంతో గొప్పగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి గోదావరి నదిని నిండుకుండలా మార్చరన్నారు.కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో గోదావరినదిపై తెప్పల పోటీలు నిర్వహించామని చెప్పారు.మహాశివరాత్రి పర్వదినం నాడు భక్తులు గోదావరినది స్నానం అచరించడం అనవాయుతిగా వస్తుందని, కాని స్నానాలు చేసేందుకు సరైనా నీరులేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని,ఇది కాంగ్రెస్ పార్టీ అసమర్థత పాలనకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన మార్పు ఇదేనా అని ఆయన ప్రశ్నించారు.అబద్ధాలతో అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

# కొల్చారంలో తాగునీటి కటకట

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 26 (జనం సాక్షి):**





జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారం 9వ వార్డులో అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి కటకట నెలకొంది. గత ఆరు నెలల నుండి తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో కృష్ణవేణి దృష్టికి తీసుకుపోయిన చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని వార్డు ప్రజలు తెలిపారు. బోరుబావి ఉన్న సింగల్ ఫేస్ మోటర్ మార్చడానికి పంచాయతీ సెక్రటరీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శివరాత్రి పండగ పర్వదినం సందర్భంగా తొమ్మిదవ వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి స్థానికంగా ఉండకుండా సిద్దిపేట నుండి వారానికి ఒకసారి 15 రోజులకు రెండుసార్లు వస్తూ, పోతూ తన విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎండాకాలం సమీపిస్తున్న రోజుల్లో త్రాగునీరు ఇంట్లో వివిధ అవసరాల నిమిత్తం వాడుకోవడానికి సమీపంలో నీరు లేకపోవడంతో దూర ప్రాంతాల నుండి 200 కుటుంబాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇట్టి విషయంపై అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే జిల్లా కలెక్టర్ కి, ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానిక ప్రజలు తెలిపారు.

# జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం

**రెండు నిండు ప్రాణాలు బలి**

**హైదరాబాద్ (జనంసాక్షి)**



లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంగర్ హౌస్ హుడా పార్క్ చెరువు శుభ్రం చేసే క్రమంలో తండ్రి కొడుకుల మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. లంగర్ హౌస్ లోని హుడా పార్క్ చెరువులో చెరువు శుభ్రం చేసే ఔట్సోర్సింగ్ సిబ్బంది మహమ్మద్ కరీం (38) శివరాత్రి సందర్భంగా స్కూలుకి సెలవు ఉండడం వల్ల తన కొడుకు సాహిల్ (15)ను తనతో పాటు తీసుకువచ్చాడు. మధ్యాహ్నం సుమారు ఒంటి గంట ప్రాంతంలో మహమ్మద్ కరీం తన కొడుకు సాయిల్ తో కలిసి హుడా పార్క్ చెరువులోని గుర్రపు డెక్కను శుభ్రం చేసే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. సాహిల్ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో అక్కడ బురదలో ఇరుక్కుపోయి తన తండ్రిని సహాయం కోరాడు. దీంతో తండ్రి కరీం కూడా వెళ్లి తన కొడుకు సాయం చేసే క్రమంలో ఇద్దరు నీళ్లలో లోతుగా బురదలో ఇరుక్కుపోయి ప్రాణాలు కోల్పోయారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లు తీవ్రంగా శ్రమించి సాయంత్రం సమయానికి ఇద్దరి మృతదేహాలను బయటకు వెలికితీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మాని యా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## పెరిగిన నెహ్రూ జూపార్క్ టికెట్ ధరలు

**13 కొత్త రేట్లు మార్చి 1 నుంచి అమల్లోకి..**

**హైదరాబాద్ (జనం సాక్షి)**

హైదరాబాద్లోని నెహ్రూ జూపార్కులో టికెట్ ధరలు పెరిగాయి. అన్ని రకాల టికట్ ధరలను ప్రభుత్వం పెంచింది. మంగళవారం పార్క్ జరిగిన జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ 13వ గవర్నింగ్ బాడీలో చర్చించి ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్త రేట్లు మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని జూపార్క్ క్యూరేటర్ వసంత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి నెహ్రూ జూపార్క్ ఎంట్రీ టికెట్ పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.50 చొప్పున వసూలు చేయనున్నారు. గతంలో పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.45గా ఉండేది. ఫోటో కెమెరా అనుమతికి రూ.150, వీడియో కెమెరా (ప్రొఫెషనల్)కు రూ.2500 రూపాయలు, కమర్షియల్ మూవీ షూటింగ్ కోసం రూ.10 వేలు ఛార్జి చేస్తారు. అన్ని రోజుల్లో ట్రైన్ రైడ్ 20 నిమిషాలకు పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.40లుగా నిర్ణయించారు. బ్యాటరీ ఆపరేటెడ్ అయితే పెద్దలకు రూ.120, పిల్లలకు రూ.70 చొప్పున వసూలు చేయనున్నారు.

# అంబర్‌పేట్ ఫ్లైఓవర్ పైనుంచి రాకపోకలు

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశంతో షురూ..**

**హైదరాబాద్ (జనంసాక్షి)**



హైదరాబాద్లోని అంబర్‌పేట్ ఫ్లైఓవర్ పై నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. స్థానిక పార్లమెంట్ సభ్యుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశంతో అంబర్‌పేట్ ఫ్లై ఓవర్పై రాకపోకలు బుధవారం ఉదయం నుంచి కొనసాగుతున్నాయి. దాదాపుగా ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. అయితే కింద భాగాన రోడ్డు నిర్మాణం, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్యక్రమాలను పూర్తిచేసి అధికారికంగా మరికొన్ని రోజుల్లో ఫ్లైఓవర్ ప్రారంభించనున్నారు. అంతవరకు ప్రయాణికుల సౌకర్యార్థం శివరాత్రి నుంచి ఈ బ్రిడ్జి రాకపోకలను అనుమతించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఫ్లైఓవర్ పనులను పర్యవేక్షించారు. కేంద్రమంత్రి ఆదేశాలతో బుధవారం నుంచి బ్రిడ్జి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ దశాబ్దాల కల దీని కోసం చాన్నాళ్లుగా స్థానికులు, ఈ మార్గంలో రోజూ ప్రయాణించే వారు ఎదురుచూస్తున్నారు. శివరాత్రి సందర్భంగా అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# దర్శనానికి బైక్ పై వెళ్లుచుండగా రోడ్డు ప్రమాదం

**రోడ్డు ప్రమాదంలో భార్య మృతి**

**భర్తకు బలమైన గాయాలు**

**మహదేవపూర్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి):**



మహాశివరాత్రి సందర్భంగా శివుని దర్శనానికికాళేశ్వరం భార్యా భర్త ఇద్దరు కలిసి స్కూటీ పై వెళుచుండగా అన్నారం క్రాస్ రోడ్ మూలమలుపు వద్దబైకు అదుపు తప్పిరోడ్డు ప్రమాదంలో భార్య చిమతి భాగ్య అక్కడికక్కడే మృతి. భర్త సమ్మయ్యకు బలమైనగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా జంగేడు గ్రామానికి చెందిన చీమతి సమ్మయ్య(51), భాగ్య(45) భార్య భర్త ఇద్దరు కలిసి స్కూటీ పై కాళేశ్వరం శివుని దర్శనానికి బయలుదేరారు. అన్నారం ఎక్స్ రోడ్ మూలంపు వద్ద బైకు అదుపుతప్పి డ్రైవింగ్ చేస్తున్న సమ్మయ్యకు బలమైన గాయాలయ్యాయి. భాగ్య అక్కడికక్కడే మృతి చెందింది. కాలేశ్వరం వెళ్తున్న భక్తులు 108 కు సమాచారం అందించగానే ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి వెళ్లి మృతురాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త సమ్మయ్యకు హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

# అధిక వడ్డీ ఆశ చూపి..

**రూ.70 కోట్లకు పైగా కుచ్చుటోపి**





**హైదరాబాద్ (జనం సాక్షి)**

అధిక వడ్డీ, చిట్టీల పేరుతో డబ్బులు వసూలుచేసి రూ.70 కోట్లకు కుచ్చుటోపీ పెట్టాడో తాపీ మేస్త్రీ. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుత్తికి చెందిన పుల్లయ్య రెండు దశాబ్దాలుగా హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎస్ఆర్ నగర్ పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నారు. స్థానికులతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుని.. బీకే గూడ, ఎస్ఆర్ నగర్‌లో 15 ఏండ్లుగా చిట్టీ ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అధిక వడ్డీ పేరు చెప్పి దాదాపు 300కుపైగా ఖాతాదారులను జమచేశారు. వారి నుంచి వసూలు చేసిన దాదాపు రూ.70 కోట్లతో ఉడాయించారు. కాగా, పుల్లయ్య బాధితులు బల్కంపేట, ఎస్సార్ నగర్‌కు మాత్రమే పరిమితం కాలేదు. అతని స్వస్థలమైన అనంతపురం జిల్లాలోని గుత్తి, కర్నూల్ జిల్లాలో కూడా ఉన్నారు. చాలామంది తాము దాచుకున్న నగదుతోపాటు తమకు తెలిసిన వారి నగదును కూడా అధిక వడ్డీ వస్తుందన్న ఆశతో పుల్లయ్య దగ్గర డిపాజిట్లు చేయించిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. డబ్బు కోసం ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో పుల్లయ్య ఈనెల 24, 25, 26వ తేదీల్లో డబ్బులు చెల్లిస్తున్నానంటూ నమ్మబలికాడు. అయితే 23వ తేదీ సాయంత్రం తన ఫార్చునర్ వాహనాన్ని ఇంట్లోనే వదిలి ఓ క్యాబ్లో తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిపోయినట్టు తెలుస్తున్నది. ఇదిలా ఉంటే నగదు కోసం పుల్లయ్య ఇంటికి వచ్చిన వారికి ఇక్కడ వాస్తవ పరిస్థితులు చూడగా అసలు విషయం వెల్లడైంది. చాలామంది పెళ్లిళ్లు వ్యాపారం, విద్యా, వైద్య అవసరాలకు సంబంధించి పుల్లయ్య దగ్గర 24 25 26వ తేదీలలో డబ్బులు తీసుకోవాల్సి ఉంది. పుల్లయ్య ఉడయించిన విషయం తెలుసుకొని బాధితులు గగ్గోలు పెడుతూ బీకే గోడలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఈ మేరకు బాధితులు ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 27 ఫిబ్రవరి 2025

# చదువును ఇష్టపడి చదవాలి

- బాలికల విద్య సమాజాన్ని మార్చే శక్తి ఉంది
- ఎస్పీ శరత్ చంద్ర పవార్



నలగొండ టౌన్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) : బాలికలు చదువును ఇష్టపడి చదవాలని, బాలికల విద్య సమాజాన్ని మార్చే శక్తి ఉందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు.పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ సమావేశంలో విద్యార్థినిలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎవరు ధైర్యం కోల్పోకుండా చదువునే నమ్ముకుని, పరీక్షలు రాసి సమాజంలో ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు.మిషన్ పరివర్తన లో భాగంగా యువత డ్రగ్స్ గంజాయి వీటి బారిన పడి పెడదారి పడుతున్నారని,మరి సమాచారం తెలిసిన యెడల అందించేచో వారిని సన్మార్గంలోకి మార్చి మిషన్ పరివర్తన లో మామూలుగా వారిని మార్చి మంచి ప్రవర్తనతో ఉండేలా పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందన్నారు.కళాశాలలో చదువుకునే రోజుల్లోనే ధైర్యంగా ముందడుగు వేయాలని షీ టీం, భరోసా, ప్రాధాన్యతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి మాట్లాడుతూ విద్యార్థినిలు చదువుకునే ఆయుధంగా చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి అందరికీ ఆదర్శంగా ఉండాలని కోరారు సమాజంలో మీకంటూ ఒక ప్రత్యేకతను చాటుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డి ఐ ఈ ఓ దశ్రు నాయక్,డిఎస్పి శివరాం రెడ్డి, మహిళ పోలీస్ స్టేషన్ సిఐ కరుణాకర్,రిటైర్డ్ ప్రిన్సిపల్ గోన రెడ్డి,నర్సిరెడ్డి వెంకట్ రెడ్డి,అన్ని సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.అనంతరం కళాశాల నుండి వెళ్లిన అధ్యాపకులు శిల్ప,కవిత,అన్సారి, వెంకన్న,తస్లీమ్ లను కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థినిలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముఖ్యఅతిథిగా చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు.

## సామాన్య ప్రజలకు చేరువలో న్యాయ సేవలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి బి నిర్మల గీతాంబ
- కాశిబుగ్గలో చట్టాలపై అవగాహన కార్యక్రమం



వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) : వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా కాశిబుగ్గ లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం ముందు ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేసి, సందర్శకులకు చట్టపరమైన సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ స్టాల్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ " ప్రజలందరూ వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో ఈ స్టాల్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, చట్టానికి పేద, ధనిక అనే భేదం ఉండదని ఈ సందర్భంగా తెలియజేశారు. జాతీయ లోకృత అంశం పట్ల వివరణ ఇచ్చి, రాజీమార్గం ద్వారా మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ లో తమ కేసులను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఎటువంటి న్యాయ సహాయానికైనను జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించి ఉచిత న్యాయ సేవలు, సలహాలు పొందవచ్చునని తెలిపారు ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థలకు సంబంధించిన వివిధ చట్టాల కరపత్రాలను సందర్శకులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ శ్రీధర్, జువైనల్ సభ్యుడు మేరుగు సుభాష్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది శ్రవణ్, రాజు నాగరాజు, సింధు తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్ నుంచి గ్రీన్‌ఫీల్డ్ వరకు రహదారి

- రెండు ప్యాకేజీల్లో పనులు పూర్తి
- కొలిక్కి వచ్చిన భూ సేకరణ.. టెండర్లు ఆహ్వానం
- మార్చి 21న సాంకేతిక బిడ్లు : హెచ్ఎండీఏ



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్కిల్ సిటీ, ఫ్యూచర్ సిటీలకు సంబంధించి గ్రీన్ఫీల్డ్ రహదారి (రతన్ టాటా రోడ్డు) నిర్మాణం మొదలు కానుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పనుల కోసం హెచ్ఎండీఏ మంగళవారం టెండర్లను ఆహ్వానించింది. రెండు ప్యాకేజీల్లో ఈ రహదారి నిర్మాణం పనులు పూర్తి చేయనున్నారు.

### కొలిక్కి వచ్చిన భూ సేకరణ

ప్రస్తుతం అవుటర్ రింగ్ రోడ్డుని రావిర్యాల ఇంటర్ఛేంజ్ 13 నుంచి ఆమన్గల్ రీజినల్ రింగ్ రోడ్డు అనుసంధానంగా మొత్తం 41.50 కిలోమీటర్ల పొడవుతో ఈ గ్రీన్ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నారు. ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చింది. దీంతో పనులు చేపట్టేందుకు హెచ్ఎండీఏ సమాయత్తమవుతోంది. తొలి దసలో రావిల్యాల్ ఇంటర్ ఛేంజ్ నుంచి మీరా?న్పేట్ వరకు 19.2 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు.

### మార్చి 21న సాంకేతిక బిడ్లు


రెండో దశలో మీరాన్పేట్ నుంచి ఆమన్గల్ వరకు 22.30 కిలోమీటర్ల మేర అందుబాటులోకి రానుంది. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమన్గల్ మండలాలు, 14 గ్రామాలను కలుపుతూ ఈ రహదారి అందుబాటులోకి రానుంది. టెండర్ పత్రాలు ఈ నెల 28 నుంచి సమర్పించాలని, మార్చి 21న సాంకేతిక బిడ్లు తెరవనున్నట్లు హెచ్ఎండీఏ తెలిపింది.

# మీ ఓటు..రేపటి కోసం..

- ఓటు వేసే ముందు ఆత్మ విమర్శ చేసుకోండి
- మన ఓటు రేపు లక్షల మందికి నాంది పలకాలి
- డబ్బుతో ముడిపెట్టే రాజకీయాలకు స్వస్తి పలకాలి
- నీ ఓటుతో లక్షలమంది పట్టభద్రుల జీవితాలు మారాలి
- స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలుకు

ఓ పట్టభద్రుడా ఒక్కసారి ఆలోచించి మీ యొక్క ఓటు వెయ్యి. ఓటు వేసే ముందు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకో, నీ యొక్క ఓటు ఎంత విలువైనదో తెలుసుకో. నీవు చదువుకున్న స్థితిగతులు, నీ కుటుంబ పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకుని నీయొక్క ఓటుకు స్వచ్ఛమైన విలువ వచ్చే విధంగా చూసుకో. నీ యొక్క ఓటుకు ఎంత విలువ ఉందో దాని యొక్క సామర్థ్యం ఏంటిదో గమనించి నీవు వేసే ఓటు బావి తరాలకు నాంది పలకాలి.

సుల్తానాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి)
నీ యొక్క ఓటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపాలి. నీ యొక్క ఓటు ఎంత స్వచ్ఛమైనదో నిరూపించాలి. నీ ఓటు నీచ రాజకీయాలకు, అమ్ముడు పోనీ ఓటుగా మారాలి. అప్పుడే పట్టభద్రులకు వారి యొక్క ఓటు విలువ తెలుస్తోంది. నేటి సమాజంలో ఓటు యొక్క విలువ తెలుసుకోక ఎంతోమంది అమ్ముడుపోయి, తమ అమూల్యమైన ఓటును దుర్వినియోగం చేస్తే, రానున్న రోజులలో ఏమి జరుగుతుందో అంతా గమనిస్తున్నాం. స్వార్థ రాజకీయాలకు, అమ్ముడు పోయే నీచ రాజకీయాలకు స్వస్తి పలకాలి. అప్పుడు నీకు సమాజంలో విలువ గౌరవం పెరుగుతుంది. పార్టీలలో పనిచేసే చదువు రాని వ్యక్తి చెప్తే అతను మద్యం తాగిస్తేనో, ఓటుకు డబ్బులు ఇస్తేనో, నేడు నీవు అమ్ముడుపోతే, రేపు సమాజానికి, నీవు ఏమి సమాధానం చెప్పాల్సి వస్తుందో ఆలోచించుకో. ఓటు అనే వజ్రాయుధంతో నీ యొక్క సామర్థ్యాన్ని నిరూపించే సమయం ఆసన్నం అయింది. అట్టి ఓటును సద్వినియోగం చేసుకుంటే రేపు ప్రజాస్వామ్యంలో ఓటు అనే పదానికి అర్థం చెప్పిన వాడవు అవుతావు. మీకు నచ్చిన వ్యక్తికి అమ్ముడుపోయే సమాజానికి విరుద్ధంగా ఓటు వేసి ఒక నిజాయితీపరుడు భవిష్యత్తులో మన తరాలకు పని చేసే వ్యక్తికి, మన యొక్క సాధక బాధలలో తోడుగా ఉండే వ్యక్తికి, మన యొక్క సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసే వ్యక్తికి, నీ భావాలను నీ యొక్క బాధ్యతలను నీ యొక్క బాధలను అర్థం



చేసుకొని వ్యక్తికి నీ యొక్క ఓటు వేసి నీవు సమాజంలో గౌరవప్రదంగా తలెత్తుకొని తిరిగే విధంగా మీ యొక్క ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పట్టబద్రుల సమక్షంగా కోరుకుంటున్నాము.

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సర్వం సిద్ధం





నలగొండ బ్యూరో, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్,వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు.బుధవారం ఆమె నల్గొండ సమీపంలోని ఆర్జాలబావి పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటుచేసిన వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తో కలిసి సందర్శించారు.ఎన్నికల సామాగ్రి పంపిణీ ఏర్పాటులను పర్యవేక్షించి పోలింగ్ కు నియమించిన సిబ్బందితో మాట్లాడారు.అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని,ఈ నెల 27 న పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, నల్గొండ జిల్లాతో పాటు తక్కిన11జిల్లాల ఎన్నికల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు.ఎన్నికలలో 752 మంది సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నామని,ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్,సెక్టోరల్ ఆఫీసర్ చొప్పున నియమించామని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులతో కూడిన బృందాలను పోలింగ్ కేంద్రాల్లో నియమించినట్లు ఆమె వెల్లడించారు.సిబ్బంది అందరికీ రెండు విడతలుగా శిక్షణ ఇవ్వడం జరిగిందని,పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని, వీటితోపాటు,ఓఆర్ఎస్ పాకెట్లు,ప్రథమ చికిత్స, మందులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.అభ్యర్థులు,రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రాధాన్యత ఓటు పై అవగాహన కల్పించామని తెలిపారు.ఓటర్లు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన12 గుర్తింపు కార్డులలో ఏదో ఒక దాన్ని చూయించి ఓటు వేయవచ్చని చెప్పారు.ఇప్పటివరకు ఎన్నికలకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ కు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19 మంది పోటీలో ఉన్నారని చెప్పారు.నల్గొండ జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలు ఉండగా,అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని ఆమె వివరించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ నల్గొండ జిల్లా వ్యాప్తంగా 37పోలింగ్ కేంద్రాలు ఉండగా ,అందులో 5 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని,ఈ కేంద్రాల పై మరింత దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. 13 రూటులను ఏర్పాటు చేయడం జరిగిందని,ముఖ్యమైన పోలింగ్ లొకేషన్లో స్ట్రైకింగ్ ఫోర్స్ తో పాటు,స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు పెట్టడం జరిగిందని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యేలా ఏర్పాటు చేశామన్నారు. రూట్ మొబైల్ ఆర్మ్డ్ పార్టీలను నియమించామని, ఇతర జిల్లాల పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని,అలాగే ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద సెంట్రల్ పోలీస్ ఫోర్స్ తో పాటు,ఏఆర్ పోలీసులను ఏర్పాటు చేశామని,మొత్తం 618 మంది పోలీసుల సేవలను ఎమ్మెల్సీ ఎన్నికలలోవినియోగించుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. నల్గొండ అదనపు కలెక్టర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏ ఆర్ ఓ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,ఇన్చార్జి డిఆర్ఓ,నల్గొండ ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి,సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పోగొట్టుకున్న లగేజ్ ప్రయాణికులకు అందజేత



కాళేశ్వరం, ఫిబ్రవరి 26 (జనం సాక్షి) : శివరాత్రి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన క్యాంపులో ఒక ప్రయాణికురాలు బ్యాగు మరియు ట్యాబు భూపాలపల్లి డిపో బస్సు నంబర్ 0010 లో పోగొట్టుకున్నది. అట్టి పోగొట్టుకున్న బ్యాగును కండక్టర్ సిహెచ్ బాలు కాళేశ్వరం లో అప్పగించగా బస్టాండ్‌లో కండక్టరు మరియు కంట్రోలర్ కే. గంభీర్ రెడ్డి మరియు భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందు సమక్షంలో ప్రయాణికురాలికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రయాణికురాలు ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- భర్తకు బలమైన గాయాలు



మహదేవపూర్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : బుధవారం రోజున మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరం ముక్తేశ్వర స్వామివారిని దర్శించుకుని తిరిగి బైక్ పై భార్యా భర్త ఇద్దరు కలిసి స్కూటీ పై తిరిగి ఇంటికి వస్తుండగా అన్నారం క్రాస్ రోడ్ మూలమలుపు వద్దబైకు అదుపు తప్పిరోడ్డు ప్రమాదంలో భార్య శ్రీమర్తి భాగ్య అక్కడికక్కడే మృతి. డ్రైవింగ్ చేస్తున్న భర్త సమ్మయ్యకు బలమైన గాయాలైనవి. వివరాల్లోకి వెళ్లితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా జంగేడు గ్రామానికి చెందిన శ్రీ మర్తి సమ్మయ్య . భాగ్య.50 భార్య భర్త ఇద్దరు కలిసి స్కూటీ పై కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకుని తిరిగి బైకుపై వస్తుండగా అన్నారం ఎక్స్ రోడ్ మూలంపు వద్ద బైకు అదుపుతప్పి అతివేగముగా డ్రైవింగ్ చేస్తున్న సమ్మయ్య కు బలమైన గాయాలైనవి. వెనకాల కూర్చున్న తన భార్య భాగ్య . రోడ్డుపై పడడంతో తల వెనుకాల బలమైన గాయం అవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాలేశ్వరం వైపు వెళ్తున్న ప్రయాణికులు 108కు సమాచారం అందించగా మృతురాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త సమ్మయ్యకు హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. కాళేశ్వరం ఎస్సై తదుపరి చర్య నిమిత్తం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావును కలిసి ఆశీర్వాదం తీసుకున్న పడాల సతీష్ గౌడ్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమకారుడు పడాల సతీష్ గౌడ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తన గురువు అయిన మాజీ మంత్రి హరీష్ రావు కలిసి తన ఆశీర్వాదం తీసుకున్నారు. అంతేకాకుండా ఎర్రోళ్ల శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశారు.



# హెూరాహెూరీగా పట్టభద్రుల ఎన్నికలు

- నేడు ఓటు హక్కు వినియోగించుకోనున్న పట్టభద్రులు
- పట్టభద్రుల చేతిలో ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యం
- ఎవరీ లెక్కలు వారికే..!
- ప్రసన్న వర్సెస్ నరేందర్ రెడ్డి హెూరాహెూరి పోరు
- ప్రసన్న వైపే మొగ్గు అంటూ ప్రచారాలు
- పార్టీ నమ్మకంతో నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) : నేడు జరగనున్న ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ మెదక్ నిజామాబాద్ పట్టభద్రుల ఎన్నికలు హెూరా హెూరిగా జరగనున్నాయి. ముఖ్యంగా బీఎస్పీ బలపరిచిన అభ్యర్థి పులి ప్రసన్నకుమార్ తోపాటు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, బిజెపి బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ లు పోటీ పడుతున్నారు. వీరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి వర్సెస్ పులి ప్రసన్న హరికృష్ణ మధ్యనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు స్పష్టం అవుతుంది. అంతేకాకుండా బిజెపి అభ్యర్థి అంజి రెడ్డి కూడా గెలుస్తామని ధీమాలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సర్దార్ రవీందర్ సింగ్ కూడా మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించు కోబోతున్నారు. కాగా దాదాపు మూడు లక్షల చిల్లర ఓట్ల పట్ట బద్రులు ఎవరికి ఓటు వేస్తారనే ది ప్రశ్నార్థకంగా మారింది. ప్రసన్న హరికృష్ణతో పాటు నరేందర్ రెడ్డి మధ్యనే హెూరాహెూరీ పోటీ నెలకొన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. ప్రసన్న హరికృష్ణకు పట్టబద్రులు ఎక్కువ ముగ్గు చూపుతున్నారన్న ప్రచారం వైరల్ కావడంతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాత్రం గెలుపు పై ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నాయకుల మద్దతుతోపాటు తాను ఎన్నికలకు ముందు నమోదు చేయించిన సభ్యత్వం పై పూర్తి నమ్మకంతో నరేందర్ రెడ్డి ఉన్నట్లు స్పష్టం అవుతుంది. ఇకపోతే బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి ఈ పోటీలో తాను గెలుస్తానన్న ధీమా తో ముందుకు వెళ్తున్నారు. ఏది ఏమైనా నేడు జరగనున్న పట్టపద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్న పట్టభద్రుల చేతుల్లో ఉందన్న వాస్తవం. హెూరాహెూరి పోటీలో ప్రసన్న హరికృష్ణ వైపు పట్టభద్రులు నిలుస్తారా లేక నరేందర్ రెడ్డి అన్నది వేచి చూడాలి.







# హైదరాబాద్ కంపెనీ ఆఫర్.. 100 షేర్లుంటే రూ.8000 లాభం..



హైదరాబాద్‌కి చెందిన పవర్ సెక్టార్ కంపెనీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ కంపెనీలో షేర్లు ఉన్న వారికి బైబ్యాక్ పాలసీ ద్వారా 20 శాతం అదనంగా చెల్లించి కొనుగోలు చేస్తోంది. ప్రస్తుత రేటుతో పోలిస్తే 100 షేర్లకు రూ.8000 ఎక్కువ లాభం రానుంది. ఇందుకు సంబంధించిన రికార్డ్ తేదీని తాజాగా ప్రకటించింది. స్మాల్ క్యాప్ కేటగిరి పవర్ సెక్టార్ కంపెనీ నావా లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఇటీవల జరిగిన సమావేశంలో కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు షేర్ బై బ్యాక్ పాలసీకి ఆమోదం తెలిపినట్లు కంపెనీ వెల్లడించింది. టెండర్ ఆఫర్ ద్వారా రూ. 360 కోట్లు విలువైన సుమారు 72 లక్షల షేర్లు కొనుగోలు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ బై బ్యాక్‌కి అర్హులైన వాటాదారులను నిర్ణయించేందుకు రికార్డు తేదీని కంపెనీ తాజాగా ప్రకటించడం జరిగింది. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. రూ. 360 కోట్లతో రూ. 1 ఫేస్ వ్యాల్యూ గల 72 లక్షల ఈక్విటీ షేర్లను టెండర్ మార్గంలో వాటాదారుగా నుంచి తిరిగి కొనుగోలు చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఒక్కో షేరుకు రూ. 500 పెట్టి కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. అంటే ప్రస్తుతం ఉన్న కంపెనీ షేర్ ధరతో పోలిస్తే ఇది సుమారు 20 శాతం అధికంగా ఉండడం గమనార్హం. ఇక ఈ షేర్ బై బ్యాక్ అమలు కోసం కంపెనీ ఫిబ్రవరి 28, 2025ని రికార్డు తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించింది. అంటే ఆ రికార్డ్ తేదీ నాటికి షేర్లు కలిగి ఉండి బైబ్యాక్ పాలసీకి అంగీరిస్తే కంపెనీ ఒక్కో షేరుకు రూ.500 పెట్టి షేర్లను కొనుగోలు చేస్తుం ది. ఈ రోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో నావా లిమిటెడ్ షేరు 1.70 శాతం నష్టపోయి రూ. 416 వద్ద స్థిరపడింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 673.90 వద్ద ఉండగా కనిష్ఠ ధర రూ. 217.72 వద్ద ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 11 శాతం లాభాన్ని ఇవ్వగా, అలాగే గత నెల రోజుల్లో ఈ షేరు 5 శాతం నష్టపోయింది. అదే విధంగా గత ఆరు నెలల్లో ఈ షేరు సుమారు 11 శాతం నష్టాలు మిగిల్చింది. అదే గత ఏడాది కాలంలో 61 శాతం లాభాన్ని ఇచ్చింది.

# 70 నిమిషాల రూల్ ఆ టోల్ ప్లాజాలకు వర్తించదు..

ఫిబ్రవరి 17వ తేదీ నుంచి కొత్త ఫాస్టాగ్ రూల్స్ అమలులోకి వచ్చాయి. వాహనదారులకు 70 నిమిషాలు మాత్రమే సమయం ఉంటుందని, ఫాస్టాగ్ ఇనాక్టివ్‌గా ఉంటే డబుల్ ఛార్జీలు పడతాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ తెలిపింది. అయితే ఈ విషయంలో వాహనదారుల్లో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ క్లారిటీ ఇచ్చింది. ఆ టోల్ ప్లాజాలకు కొత్త రూల్స్ వర్తించవని భారీ ఊరట కల్పించింది.

వాహనదారులకు ఊరట కలిగించే వార్త చెప్పింది కేంద్రం. ఫాస్టాగ్‌కి సంబంధించి ఇటీవల నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన కొత్త రూల్స్‌పై క్లారిటీ ఇచ్చింది. ఫిబ్రవరి 17, 2025 నుంచి అమలులోకి వచ్చిన 70 నిమిషాల నిబంధనలు వాహనదారుల్లో గందరగోళానికి దారి తీసిన క్రమంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కీలక ప్రకటన చేసింది. జనవరి 28వ తేదీన ఎన్‌పీసీఐ జారీ చేసిన కొత్త మార్గదర్శకాలు జాతీయ రహదారులపై ఉండే టోల్ ప్లాజాలకు వర్తించవని స్పష్టం చేసింది. దీంతో వాహనదారులకు భారీ ఊరట లభించడంతో పాటు గందరగోళానికి తెరదించినట్లయింది.




టోల్ ప్లాజా రీడర్ వద్దకు చేరుకునే సమయానికి 60 నిమిషాల కంటే ఎక్కువ టైం వాహనం ఫాస్టాగ్ ఇనాక్టివ్‌లో ఉండడం, స్కాన్ చేసిన 10 నిమిషాల తర్వాత ఇనాక్టివ్‌లోకి వెళ్లిన సందర్భంగా సదరు ట్రాన్సాక్షన్‌ను తిరస్కరిస్తారంటూ ఎన్‌పీసీఐ కొత్త రూల్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫాస్టాగ్ ఇనాక్టివ్‌లో ఉండి ట్రాన్సాక్షన్ తిరస్కరణకు గురైన సందర్భంలో డబుల్ టోల్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ క్రమంలో వాహనదారుల్లో గందరగోళం నెల కొంది. అసలు ఈ రూల్ ఏంటో చాలా మందికి అర్థం కాలేదని చెప్పవచ్చు. అయితే వాహనం టోల్ ప్లాజా దాటినప్పుడు ఫాస్టాగ్ స్టేటస్ విషయంలో ఫాస్టాగ్ జారీ చేసిన బ్యాంక్, టోల్ పేమెంట్ అందుకున్న బ్యాంకుల మధ్య ఏర్పడుతున్న వివాదాల పరిష్కారం కోసం ఎన్‌పీసీఐ ఈ కొత్త రూల్స్ తీసుకొ చ్చినట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా తెలిపింది.

అన్ని జాతీయ రహదారులపై ఉండే టోల్ ప్లాజాలు ఇప్పటికే ఐసీడీ 2.5 ప్రోటోకాల్ పాటిస్తున్నాయని ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. దీని కింద ఫాస్టాగ్ కస్టమర్లు టోల్ ప్లాజాకు చేరుకునే ముందు ఎప్పుడైనా రీఛార్జ్ చేసుకునే వెసులుబాటు ఉందని, ఇక్కడ 70 నిమిషాల రూల్ వర్తించదని నొక్కి చెప్పింది. అయితే, ఈ కొత్త రూల్స్ రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్ ప్లాజాలకు వర్తిస్తాయని, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్ గేట్లు ప్రస్తుతం ఐసీడీ 2.4 ప్రోటోకాల్‌ను పాటిస్తున్నట్లు తెలిపింది. అయితే, వాటిని సైతం ఐసీడీ 2.5 ప్రోటో కాల్‌కి మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపింది. అయితే టోల్ ప్లాజాల వద్ద ఎలాంటి ఇబ్బందులు పడకుండా వాహనదారులు తమ ఫాస్టాగ్ వాలెట్‌ను ఆటో మేటిక్‌గా రీఛార్జి చేసుకునేలా యూపీఐ సహా సేవింగ్స్ అకౌంట్, కరెంట్ అకౌంట్‌తో లింక్ చేసుకోవాలని జాతీయ రహదారుల సంస్థ సూచించింది. రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వారికి 70 నిమిషాల రూల్ వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. ఇనాక్టివ్ ఫాస్టాగ్ ఉన్న వారు కచ్చితంగా చెక్ చేసుకుని యాక్టివ్ చేసుకోవాలి. లేదంటే డబుల్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది.

# ఉబర్ బుక్ చేస్తున్నారా? క్యాష్ పేమెంట్ మాత్రమే..

ఉబర్ ఆటోలు బుక్ చేస్తున్నారా? ఇకపై క్యాష్ పేమెంట్ మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు కొత్త నిబంధనలు, షరతులు మార్చింది ఉబర్ సంస్థ. నేరుగా ఆటో డ్రైవర్‌కే క్యాష్ పేమెంట్స్ చేయాలని తెలిపింది. నగరవాసులు కచ్చితంగా ఈ వివరాలు తెలుసుకోవాలి.

హైదరాబాద్ సహా ముఖ్యనగరాల్లో ఉబర్ ఆటో సేవలు వినియోగించుకుంటున్న కస్టమర్లకు బిగ్ అలర్ట్. క్యాబ్ అగ్రిగేటర్ ఉబర్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆటోలు బుక్ చేశాక నగదు రూపంలోనే నేరుగా ఆటో డ్రైవర్‌కే పేమెంట్లు చేయాలని పేర్కొంది. అంటే ఆటో డ్రైవర్, ప్రయాణికుడి మధ్య జరిగే ట్రాన్సాక్షన్ల విషయంలో ఉబర్ జోక్యం చేసుకోదు. ఈ మేరకు సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ విధానాన్ని అందిపుచ్చుకోవడంలో భాగంగానే ఉబర్ సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కొత్త విధానాన్ని ఫిబ్రవరి 18, 2025 నుంచే అమలులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. ఆటోల నుంచి ఇకపై ఎలాంటి కమీషన్ సైతం వసూలు చేయమని ఉబర్ సంస్థ తన బ్లాగ్ పోస్టులో పోర్కొంది.



ఉబర్ యాప్ ద్వారా ఇకపై మీరు ఆటో రిక్షా బుక్ చేసినప్పుడు మీకు సమీపంలో ఉన్న ఆటో డ్రైవర్లతో అనుసంధానం చేస్తుంది. బుక్ అయ్యాక పేమెంట్లు నేరుగా సదరు ఆటో డ్రైవర్‌కి నగదు రూపంలో చెల్లించాలి. లేదా డ్రైవర్ సూచించిన యూపీఐకి పేమెంట్లు చేయొచ్చు. ఉబర్ క్రెడిట్స్ సహా ఉబర్ సంబంధిత ఇతర ప్రమోషనల్ ఆఫర్లు ఈ రైడ్లకు వర్తించవని కస్టమర్లు గుర్తుంచుకోవాలి. అలాగే సదరు ట్రిప్?కి సంబంధించి ఆటో డ్రైవర్ల నుంచి ఎలాంటి కమీషన్ ఛార్జులు సైతం వసూలు చేయబోమని ఉబర్ తన బ్లోగ్ పోస్టులో తెలిపింది. క్యాన్సిలేషన్లకు సంబంధించి కూడా ఏ ఛార్జీలు విధించబోమని ఉబర్ పేర్కొంది.

రైడ్ బుకింగ్ సమయంలో ఉబర్ యాప్ కేవలం ధర మాత్రమే సూచిస్తుంది. అలాగని అదే ఫైనల్ రేటు కాదని గుర్తుంచుకోవాలి. ఆటో డ్రైవర్, ప్రయాణి కుల పరస్పర అవగాహనతో తుది మొత్తా న్ని నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. అంటే ఇకపై ఆటో డ్రైవర్లు పూర్తిగా స్వతంత్రంగా వ్యవహరిస్తారని ఉబర్ తెలిపింది. తమ సంస్థ కేవలం రైడర్లకు కనెక్ట్ చేసే ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లా మాత్రమే వ్యవహరి స్తుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఓలా, ర్యాపిడో కమీషన్ ఆధారంగా కాకుండా ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో సర్వీసులు అందించే సేవలు ప్రారంభించాయి. అంటే ట్రిప్‌కు కమీషన్ కాకుండా ప్లాట్ ఫామ్ వాడుకునేం దుకు డ్రైవర్లు కొంత చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ట్రిప్‌కి కమీషన్ అనేది ఉండదు. ఒక్కసారి చెల్లించి ఆటో ట్రైవర్లు రైడర్లతో కనెక్ట్ కావచ్చు. ఆపైన రైడ్‌కి ఎంతైనా ధర నిర్ణయించుకోవచ్చు.

# ఈసారి ఉద్యోగులు, పెన్షనర్లకు నిరాశే..



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి డియర్‌నెల్ అలవెన్స్ డియర్‌నెస్ రిలీఫ్ సమీక్ష ప్రకటన వచ్చే నెలలోనే ఉంటుంది. అయితే, డీఏ పెంపు అనేది జనవరి, 2025 నుంచే అమలులోకి వస్తుంది. డీఏ, డీఆర్‌పై సమీక్ష అనేది ప్రతి ఏడాది రెండు సార్లు (జనవరి, జులై)లో ఉంటుంది. ఇది ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రీయల్ వర్కర్స్ ప్రకారం ఉంటుంది. సీపీఐ అనేది ద్రవ్యోల్బణాన్ని సూచిస్తుంది. దీని ప్రకారమే డీఏ ఎంత పెంచాలనేది కేంద్రం నిర్ణయిస్తుంది. ఈసారి డీఏ పెంపు చాలా తక్కువగా ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డిసెంబర్ నెలకు సంబంధించిన కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (ద్రవ్యోల్బణం) గణాంకాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది. కాబట్టి జులై- డిసెంబర్ 2024కి సంబంధించిన పూర్తి డేటా అందుబాటులో ఉంది. దీని ప్రకారమే జనవరి 2025 డీఏ సమీక్ష ఉంటుంది. అయితే, లెబర్ బ్యూరో ప్రకారం డిసెంబర్ 2024లో కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ద్రవ్యోల్బణం 0.8 పాయింట్లు తగ్గి 143.7గా నమోదైంది. సీపీఐ ఐడబ్ల్యూ ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు 2 శాతంగా ఉండనుందని అంచనా. ఇది జనవరి 2025 నుంచి అమలు కానుంది. 7వ వేతన సంఘం ప్రకారం ఇప్పటికే డీఏ అనేది 54 శాతానికి చేరుకుంది. ఇప్పుడు మరో 2 శాతం పెంచినట్లయితే 56 శాతానికి చేరనుంది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈసారి డీఏ, డీఆర్ పెంపు 3 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. కానీ, కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ దిగివచ్చింది. దీంతో జనవరి- జూన్ 2025 కాలానికి గానూ డియర్‌నెస్ అలవెన్స్ 2 శాతంగా పెంచవచ్చని అంచనా వేస్తున్నారు. డీఏ, డీఆర్ అనేది గడిచిన 12 నెలల సీపీఐ-ఐడబ్ల్యూ గణాంకాల సగటు ఆధారంగా నిర్ణయిస్తారు. జులై 2024 నుంచి డీఏ అనేది 53.65 శాతంగా ఉంది. సీపీఐ అనేది పెరుగుతూ తగ్గుతూ వచ్చిన క్రమంలో డీఏ, డీఆర్ పర్సంటేజ్ క్రమంగా పెరిగింది. జనవరి 2025 తుది లెక్కల ప్రకారం డీఏ అనేది 55.98 శాతం ఉంటుందని 7వ వేతన సంగం ఫార్ములా ప్రకారం అంచనా వేస్తున్నారు. కేంద్ర కేబినెట్ ఉద్యోగులకు డీఏ పెంపుపై మార్చి 2025లో నిర్ణయం తీసుకోవచ్చు. గతంలోని ప్రకటనలు చూసుకుంటే జనవరి డీఏ పెంపుపై మార్చి మొదటి వారంలోనే కేంద్రం నిర్ణయం తీసుకుంటోంది.

## ఎన్నికల్లో ఓడిపోయుంటే నా జీవితం నాశనమయ్యేది

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకింగ్ కామెంట్లు చేశారు. దేశ నాయకులతో పాటు వివిధ దేశాల అధ్యక్షులను సైతం తన మాటలు, చేతలతో హడలెత్తించే ఆయన.. ఇటీవలే జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోతే తన పరిస్థితి ఎలా ఉండేదో చెప్పారు. తన జీవితం నాశనం అయ్యేదని.. కేసులు, న్యాయపరమైన చిక్కులతో తరచుగా తిరిగాల్సి వచ్చేదని అన్నారు. దాన్ని ఊహించుకోవడానికే తనకు చాలా ఇబ్బందిగా అనిపిస్తుందని వెల్లడించారు. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకింగ్ కామెంట్లు చేశారు. తమ దేశంతో పాటు ఇతర దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులను సైతం తన మాటలు, చేతలతో భయపెట్టే ఈయన.. ఎన్నికల్లో ఓడిపోతే తన పరిస్థితో ఎలా ఉండేందో వివరించారు. గత ఎన్నికల్లో ఓడిపోయినందుకే.. గత సర్కారు తనకు చుక్కలు చూపించిందని చెప్పారు. ఇప్పుడు ఓడిపోయి ఉంటే మాత్రం తన జీవితం నాశనం అయ్యేదని.. తరచుగూ కోర్టులు, కేసులంటూ తిరగాల్సి వచ్చేదన్నారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే రెండోసారి అధ్యక్షుడిగా అమెరికా అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచే ట్రంప్ చాలా దూకుడుగా



వ్యవహరిస్తున్నారు. అక్రమంగా తమ దేశంలోకి వలస వచ్చిన విదేశీయులను ప్రత్యేక సైనిక విమానాల ద్వారా వారి స్వస్థలాలకు పంపిస్తున్నారు. దీనిపై ఎంత వ్యతిరేకత వస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతున్నారు.

అంతేకాకుండా అనేక మందిని ఉద్యోగాల నుంచి తొలగించి.. పాలన కొనసాగిస్తున్నారు. ఓవైపు పనామా కాలువను చేజిక్కుంచుకోవాలని, గ్రీన్‌లాండ్ దీవిని కొనుగోలు చేయాలని, కెనడాను అమెరికా 51 రాష్ట్రంగా మార్చాలని ఉందంటూ వివరించారు. ఇలా ఇంత మంది కోపానికి కారణం అవుతూనే, అనేక మందిని భయభ్రాం తులకు గురి చేస్తున్న ట్రంప్ తాజాగా షాకింగ్ కామెంట్లు చేశారు. ఎవరికీ భయపడని ఆయన ఎన్నికల్లో ఓడిపోతే తన జీవితం దుర్భరంగా మారి ఉండేదని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయి ఉంటే తన పరిస్థితి చాలా ఘోరంగా ఉండేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. గత సర్కారు తనతో చాలా దారుణంగా వ్యవహరించిందని మియామీలో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొని ఆరోపించారు. అంతేకాకుండా న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కుంటూ జీవితం గడిపే పరిస్థితి వచ్చుండేదన్నారు. అలాగే ఈ ఎన్నికల్లో ఓడిపోతే.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా ఆలోచించే వాడినని చెప్పారు. ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో అంతా షాక్ అవుతున్నారు. ఎంతో ధైర్యంగా ఉండే ఈయన కూడా భయపడతారా అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# పోలింగ్ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలి

**కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష**

**ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి,ఫిబ్రవరి 26(జనంసాక్షి)**

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష సూచించారు.బుధవారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష పరిశీలించారు .డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన సామాగ్రి సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల




నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందజేసే కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగిందని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 36 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.జిల్లాలో దాదాపు 31 వేల పట్టభద్ర ఓటర్లు, 1100 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని అన్నారు. సజావుగా పోలింగ్ జరిగేందుకు సహాయ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసామని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని నియమించామని అన్నారు .ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని అన్నారు. ఎండలు దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రజలకు అవసరమైన చల్లని నీరు, క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని అన్నారు. జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు.గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఓటర్లందరూ తప్పనిసరిగా ఫిబ్రవరి 27న జరిగే పోలింగ్ లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి.వేణు, రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య,సురేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి జిల్లా రవాణా అధికారి రంగారావు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పని లేని వారంతా దోమలు పట్టి డబ్బులు సంపాదించొచ్చు..

ఏ పనీ చేయకుండా ఇంట్లో కూర్చునే వాళ్లను ఎగతాళి చేసేందుకు.. ఇంట్లో కూర్చుని ఈగలు కొడుతున్నావా అంటుంటారు. కానీ ఇలా చేస్తే కూడా డబ్బులు వస్తాయంటోంది ఫిలిప్పీన్ దేశం. అయితే ఈగలకు బదులుగా దోమలు. వాటిని చంపినా, బతికుండగానే పట్టుకొచ్చిన డబ్బులు ఇస్తామని ప్రకటించింది. ముఖ్యంగా ఐదు దోమలు పట్టిస్తే రూ.1.50 (రూపాయిన్నర) ఇవ్వబోతున్నట్లు వివరించింది. దీంతో చిన్న పిల్లల నుంచి పండు ముసలి వాళ్ల వరకు దీన్ని ఉపయోగించుకోవాలని దోమల వేట సాగిస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

ఎలాంటి పనీ పాట లేకుండా ఇంట్లో ఉత్తిగా తిని కూర్చునే వాళ్లను తిట్టేందుకు.. ఏంట్రా ఇంట్లో కూర్చుని ఈగలు ఊపుతున్నావా అంటూ అంటుంటాం. కానీ ఇలా చేయడం కూడా ఓ పనేనని, అందుకు డబ్బులు కూడా వస్తాయని చెబుతోంది ఓ దేశం. అయితే ఇక్కడ ఈగలకు బదులుగా దోమలు పట్టాలని, అలా చేస్తే డబ్బులు కూడా చెల్లిస్తామంటోంది. చనిపోయిన లేదా బతికున్న ఐదు దోమలను పట్టిస్తే.. రూపాయిన్నర (రూ.1.50) ఇస్తామని వివరిస్తోంది. మరి ఇలాంటి బంపరాఫర్ ప్రకటించిన దేశం ఏది, ఇందులు ఇలాంటి నిర్ణయం తీసుకుందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా నగరానికి సమీపంలో ఉన్న అడిషన్ హిల్స్ పట్టణ గ్రామంలో లక్షకు పైగా జనాభా నివాసం ఉంటోంది. ఈ మధ్య కాలంలో అక్కడ దోమలు ఎక్కువ అయ్యాయట. ఈక్రమంలోనే అనేక మందికి డెంగీ, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయట. వీటన్నిటికి దోమలే కారణం కాగా.. ఇటీవలే ఇద్దరు వ్యక్తులు చనిపోయారు. అంతేకాకుండా ఫిబ్రవరి 1వ తేదీ వరకే 28 వేల 234 మంది డెంగీ బారిన పడ్డారు. దీంతో ఈ గ్రామస్థులు అంతా తెగ ఆందోళన చెందుతున్నారు.

కేసులు అంతకంతంకూ పెరగడం, మరణాలు కూడా మొదలు కావడంతో గ్రామ నాయకుడు ఓ అద్భుతమైన ప్లాన్ వేశాడు. తమ గ్రామంలోంచి దోమలను తరిమేసేందుకు ఓ వినూత్నమైన ప్రయోగం చేపట్టారు. ముఖ్యంగా గ్రామంలోని ప్రజలందరికీ.. బంపరాఫర్ ఇస్తూ దోమలు పట్టి తెచ్చిన వాళ్లకు డబ్బులు ఇస్తామని ప్రకటించారు. అయితే అవి బతికి ఉన్నా, చనిపోయినా ఫర్వాలేదని.. ఐదు దోమలకు గాను ఒక ఫిలిప్పీన్ పెసో (భారత కరెన్సీలో రూపాయిన్నర అంటే రూ.1.50) ఇస్తామని చెప్పారు.

దీంతో గ్రామస్థులతో పాటు ఇతర దేశాలు సైతం షాక్ అవుతున్నాయి. ఇదెక్కడి ఆఫర్ సామీ ఇంటూ పలువురు నెటిజెన్లు కామెంట్లు కూడా చేస్తున్నారు. కానీ ఆ గ్రామస్థులు మాత్రం ఎంచక్కా ఇంట్లోనే కూర్చుని దోమలు పట్టుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. చిన్న పిల్లల నుంచి పండు ముసలి వాళ్ల వరకు దోమలను చంపడమే లక్ష్యంగా



పెట్టుకుని.. ఇంటితో పాటు ఆవరణ, మురుగు కాలువలు, రోడ్లపై తిరుగుతున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధిన వార్త నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈక్రమంలోనే పలువురు మా గ్రామం కూడా ఇలాంటి ఆఫరిస్తే.. వేలు సంపాదించేవాడిని నేనంటూ ఓ నెటిజెన్ చెప్పుకొచ్చాడు. దోమల బ్యాట్‌తోనే క్రికెట్ ఆడుతూ.. పాకెట్ మనీ సంపాదించుకునేవారిమంటూ మరికొంత మంది తమ మనసులోని భావాలను కామెంట్ల రూపంలో వెల్లడిస్తున్నారు. మరి ఈ ఆఫర్ వింటే మీకేమనిపిస్తుందో కామెంట్ల రూపంలో చెప్పేయండి.

# మార్చి 9 నుండి వెంకటేశ్వర ఆలయ వార్షికోత్సం

**39వ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రం విడుదల చేసిన జిఎం వెంకటయ్య**

**యైటింక్లయిన్ కాలనీ ఫిబ్రవరి 26 (జనంసాక్షి):**



మార్చి 9వ తేదీ నుండి 14వ తేది వరకు జరుగనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 39వ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఏరియా జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య విడుదల చేశారు. బుధవారం ఆయన చాంబర్‌లో అధికారులతో కలిసి కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈ వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమాలకు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉద్యోగులపై నిండుగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే సింగరేణి సంస్థ మంచి ఉత్పత్తి ఉత్పాదకత సాధించి ఉద్యోగులు సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకోవడం జరిగిందన్నారు. మొదటి రోజు నుండి అభిషేకం, వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమము, ప్రతిరోజూ సహస్ర నామార్చన, సేవా కాలం, ద్వాజారోహణం, శ్రీవెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం, స్థాళీ పాకము, సుధర్శన హోమము, వసంతోత్సవం, సదస్యం, భేరి పూజా, డోలోత్సవము, గరుడ సేవ, పుత్రకామేస్టీ, రతోత్సవము, సహస్ర దీపాలంకరణ, పూర్ణహుతి, పుష్కరిణిలో చక్రస్నానం, అవభృతము , అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వేద పండితులు జగన్నాథ ఆచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమములో ఎస్ఓటుజీఎం ఏం.రాముడు, డీజిఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డీజిఎం సివిల్ ధనుంజయ, డిజిఎం (ఐఇడీ) మురళీకృష్ణ, డిజిఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, జెఇ సివిల్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ సామాగ్రిని సరిగా చూసుకోండి..

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.

ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి)



వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం సందర్శించారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీఓ, ఏపీఓ, ఓపీఓ లతో కూడిన బృందాలన్నీ హాజరయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్సి సెంటర్ లో ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చిన ఏపీవో, పిఓ, ఓపిఓ, మైక్రో అబ్జర్వర్లు, అధికారులు పోలింగ్ లో ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. కాగా, జిల్లాలో 09 పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో పీఓ, ఏపీఓ, ఇద్దరు ఓపీఓలను నియమించామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రుతు పరిశుభ్రత ప్రోత్సాహానికి చర్యలు

## గిరిజన జిల్లాల్లోని 27 ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి)



జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లెర్నింగ్ కర్వ్ ఫౌండేషన్ సహకారంతో తెలంగాణలో ఋతు పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు విశేషమైన చర్య తీసుకుంది. పెద్దపల్లి, యాదాద్రి, వరంగల్ గ్రామీణ, గిరిజన జిల్లాల్లోని 27 ప్రభుత్వ పాఠశాలల్లో 8,100 మంది విద్యార్థినులకు ప్రయోజనం కల్పించే ఈ కార్యక్రమాన్ని యాదాద్రి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, భువనగిరిలో ప్రారంభించారు. 'ప్రాజెక్ట్ డిగ్నిటీ' లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం, తక్కువ ఆదాయ నేపథ్యం గల విద్యార్థినులలో ఋతు ఆరోగ్య నిర్వహణను మెరుగుపరచడానికి సమగ్ర మద్దతును అందించడంపై దృష్టి సారించింది. ఇందులో పారిశుద్ధ్య మౌలిక సదుపాయాల ఏర్పాటు, పరిశుభ్రత సామగ్రి పంపిణీ, అవగాహన కార్యక్రమాలు మరియు ఆరోగ్య శిక్షణలు అందించబడతాయి. ఈ ప్రాజెక్ట్, తెలంగాణ జిల్లా విద్యాధికారి, బాలికల అభివృద్ధి అధికారి సహకారంతో ఈ ప్రాజెక్ట్ అమలు చేయబడుతోంది. జయశ్రీ బాలకృష్ణ, జనరల్ మేనేజర్, జీఐసీ రీ మాట్లాడుతూ.. "సరైన ఋతు పరిశుభ్రత నిర్వహణ యువతుల విద్య, సమగ్ర శ్రేయస్సుకు కీలకం. జీఐసీ రీలో, మేము కమ్యూనిటీలపై శాశ్వత ప్రభావాన్ని చూపే కార్యక్రమాలను మద్దతు ఇవ్వడానికి నిబద్ధంగా ఉన్నాము. అవసరమైన పరిశుభ్రత ఉత్పత్తులు, అవగాహన కార్యక్రమాలను అందించడం ద్వారా, వనరుల కొరత కారణంగా ఏ విద్యార్థినికి కూడా విద్యలో అంతరాయం కలగకుండా చూడడమే మా లక్ష్యం. ఈ అర్థవంతమైన మార్పును ముందుకు తీసుకెళ్లేందుకు లెర్నింగ్ కర్వ్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేయడం మాకు గర్వంగా ఉంది." ఋతు పరిశుభ్రత ఉత్పత్తులకు ప్రాప్యతను నిర్ధారించడం ద్వారా, ఈ కార్యక్రమం సమాన విద్యా అవకాశాలను ప్రోత్సహించడంతో పాటు, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. స్వచ్ఛమైన మరియు పర్యావరణ అనుకూలంగా ఉండేలా పారవేయడం కోసం సరైన వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా మంచి పారిశుద్ధ్య పద్ధతులను ప్రోత్సహిస్తుందని అని అన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకోవాలి

## జిల్లాలో 22,397 మంది గ్రాడ్యుయేట్లు.950 మంది టీచర్లు

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి)



కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల, టీచర్ల స్థానాలకు నేడు ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధమవుతుంది. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి అయింది. గ్రాడ్యుయేట్ అభ్యర్థులు 56, టీచర్ అభ్యర్థులు 15, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, నామినేషన్ స్వీకరించారు. జిల్లాలో 22,397 మంది గ్రాడ్యుయేట్లు.. 950 మంది టీచర్ ఓటర్లు ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన తరువాత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు 56 కాగా, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీల్లో ఉన్న అభ్యర్థులు 15 మంది బరిలో ఉన్నారు. జిల్లాలో పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్స్ కలిపి మొత్తం 185 మందిని కేటాయించారు. జిల్లా పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలతో పాటు బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో కలిపి మొత్తం 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 28, టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు 13 కేంద్రాలు గుర్తించారు. జంబో పోలింగ్ బాక్స్ లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాల మేరకు వేములవాడ ఆర్డీవో, సిరిసిల్ల ఇన్ ఛార్జ్ ఆర్డీవోలు రాజేశ్వర్, రాధాభాయి ఐదు రూట్లు, ఐదు జోన్లుగా విభజించి ఐదుగురు సెక్టార్ల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం జంబో పోలింగ్ బాక్స్ లు, టీచర్ల ఎన్నిక కోసం రెగ్యులర్ పోలింగ్ బాక్స్ లు వినియోగిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్లు సంబంధిత పత్రాలు వెంట తీసుకొని వెళ్లి తప్పకుండా తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని, పోలింగ్ అధికారులు సూచించిన విధంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని 41 ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయన వెంట సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

# ఎన్నడూ లేని విధంగా 15,260 టన్నుల బొగ్గు రవాణా

భూపాలపల్లి, ఫిబ్రవరి 26 (జనం సాక్షి):



భూపాలపల్లి ఏరియా మంగళవారం నాడు జిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధికంగా 15,260 టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందని అన్నారు. దీని సహకరించిన ప్రతి ఉద్యోగికి ధన్యవాదాలు తెలియజేస్తూ ముందు ముందు కూడా ఇదే విధంగా సహకారం ఉండాలని కోరారు. ఇదే స్ఫూర్తి తో సమస్త లక్ష్యాలను రక్షణతో కూడిన రవాణా ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జిఎం కవింద్ర , జ్యోతి ఐ ఈ డి, కావూరు మారుతి అధికార ప్రతినిధి, అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో పటిష్ట బందోబస్తు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26 (జనం సాక్షి)



ఏం.ఎల్.సి. ఎన్నికలు సజావుగా ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ నెల 27 న జరుగనున్న మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజక వర్గాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. 8 రూట్లలో 54 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు నిర్వహణకు 48 మంది ప్రెసిడింగ్ అధికారులు, 48 మంది సహాయ ప్రెసైడింగ్ అధికారులు, 116 మంది ఒపిఒ లను, 52 మంది మైక్రో పరిశీలకులను నియమించడం జరిగిందని తెలిపారు. ఏం.ఎల్.సి.పట్టభద్రుల నియోజక వర్గానికి 29 పోలింగ్ కేంద్రాల్లో 16410 మంది ఓటర్లు ఉండగా ఇందులో 11616 మంది పురుషులు, 4793 మంది మహిళలు, ఒక థర్డ్ జెండర్, ఉపాధ్యాయ నియోజక వర్గంలో 25 పోలింగ్ కేంద్రాల్లో 2011 మంది ఓటర్లు కాగా, ఇందులో 1307 మంది పురుషులు, 704 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అందించిన పోలింగ్ మెటీరియల్ ను పరిశీలించుకోవాలని, బ్యాలెట్ పత్రాలు, మెటీరియల్, బ్యాలెట్ బాక్స్ , తదితర సామాగ్రి లను భద్రంగా పోలింగ్ కేంద్రాలకు తీసుకొన్ని వెళ్లాలని తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని, ప్రతీ రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని తెలియపరచాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ ప్రభాకర్, సీపీఓ రాజారాం, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడకు కేసిఆర్ హయాంలో 250 కోట్లు ఖర్చు చేశాం

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి)



**సిరిసిల్ల చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి**

**సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై వేధింపులు ఆపాలి**

**వేములవాడలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

ప్రముఖ శైవ క్షేత్రమైన వేములవాడలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో మొదలైన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన అభివృద్ధి కొనసాగాలని అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... .తెలంగాణ కు కొంగుబంగారం లాంటి రాజరాజేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం కేసీఆర్ రూ. 250 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. అయితే, ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి ఆగవద్దని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో గుడి చెరువు వద్ద 30 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆలయానికి అందించిందని, ప్రస్తుతం అక్కడ అభివృద్ధి జరగడం లేదని స్థానికులు చెబుతున్నారని, కాబట్టి అక్కడ అభివృద్ధి పనులను కొనసాగించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అంటేనే చేనేత జిల్లాగా పేరు పొందిందని, చేనేత కార్మికుల కోసం నాడు మంత్రిగా కేటీఆర్ గారు అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడం లేదని, తద్వారా సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, అన్ని నియోజకవర్గాలను ప్రభుత్వం సమానంగా చూడాలని సూచన చేశారు. సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ వేధింపులు ఎక్కువయ్యాయని, కేటీఆర్ గారి ఫోటో పెట్టుకున్నందుకు టీ స్టాల్ ను తీసేయించిన దుర్మార్గపు ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఇంత భేదభావం అక్కరలేదని, తక్షణమే ఇట్లాంటి కక్షపూరిత వ్యవహారాలను విరమించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

# జాతరలో పోలీసుల అత్యుత్సాహం..

## ఎంపీడీవోను అడ్డుకున్న పోలీసులు

పాలకుర్తి, ఫిబ్రవరి 26 (జనంసాక్షి)



శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం లో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విధులు నిర్వహిస్తున్న పాలకుర్తి ఎంపీడీవో ఆవుల రాములును గుట్టపైకి వెళ్లకుండా పోలీసు కానిస్టేబుల్ అడ్డుకున్నారు. దీంతో ఎంపీడీవోకు పరాభవం ఎదురయింది, జాతర వీధుల్లో భాగంగా ఎంఈడీవో రాములు పంచాయతీ కార్యదర్శులుతో కలిసి దేవస్థానంలో విదులు నిర్వహించేందుకు అటుగా వెళుతుండగా తహసీల్దార్ కార్యాలయం వెనుక విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. తాను ఎంపీడీవోను అని, నా పేరు రాములు అని చెప్పినప్పటికి మీరెవరైతే నాకేంటి అని ఖరాఖండిగా అర్థగంటపాటు ఎండలోనే నిల్చోబెట్టాడు. దీంతో విధుల్లో ఉన్న ఎంపీడీవో రాములును పోలీసు కానిస్టేబుల్ అడ్డుకోవడంతో ఆందోళన చెందారు. ఎంపీడీవోను అడ్డుకున్న విషయం పలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇదిలా ఉండగా, పోలీస్ డిపార్ట్మెంట్ కు చెందిన ఓ అధికారి వాహనం మాత్రం తమ కుటుంబ సభ్యులతో జాతరలో నిబంధనలకు విరుద్ధంగా మహమండపం వద్దకు చేరడంతో దైవ దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. అయితే పోలీసుల తీరుపై ఎంపీడీవోకు ఒక న్యాయం, సామాన్య ప్రజలకు ఒక న్యాయం, పోలీసులకు ఒక న్యాయం అంటూ భక్తులు విమర్శలు గుప్పించారు.

# 9వ తరగతి విద్యార్థినిపై వృద్ధుడు లైంగిక దాడి

హైదరాబాద్ (జనంసాక్షి)

ఓ మైనర్ బాలికను మభ్యపెట్టి వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బుధవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నారాయణగూడ, కాచిగూడ చౌరస్తాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే 60 ఏళ్ల వృద్ధుడు, అతని ఇంటి సమీపంలో ఉన్న 9వ తరగతి చదివే బాలిక(14)పై కన్నేశాడు. ఆ బాలికకు మాయమాటలు చెప్పి అపార్ట్‌మెంట్‌లోకి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక భయాందోళనలతో ఉండటాన్ని కుటుంబ సభ్యులు గమనించి ఆరా తీయగా జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికపై లైంగికదాడికి పాల్పడిన వృద్ధుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను భరోసా సెంటర్‌కు పంపించి, స్టేట్‌మెంట్ ను రికార్డు చేయించారు. ఈ కేసులో రాజీ ప్రయత్నాలు సాగుతున్న ట్లు సమాచారం. ఈ కేసును ఎస్సై నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

# గెలుపు చేరువలో యాదగిరి శేఖర్ రావు

కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :



పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రచారంలో ముందు ఉంటూ తనకి జరిగిన యాక్సిడెంట్ ను కూడా లెక్కచేయకుండా సమాజ శ్రేయస్సుకై ప్రతి ఒక్కరిని కలుసుకుంటూ సమాజం పట్ల పట్టభద్రుల పట్ల, వారి సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా , వారి సమస్యల పై పోరాడే వ్యక్తిగా ఆదరణ పొందుతున్నారు. మేజర్ యాక్సిడెంట్ అయిన ఆ దేవుని ఆశీర్వాదం , పట్టభద్రులకు సేవ చేయాలని మంచి ఉద్దేశంతో వీల్ చైర్ లో ఉండి కూడా పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. బిజినెస్ మ్యాన్ కు , సర్వీస్ మ్యానుకు జరుగుతున్న ఈ ఎలక్షన్లో విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. పట్టబద్రులు తన వెంటే ఉన్నారని అన్నారని తను గెలిచిన తర్వాత వచ్చే 72 నెలల జీతం మొత్తాన్ని పట్టభద్రుల అభివృద్ధికై రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా పట్టభద్రుల అభివృద్ధికి ఖర్చు చేస్తానని ప్రకటించిన ఒకే ఒక వ్యక్తి పట్టబద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు.

# ఉపాధ్యాయులు నిజాయితీతో ఆలోచించి ఓటేయండి

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్తి అశోక్ కుమార్

## ఉపాధ్యాయ సంఘాల నేతలు

పెద్దపల్లి,ఫిబ్రవరి 26(జనంసాక్షి)




ఉమ్మడి కరీంనగర్,మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ నియోజక వర్గం నుండి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న టీపీటీఎఫ్ అభ్యర్థి యెర్రగుంట అశోక్ కుమార్ కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించుకుందామని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెరడేషన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, బహుజన టీచర్స్ ఫెరడేషన్ రాష్ట్ర అద్యక్షుడు కొమ్ము రమేష్,యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి లక్ష్మన్ కోరారు.పీటీఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్ కు మద్దతుగా పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి మాట్లాడుతూ వై.అశోక్ కుమార్ 36 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ టీపీటీఎఫ్ లో మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి నాయకులుగా ఉపాధ్యాయ విద్యారంగ సంక్షేమం కొరకు నిరంతరం ఉద్యమాలు చేశారన్నారు.విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన నాయకులుగా పేరు ప్రఖ్యాతలు గడించారని అన్నారు.నిజాయితీకి ,నిబద్ధతకు, నిస్వార్థతకు మారు పేరుగా నిలిచిన అశోక్ కుమార్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా సరైన అభ్యర్థి అన్నారు.ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో అశోక్ కుమార్ ని మొదటి ప్రాధాన్యతా ఓట్లతో గెలిపించాలని కోరారు.బహుజన టీచర్స్ ఫెరడేషన్ రాష్ట్ర అద్యక్షుడు కొమ్ము రమేష్ మాట్లాడుతూ 36 ఏండ్లు విద్యారంగ,ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమాలు చేసిన,ఉపాధ్యాయుల సమస్యలు తెలిసిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్‌కు ఓటు వేసి గెలిపించుకోవలసిన అవసరం ఉపధ్యాయులపై ఉందన్నారు .ఉద్యమ కారునికే ఉపాధ్యాయ సమస్యలు తెలుస్తాయని, నిజాయితీగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న అశోక్ కుమార్ పై.రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థల యజమానులు ధన బలంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని చూస్తున్నారని,ధన రాజకీయాలను ఓడించాలన్నారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న టీపీటీఎఫ్ అభ్యర్థి యెర్రగుంట అశోక్ కుమార్ కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు.యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాంపెల్లి లక్ష్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి అశోక్ కుమార్ గెలుపుకు సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులు ఓటేయాలని కోరారు.కార్పొరేట్ సంస్థలకు చెందిన వ్యక్తులు గెలిస్తే ప్రభుత్వ విధ్య నిర్వీర్యం చేస్తారని,ప్రభుత్వ పాఠశాలలో పని చేసే గెజిటెడ్ హెచ్ఎం,నిరంతర పోరాట నాయకులు అశోక్ కుమార్ అభ్యర్థిత్వాన్ని బలపరచి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు.టీపీటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యెర్రగుంట అశోక్ కుమార్ మాట్లాడుతూ 317 జీఓ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని,కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం ఇప్పిస్తానని తెలిపారు.వారికి కనీస వేతన అమలు చేయిస్తామని,పెండింగ్‌లో ఉన్న నాలుగు వేల కోట్ల బకాయిలు,పదవీ విరమణ పొందిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్,మంచి ఫిట్మెంట్‌తో పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు.గురుకుల పాఠశాల టైంటేబుల్ మార్పిడి చేయిస్తామని ,ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేసి ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 57 ప్రకారం నెలవారీ ప్రమోషన్, అర్హత ఉన్న టీచర్లకు జేఎల్,ఎంఈఓ,డిప్యూటీ డీఈఓ,డైట్ లెక్చరర్ల ప్రమోషన్ ఇప్పిస్తామన్నారు.మోడల్ స్కూల్ టీచర్లకు 010 కింద వేతనాలు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో నిరంతరం పోరాడుతానని తెలిపారు.27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సిహెచ్ పోచయ్య,పర్శరాములు గౌడ్,పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు జీవన్ రాజు, సీనియర్ ఉపాద్యాయులు కోల రాజమల్లు,విశ్రాంత ఎంఈఓ డానియల్,సీనియర్ విశ్రాంత ఉపాద్యాయులు దేవదానం,సీనియర్ విశ్రాంత హెచ్ఎం నేదునూరి కనకయ్య,తదితరులు పాల్గొన్నారు.

# రామప్పలో భక్తుల తోపులాట....

**మహాశివరాత్రి రోజు వేలాదిగా తరలివచ్చిన భక్తులు.....**

**పోలీసుల వైఫల్యంతో భక్తుల ఆగమాగం....**

**ములుగు/వెంకటాపూర్, ఫిబ్రవరి26(జనం సాక్షి):**



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రామప్ప దేవాలయానికి బుధవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరగడంతో ఆలయంలో తోపులాడుకోవాల్సి వచ్చింది. చాలామంది భక్తులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. చిన్న పిల్లలు,వృద్దులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మహాశివరాత్రి రోజు 60 వేలకు పైగా భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు,భక్తులను అదుపు చేసేందుకు తగ్గట్లుగా పోలీసు సిబ్బందిని ఎందుకు ఏర్పాటు చేయలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న దేవాదాయ శాఖ సిబ్బంది భక్తులను అదుపు చేసేందుకు ప్రయత్నించిన వారి ప్రయత్నం విఫలమైంది. ఇద్దరు,ముగ్గురు మహిళా పోలీసులు కనిపించిన భక్తులను అదుపు చేయలేక పోయారు. పై అధికారులకు ఫోన్ లో పదేపదే

సమాచారం ఇచ్చినా పట్టించుకున్నట్లు కనిపించలేదు. దీంతో రామప్ప దేవాలయంలో కిటకిటలాడుతున్న భక్తులు ఆగమాగం అయ్యారు. మహాశివరాత్రి కి ముందు ఏర్పాట్లు ఘనంగా చేస్తామని చెప్పుకున్న అధికారులు సమయానికి చేతులెత్తేయడంతో భక్తులు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా రామప్ప దేవాలయం లో దర్శనాలు తోపులాటలు లేకుండా, ప్రశాంతంగా దైవదర్శనం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుకుంటున్నారు.

# భారీగా పట్టుబడ్డ అక్రమ మద్యం



**ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ ను ఉల్లంఘించి జోరుగా నడుస్తున్న బెల్ట్ షాపులు**

**చింతలమానేపల్లి ఫిబ్రవరి 26 (జనం సాక్షి)**

మండల పరిధిలోని గూడెం గ్రామంలో అక్రమంగా పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన మద్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసస్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డీఎస్పీ రామునుజన్ దీనికి సంబంధించి వివరాలు వెల్లడించారు. గూడెం గ్రామంలో బెల్ట్ షాప్ లలో పల్లు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఎన్నికల కోసం పెద్ద ఎత్తున మద్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసులు దాడు లు నిర్వహించారని పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రామగిరి శంకర్ వద్ద 98,400 / ,2) కస్తూరి ఆకాష్ వద్ద 19,200,3) సంతోష్ జై స్వాల్ వద్ద 9,130, రూపాయల మధ్య స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు మొత్తం గ్రామంలో 21,50,890 రూపాయల విలువ గల మద్యం స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు.. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండగా ఆక్రమ లాభార్జన కొరకు మద్యం అమ్మిన వ్యక్తులు మరియు మద్యం షాప్ ఓనర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఎలక్షన్ నిబంధనలను అతిక్రమించి ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడును. అని అన్నారు. ఈ సమావేశంలో సీఐ ముత్యం రమేష్ ,చింతల మానేపల్లి ఎస్సై నరేష్ ,కౌటాల ఎస్సై మధుకర్, బెజ్జూర్ ఎస్ఐ ప్రవీణ్ ఉన్నారు.

# వ్యవసాయ కళాశాలలో విద్యార్థిని సూసైడ్

**వరంగల్ (జనంసాక్షి)**

వరంగల్ నగరంలో మహా శివరాత్రి పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. ములుగు రోడ్డులోని పైడిపల్లి వద్ద ఉన్న వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చరల్ బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్న రేష్మిత (20) ఆత్మహత్య చేసుకుంది. రేష్మిత ఉదయం నుంచి రూములో నుండి బయటకు రాకపోవడంతో కాలేజి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చింది. రేష్మిత ఉంటున్న గది వెంటిలేటర్ నుండి పరిశీలించిన పోలీసులు.. ఆమె ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. నల్లగొండ జిల్లాలో ఉంటున్న రేష్మిత కుటుంబ సభ్యులకు పోలీసులు, కాలేజీ సిబ్బంది సమాచారం ఇచ్చారు. తాము వచ్చే వరకు గది తలుపులు తెరవద్దని పోలీసులను కుటుంబ సభ్యులు కోరారు. కుటుంబ సభ్యుల సూచన సూచన మేరకు పోలీసులు గది తలుపులు తెరవలేదు. ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్యకు వ్యక్తిగత కారణమని తెలుస్తుంది. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా ఈ వ్యవసాయ కళాశాల నిర్వహిస్తున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

**జిల్లా ఎస్పీ గౌష్ ఆలం.**

**400 మంది పోలీసు సిబ్బందితో జిల్లా వ్యాప్తంగా బందోబస్తు.**

**అదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):**



నేడు జరగబోయే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 400 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుదవారం జిల్లా కేంద్రంలోని స్థానిక టీటీడీసీ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఏర్పాట్లను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం స్వయంగా పరిశీలించి అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేయడం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 పోలింగ్ లోకేషన్లు 39 పోలింగ్ స్టేషన్లో ప్రత్యేకంగా 8 రూట్లలో ఏర్పాటుచేసిన మొబైల్ రూట్ పార్టీలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాట్స్, క్యూఆర్టి స్ట్రైకింగ్ ఫోర్స్, ఇద్దరు డీఎస్పీ ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ లను మరియు ప్రత్యేకంగా జిల్లావ్యాప్తంగా నిఘా బృందాలను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి అయ్యే విధంగా బందోబస్తు ప్రక్రియను పూర్తి చేసినట్లు సిబ్బందికి విధులను కేటాయించినట్లు తెలియజేశారు. ముఖ్యంగా రేపు జరగబోయే పోలింగ్ నందు ఉపాధ్యాయ మరియు విద్యావంతుల ఎన్నికలలో దాదాపు 16,147 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనునట్లు తెలిపారు. ఎన్నిక సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ (సెక్షన్ 144) అమలులో ఉంటుందని 100 మీటర్ల 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన గొడవలు సృష్టించడానికి చూసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది జిల్లా ఎస్పీ తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా తిరగడం పార్టీ జెండాలను పార్టీ గుర్తులను ధరించి లోపలికి వెళ్లడం ప్రదర్శించడం లాంటివి చేయకూడదని తెలియజేశారు. మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ వస్తువులకు పోలింగ్ కేంద్రంలోనికి అనుమతి లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఆపరేషన్ బి సురేంద్రరావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సీఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేయి స్తంభాల ఆలయంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అమోఘం



**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 26 (జనం సాక్షి)**

: ఏవివి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక చారిత్రాత్మక వేయి స్తంభాల దేవాలయంలో ఏవివి కళాశాల, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్, మరియు కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ లకు చెందిన 60 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా క్యూలైన్లో మరియు మెడికల్ అసిస్టెన్సీ ముఖ్యంగా వాటర్ డిస్ట్రిబ్యూషన్ తదితర సేవా కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొని భక్తులను ఇటు అధికారులను మెప్పించారు .ఈ కార్యక్రమంలో పోగ్రామ్ ఇన్చార్జ్ ఏవివి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు, కేయూ బయోటెక్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి రాధిక మరియు వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆజం సీనియర్ వాలంటీర్లు దేవి శ్రీ ప్రసాద్, సాత్విక్ ,హరిణి( ఏవివి) హర్షవర్ధన్, పూజ, సాత్విక్, రోహిత్ (వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ )విష్ణు ,రాకీ ,ప్రతాప్ అండ్ పూజ (కేయూ బయోటెక్నాలజీ) తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరవాహిణి మాహానది ఒడ్డున శివోహం

**అదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :**





జిల్లాలో మహ శివరాత్రి పండుగ దినాన్నిపురస్కరించుకుని శివాల యాలన్ని శివ నామస్మ రణంతో మారు మోగిపోయాయి. జిల్లాలోని బోరజ్ మండలంలో గల కోరట గ్రామ శివారులోకాలానికి అతీతం గా పెన్ గంగా మహానది ఒడ్డునస్వయంభువు గా వెలిసిన అతి పురాతనమైన కాశి సమెత ఉత్తర వాహిని శ్రీ ఓం కారేశ్వర శివాలయంలో మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. అక్కడే నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు ఈ ప్రాంతంలో శివాలయానికి సంబంధించిన ఆనవాళ్లు శివలింగం వందల ఏళ్ల సంవత్సరాల క్రితం మహానది ఒడ్డున బయట పడటం జరిగిందని, అంతేకాకుండా గంగా నదిలోని నీరు ఉత్తర దిశలో ప్రవహిస్తుందని స్వయంభువు గా వెలిసిన ఈ ఆలయంకు ఘన చరిత్ర ఉందని పురతనం నుంచి ప్రచారంలో ఉంది. కాశీ పుణ్య క్షేత్రంలో గంగా నదీ ఏవిధంగా ఉత్తర దిశలో ప్రవహిస్తు ందో ఈ ప్రాంతంలో కూడా పెన్ గంగా నదీ లోని నీరు ఉత్తర దిశలో ప్రహహిస్తండడం గొప్ప విశేషం అని గ్రామస్తులు చెప్తుంటారు.

# శాసన మండలి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు

**జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ**

**భూపాలపల్లి, ఫిబ్రవరి 26 (జనం సాక్షి):**




శాసనమండలి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జరుగుతున్న పోలింగ్ మెటిరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నిర్వహణలో ఓటర్లు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటు హక్కు వినియోగానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల్లో పురుషులు 215 మంది మహిళా ఓటర్లు 114 మంది మొత్తం 329 మంది ఓటు హక్కు వినియోగించు కోవడానికి భూపాలపల్లి, మొగుళ్లపల్లి, చిట్యాల, గణపురం, రేగొండ, టేకుమట్ల, కొత్తపల్లి ఘోరి లాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయుల పట్టభద్రులకు మహా దేవపూర్, మహా ముత్తారం, మల్హర్ రావు, కాటారం, పలిమేల మండలాల్లో 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 64 మంది పురుషులు, 19 మంది మహిళలు మొత్తం 83 మంది ఓటు హక్కు విజియోగించుకోనున్నట్లు తెలిపారు. పట్టభద్రులకు సంబంధించి నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు 5 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహా దేవపూర్, మహా ముత్తారం, మల్హర్ రావు, కాటారం, పలిమేల మండలాల్లో ఏర్పాటు చేసిన ఈ పోలింగ్ కేంద్రాల్లో 1734 మంది పురుషులు, 749 మంది మహిళలు మొత్తం 2483 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 27వ తేదీన పోలింగ్

ముగిసిన తదుపరి ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ మెటీరియల్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన పట్ట భద్రులు, ఉపాధ్యాయులు తమ

ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నాలుగు రూట్లుగా విభజించి ప్రతి రూటుకు ఒక లైజన్ అధికారి, రూటు అధికారులను నియమించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# కురుమల అన్ని రంగాల్లో ముందుండాలి

**ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

**కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ**

**బచ్చన్నపేట :** కురుమలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. సిద్ధులగుట్ట దేవాలయం ఆవరణలో కురుమ సంఘం 2025 క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా విద్య పరంగా అన్ని రంగాలలో ముందుకు సాగుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కురుమల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కురుమల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ భానుక శివరాజ్, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత- వెంకన్న, సిద్దిపేట జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి అందే నాని కురుమ

, రాష్ట్ర నాయకులు అందే బీరన్న, అందె అశోక్, జంగిలి యాదగిరి, మీస సత్యనారాయణ, సూర్ణ శ్రీశైలం, కామల్ల అనిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి కనకయ్య, సూర్న శ్రీకాంత్, మీస పార్వతి-సత్యనారాయణ, గౌండ్ల శ్రీనివాస్, చిగుళ్ల రాములు, కడారి నవీన్, రాజు, మల్లేశం, మండల నాయకులు పాల్గొన్నారు.

# తొడసం కైలాష్ ని సన్మానించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :**

ఇటీవలే ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కైలాస్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎంపియుపిఎస్ గౌరాపూర్ మండల్ ఇంద్రవెల్లి గిరిజన భాషలు గోండ్ , కోలాం అభివృద్ధికై ఏఐ (కృత్రిమ మేధా)ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ తోడసం కైలాష్ తాను గిరిజన భాషల అభివృద్ధి కొరకై చేపడుతున్న కార్యక్రమాల గురించి తెలుసుకొని సన్మానం చేశారు. ఇదేవిధంగా ముందుకు వెళ్లాలని సూచన చేశారు. తనకు కావలసిన సహాయం అవసరమైనచో అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లో కైలాష్ జిల్లా కలెక్టర్ గారి పై తెలుగులో పాటను రాసి ద్వారా మ్యూజిక్ను అందిస్తూ రిలీజ్ చేయడం కూడా జరిగింది. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి టీ ప్రణీత , ఉపాధ్యాయులు అజయ్ , రమేష్ బాబు , వారి వెంట కుటుంబ సభ్యుల హాజరయ్యారు.

# ఆంధ్రప్రదేశ్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్

**అవకాశాలు కల్పించేందుకు తాజాగా చర్యలు**

**వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్నవారి వివరాలపై సర్వే**

**అమరావతి (జనంసాక్షి)**




ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ప్రతి రంగంలోనూ కొత్తకొత్త ఆలోచలనతో ముందుకెళ్తోంది. "స్వర్ణాంధ్ర విజన్- 2047, బ్రాండ్ ఏపీ" లక్ష్యంగా దూసుకెళ్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలు అందిస్తోంది. ప్రతి ఒక్కరికీ ఏదో ఓ మంచి చేయాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి అడుగులు వేస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు అర్హులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు కల్పించేందుకు తాజాగా చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ మరింత విస్తరించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు సంబంధించి తాజాగా సర్వే చేపట్టింది. ప్రతి ఇంట్లో 18 నుంచి 50 ఏళ్ల లోపు ఉన్నవారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు సేకరిస్తున్నారు. టెక్నికల్ స్కిల్స్, విద్యార్హతలు సహా ప్రస్తుతం చేస్తున్న పనికి సంబంధించిన వివరాలనూ తెలుసుకుంటున్నారు. అలాగే వారికి వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలపై ఆసక్తి ఉందా, లేదా? అనే అంశాలనూ ఆరా తీస్తున్నారు.

ఇప్పటికే వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూ వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్నవారి వివరాలు సైతం సేకరిస్తున్నారు. వారికి ఉన్న ఇబ్బందులు ఏంటి?, వర్క్ ఫ్రమ్ హోమ్‌లో వచ్చే సమస్యలు ఏంటి? అనే అంశాలనూ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారికి మెరుగైన వసతులు కల్పించేందుకు సైతం ఏపీ సర్కార్ సిద్ధం అవుతోంది. ఒకే ప్రాంతంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న 20 నుంచి 25 మందికి కలిపి సెంటర్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ మేరకు ప్రైవేటు భవనాలు అందుబాటులో ఉన్నాయా, లేదా? అనే అంశాన్నీ పరిశీలి స్తోంది. కాగా, మార్చి 10 వరకూ సర్వే చేసి అనంతరం డేటాను ప్రభుత్వానికి పంపనున్నారు ఉద్యోగులు. సర్వే రిపోర్టు వచ్చిన తర్వాత రాష్ట్ర యువతకు మరిన్ని వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు కల్పించేందుకు చంద్రబాబు సర్కార్ కృషి చేయనుంది. సర్వే అనంతరం ప్రముఖ కంపెనీలతో సమావేశమై వర్క్ ఫ్రమ్ హోమ్ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళికలు రచించనుంది. ఈ మేరకు బ్రాండ్ బ్యాండ్ కనెక్టివిటీ, స్పీడ్ ఇంటర్నెట్, తగిన వసతి కల్పనపైనా దృష్టి సారిస్తోంది. సర్వే తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ఎక్కువ మంది ఆసక్తి చూపితే ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి




- రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు
- రాహుల్ గాంధీ పేరిట పూజలు
- జాతరలో చిన్ననాటి మిత్రులతో కలసి మిఠాయిలు కొనుక్కొని సందడి
- మహాశివరాత్రి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**వైరా, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రపంచంలో తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా వారంతా క్షేమం గా ఉండాలని, అభివృద్ధి చెందాలని ఆ శివపార్వతులను వేడు కున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన శ్రీమతి మల్లు నందినితో కలిసి స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని పురాతన శివాలయంలో మధిర నియోజకవర్గ కేంద్రంలోని శివాలయంలో, చింతకాని మండలం నేరేడ, ముదిగొండ మండలం వల్లభి శివాలయాల్లో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ కుటుంబం పేరిట దేవాలయాల్లో పూజలు చేయించారు. ముదిగొండ మండలం వల్లభి గ్రామంలో రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులందరి పేరుపేరునా డిప్యూటీ సీఎం పూజలు చేయించారు. వారంతా సుభిక్షంగా ఉండాలని, మంచి కీర్తిని గడించాలని డిప్యూటీ సీఎం పూజలు చేయించారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని ఆయన పూజలు నిర్వహించారు. స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో శివపార్వతుల పూజ అనంతరం జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో చిన్ననాటి మిత్రులతో కలిసి కలియతిరిగారు. మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులైన ఓటర్లు..
# పెరుగుతున్న చెల్లని ఓట్లు

- గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో చెల్లని ఓట్లు
- ప్రాధాన్య ఓటు వేసే అవకాశం ఉన్న కేవలం ఓకే ఒక్క ఓటు వేయడానికి అసక్తి చూపుతున్న పట్టభద్రులు
- ఉత్తర తెలంగాణ పట్టభద్రుల స్థానంలో భారీగా పెరిగిన పట్టభద్రుల సంఖ్య
- పోలింగ్ శాతం పెరగడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేస్తున్న అభ్యర్థులు




**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** ఓటర్లంతా పట్టభద్రులయినా మీ ఓట్లను సరిగా వేయండి అంటూ విద్యవంతులకు ఒకటికి నాలుగు సార్లు చెబుతున్నారు అభ్యర్థులు .. అందుకు కారణం చదువుకున్నవారే అయినా పట్టభద్రుల ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు పెరుగుతుండటమే కారణం. గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో చెల్లని ఓట్లు పెరుగుతుండటం అభ్యర్థులను కంగారుకు గురిచేస్తోంది. ఉత్తర తెలంగాణ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ జరుగుతున్న వేళ అభ్యర్థులు టెన్షన్ కు కారణలు తెలుసుకుందాం..

పట్టభద్రుల ఎన్నికలు అంటేనే సాధరణ ఎన్నికల కంటే భిన్నంగా జరిగే ఎన్నికల ప్రక్రియ. కేవలం డిగ్రీ, అపై చదినిన వారు మాత్రమే ఓట్లు ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులు. మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్- కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో చాలామంది కొత్తగా పట్టభద్రులుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. సాధరణ ఎన్నికల్లో ఒకే ఓటును సులభంగా వేస్తారు. పట్టభద్రుల పోలింగ్ వచ్చే సరికి ప్రత్యేక తరహాలో ప్రాధాన్య ఓట్ల అధారంగా ఎన్నికలు జరుగుతుంటాయి. శాసన మండలి ఎన్నికల కోసం ఒక పట్టభద్రుడు బ్యాలెట్ పద్ధతి ద్వారా తనకు నచ్చిన ముగ్గురికి ప్రాధాన్యల వారీగా మూడు ఓట్లు వేయవచ్చు. ఎమ్మెల్సీ ఎన్నికలు పోలింగ్ విధానం ... సాధరణ ఎన్నికల పోలింగ్ కంటే భిన్నంగా ఉండటంతో చాలామంది అవగహన లేకుండా పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్నారు. ఎన్నికల నియామవళిని, సరైన పోలింగ్ విధానాన్ని అనుసరించకుండా తప్పుగా ఓట్లు వేస్తున్నారు. నిరాక్షరాస్యులు కాకపోయినా పోలింగ్ విధానంపై సరైన అవగాహన లేకపోవడంతో పట్టభద్రుల ఎన్నికల్లో చెల్లని ఓట్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది. గతేడాది 2024 జరిగిన నల్గొండ -వరంగల్ - ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో మొత్తం 3,38,179 ఓట్లు పోలైతే ..ఇందులో 27,990 ఓట్లు చెల్లనివిగా ఎన్నికల సంఘం ప్రకటించింది. అంతా విద్యావంతులే పాల్గొన్న ఈ పట్టభద్రుల ఎన్నికల్లో మొత్తం పోలైన ఓట్లలో ఎనిమిదో వంతు పట్టభద్రులు వేసినా ఓట్లు అసలు చెల్లకపోవడం ఫలితాల సమయంలో చర్చనీయంగా మారింది. భారీగా ఓట్లు చెల్లకుండా పోవడంతో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసింది. అలాగే 2021 జరిగిన నల్గొండ -వరంగల్ -ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల్లో 21,636 ఓట్లు చెల్లుబాటు కాలేదు.

ప్రసుత్తంగా జరుగుతున్న మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో చాలామంది కొత్తగా పట్టభద్రులుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. 2019లో జరిగిన మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల 196321 మందికి గాను 115359 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 9,932 ఓట్లు చెల్లకుండా పోయాయి. కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి విజయం సాధించిన ఈ ఎన్నికల్లో 59.38 మాత్రమే విద్యావంతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రసుత్త ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పెద్దఎత్తున పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకున్నారు. మొత్తం 3,55,159 మంది, అందులో పురుషులు 2,26,765 మంది, 1,28,392 మంది మహిళలు, ఇతరులు ముగ్గురు ఈ దఫా తమ ఓటుహక్కును వినియోగించుకోబోతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన 56 మంది తమ అద్రష్టంను పరీక్షించుకోబోతున్నారు. 2019 పట్టభద్రుల ఎన్నికలతో పోల్చితే సుమారు లక్షన్నరపైగా పట్టభద్రులు కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. వీరంతా తొలిసారి పట్టభద్రులు కోటాలో ఓటు వేయనున్న నేపథ్యంలో చెల్లని ఓట్లు మరింత పెరిగే అవకాశం ఉందని అభ్యర్థులు కలవరపడుతున్నారు.

ముఖ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పద్ధతులపై ,ఓట్లువేసే విధానం పైన ఎన్నికల సంఘంగాని, జిల్లా అధికారులు గాని చెప్పుకోదగిన స్థాయిలో పట్టభద్రులకు అవగహన కల్పించలేదని అంటున్నారు. ఓటు చాలా పవిత్రమైనది.. దాన్ని సరైన రీతిలో , తప్పులకు అస్కారం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. పోలింగ్ సందర్భంగా ఓటరుకు ఎలాంటి అనుమానాలు ఉన్న నివ్రత్తికి చేయడానికి ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నమని ...కానీ ఓటరు మాత్రం ఓటు నష్టపోకుండా సరైన విధానంలో ఓటు వేయలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే మాత్రమే కాకుండా ప్రాధన్య క్రమంలో మూడు ఓట్లు వేసే అవకాశం ఉన్నప్పటికి చాలమంది పట్టభద్రులు కేవలం ఒకే అభ్యర్థికి ఓకే ఓటు తొలి ప్రాధన్యత ఓటుగా వేసే వాళ్ల సంఖ్య కుడా పెరుగుతుంది. ఈ వైఖరి మొదటి ప్రాధన్యతతో కాకపోయినా ప్రాధాన్యత క్రమంలోనైనా గెలుస్తమని అశించే అభ్యర్థులను అందోళనకు గురిచేస్తున్నది. ఒకవైపు చెల్లని ఓట్లు మరోవైపు కేవలం మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రమే వేస్తున్న వారి సంఖ్య పెరుగుతుండటం ఇవే ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉంటున్నాయి. మొదటి ప్రాధన్యత ఓట్లు, చెల్లని ఓట్లు పోటిలో ఉన్న అభ్యర్థులు భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. మరో వైపు లక్షన్నరకు పైగ ఓటర్ల సంఖ్య పెరిగినా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వస్తరో లేదో అనే అనుమానం కుడా అభ్యర్థుల్లో కన్పిస్తుంది. చాలామంది పట్టభద్రులు వివిధ రకాల ఉద్యోగాలు చేసుకుంటూ హైదరాబాద్‌తో సహా వివిధ ప్రాంతల్లో ఉంటూ.. అన్ లైన్ ద్వారా తమ ఓటును నమోదు చేసుకున్నారు. స్థానికంగా లేని పట్టభద్రులు కేవలం పోలింగ్ కోసమే ఏమేరకు తమ సొంత ఊర్లకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటారో వేచిచూడాలి. పట్టభద్రులను పోలింగ్ కేంద్రాలను రప్పించడమే లక్ష్యంగా కొందరు అభ్యర్థులు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందిచారు. తీవ్రపోటీ వాతవరణంలో జరుగుతున్న మెదక్ -ఆదిలాబాద్ -నిజామాబాద్ - కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థులు భవితవ్యం పోలింగ్ శాతం పైనే అధారపడి ఉన్నది. 15 జిల్లాల పరిధిలోని విద్యావంతులు పాల్గొనే ఈ పట్టభద్రుల ఎన్నికలు.. భవిష్యత్తు రాష్ట్ర రాజకీయాలను ఖచ్చితంగా ప్రభావం చూపించబోతున్నది. విద్యావంతులు ఏ తీర్పు ఇస్తరనే అసక్తి అందరిలో రాష్ట్రమంతటా కన్పిస్తున్నది.

## ప్రజలు ఆయురారోగ్యాలతో
# సుభిక్షంగా ఉండాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ




**మెదక్ బ్యూరో (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఏడుపాయల వనదుర్గ అమ్మవారి మహాశివరాత్రి ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవతగా పిలవబడే వనదుర్గ అమ్మవారి జాతరకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పిల్లాపాపలతో జాతరకు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోతాయని అని అన్నారు. నేడు వనదుర్గ అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, జాగారాలు ఉండేందుకు భక్తులు చేరుకుంటారని వివరించారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గాను కలెక్టర్ నేతృత్వంలో సంబంధిత ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. మంత్రి వెంట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, డి సిసి అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, రామయంపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చౌదరి సుప్రభాత రావు, కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, భరత్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తాం : ఎంపీ మల్లు రవి



**అచ్చంపేట (జనంసాక్షి) :** శ్రీశైలం దోమలపెంటలోని ఎస్ఎల్‌బీసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో వివిధ రకాల రిస్క్ ఆపరేషన్ బృందాల హెడ్ ఆఫీసర్లతోరాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి,రోడ్లు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎంపీ డాక్టర్ మల్లు రవి సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ తమ మంత్రుల బృందం,మా ఉన్నత అధికారుల బృందం ఎప్పటికప్పుడు ఈ రిస్కు ఆపరేషన్ గురించి అధికారులతో సమీక్షించి ఆపరేషన్‌ను ముందుకు తీసుకెళ్తున్నారని, ఈ రిస్క్ ఆపరేషన్ విజయవంతం కావడానికి ప్రపంచ నలుమూలల ఉన్న 10 ఏజెన్సీ టన్నెల్ ఎక్స్పర్ట్ లను రప్పించి ఆ ఎనిమిది మందిని సురక్షితంగా బయటికి తీసుకురావడానికి తమ ప్రభుత్వం అన్ని విధాలా సహాయక చర్యలు వేగవంతంగా చేపడుతున్నారని, రెండు రోజుల్లో రిస్క్ ఆపరేషన్ కంప్లీట్ చేస్తామని అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, జడ్చర్ల శాసనసభ్యులు అనూరుద్ రెడ్డి, నాగర్ కర్నూల్ కలెక్టర్ బాధవత్ సంతోష్, సీఎండీ ముషరాఫ్ ఫరూకి, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## గరళకంఠుడి కృప అందరిపై ఉండాలి

- రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలకు గరళకంఠుని దీవెనలు ఉండాలని ప్రార్థించారు. పవిత్ర శివరాత్రి సందర్భంగా శివ భక్తులు ఉపవాస దీక్షను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించడం హిందూ సంప్రదాయంలో ప్రత్యేకతను సంతరించుకుందని కేసీఆర్ అన్నారు. దేశ వ్యాప్తంగా శివాలయాలు, భక్తుల శివనామస్మరణతో మారుమోగుతాయని అన్నారు. గరళాన్ని తన కంఠంలో దాసుకుని ముల్లోకాలను కాపాడుతున్న ఆ ఉమా శంకరుని కరుణాకటాక్షాలు తెలంగాణ ప్రజలకుండాలని ఆకాంక్షించారు. సుఖ శాంతులతో జీవించేలా ప్రజలందరినీ దీవించాలని కేసీఆర్ ఆ మహాశివున్ని ప్రార్థించారు.

# ఉద్దేశపూర్వకంగానే ఏపి అధికారుల డుమ్మా

**హైదరాబాద్, ఫిబ్రవరి26 (జనంసాక్షి) :** కృష్ణానదీ యాజమాన్య బోర్డు చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో హైదరాబాద్‌లోని జలసౌధలో కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. భేటీలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ పాల్గొన్నారు. ఈ సమావేశానికి కూడా ఏపీ నుంచి అధికారులు హాజరుకాకపోవడంతో గురువారం మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. ఏపీ అధికారులు హాజరుకాకపోవడంపై రాహుల్ బొజ్జా అసంతృప్తి వ్యక్తం చేశారు. బోర్డు సమావేశం ఏర్పాట్లు చేస్తే.. ఉద్దేశపూర్వకంగానే ఏపీ అధికారులు రాలేదని పేర్కొన్నారు. తన వాదనలు రికార్డు చేసి కేంద్రానికి పంపాలని కోరారు. శ్రీశైలం, సాగర్ నుంచి మే వరకు తమకు 55 టీఎంసీల నీరు కావాలని ఇప్పటికే ఏపీ సర్కారు ప్రతిపాదించింది. శ్రీశైలం, సాగర్ నుంచి మే వరకు తమకు 63 టీఎంసీల నీరు కావాలని తెలంగాణ కోరింది.

# నన్ను ఎవరూ అరెస్ట్ చేయలేదు..

- పైలెట్ రోహిత్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 26(జనంసాక్షి) :** తనను దుబాయిలో అరెస్ట్ చేశారని ప్రచారం జరుగుతోందని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. తాను హైదరాబాద్ మణికొండలోని తన నివాసంలో ఉన్నానని ఆయన తెలిపారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారం నమ్మవద్దన్నారు. కొందరు కావాలనే ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాండూరు ప్రజలు చింతించాల్సిన అవసరం లేదన్నారు. తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని చెప్పారు. తాండూరు ప్రజానికి, స్నేహితులు, కార్యకర్తలకు మరోసారి శివరాత్రి శుభాకాంక్షలు చెతున్నానంటూ పైలట్ రోహిత్ రెడ్డి వీడియో విడుదల చేశారు.

## మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, హరీశ్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి26 (జనంసాక్షి) :** తెలుగు ప్రజలందరికీ బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ పరమశివుని ఆశీస్సులతో ప్రజలందరికీ శుభం జరగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. మహాశివరాత్రి సందర్భంగా సిద్దిపేట శ్రీ ఉమా పార్థివ కోటిలింగాల దేవాలయంలో స్వామి వారిని బుధవారం ఉదయం హరీశ్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. స్వామి వారి దయతో కేసీఆర్ నాయకత్వంలో ఈ ప్రాంతంలో కాళేశ్వరం జలాలు పరవళ్లు తొక్కుతున్నాయని అన్నారు. ప్రజలందరిపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370